14-09Pg1exHMNWJQEVK 1ONG_14-09Pg1exHMNWJQEVK.qxd 9/14/2025 12:21 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
ఒంగోలు
: fb.com/vaartha Digital
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
14-9-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 224 పేజీలు: 12 వెల: 8.00

భారీగా ఐపిఎస్‌ల బదలీలు 2లో
భారత్‌పై సుంకాలకు జి-7 దేశాలు సిద్ధం 9లో

## వైషమ్యాలు సృష్టించే ఉచ్చులో పడొద్దు



### కుట్రలు చేసేవారిని పదేళ్లుగా చూస్తున్నాం
### వారిపై చట్టప్రకారం చర్యలు: డిసిఎం పవన్

**విజయవాడ,సెప్టెంబరు 13.ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో అభివృద్ధి దిశగా సంక్షేమ ఫలాలు అందిస్తూ సుపరిపాలన సాగిస్తున్న ఈ తరుణంలో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించే విధంగా కుట్రలు మొదలయ్యాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సోషల్ మీడియా 'ఎక్స్' ట్వీట్‌లో పిలుపునిచ్చారు. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి. సామాజిక మాధ్యమాల ముసుగు మార్గంలోనో, యూట్యూబ్ ఛానెళ్ల పేరుతోనో, మరో విధంగానో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారు. ఇలా కుయుక్తులతో సమాజంలో అశాంతి, అభద్రత కలిగించే వ్యక్తులు నైజాన్ని పదేళ్లుగా చూస్తున్నారు. వారి ఉచ్చులోపడి, ఆవేశాలకులోనై, ఘర్షణ వాతావరణానికి తావివ్వవద్దు. అలా ఆవేశాలు చూపిస్తే కుట్రదారుల ఆశించిన ప్రయోజనాలు నెరవేరుతాయి..ఖి అని పవన్ కళ్యాణ్ తెలియజేశారు. ఇటీవల మచిలీపట్నంలో చోటు చేసుకున్న ఘటనలు ఇందుకు ఉదాహరణ. ఒక యూట్యూబ్ ఛానెల్‌లో ఒక వ్యక్తి అభ్యంతరకర భాష ఉపయోగించి మాట్లాడాడు. అతను ఆ విధంగా మాట్లాడేలా సిద్ధం చేసి, ప్రచారం చేయడం వెనక ఉన్న కుత్సిత ఆలోచనను పసిగట్టాలి. చట్ట ప్రకారం కేసులుపెట్టి దానిపై ముందుకు వెళ్ళాలి. తొందరపడి మరో మార్గంలో ఘర్షణ పడటం వల్ల సమస్య జటిలం అవుతుంది. ప్రజల మధ్య సామరస్య వాతావరణం చెడగొట్టి రెచ్చగొట్టే నాయకులు బయటకు వస్తారు. ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టాలి కులాలు, మతాల మధ్య విభేదాలు తీసుకొచ్చే విధంగా ప్రవర్తించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా ఫిర్యాదు

>>2

# శాంతిభద్రతలే ప్రభుత్వ లక్ష్యం

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణ తనకు అత్యంత ప్రాధాన్యమైన అంశమని..ఈ విషయంలో రాజీ అనేది లేదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.లా అండ్ ఆర్డర్ బాగుంటేనే పెట్టుబడులు వస్తాయి. ప్రజలకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయి. రాష్ట్ర గ్రోత్ రేట్ పెరుగుతుంది. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇదే నా విధానం అని సీఎం అన్నారు. జిల్లాల ఎస్పీల బదిలీ నేపథ్యంలో వారితో సీఎం సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతలు సహా పలు అంశాలపై ఎస్పీలకు దిశా నిర్దేశం చేశారు. కొందరు ఎస్పీలు నేరుగా సమావేశానికి హాజరు కాగా మరికొన్ని జిల్లాల ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 'రాజకీయ ముసుగులో నేరాలను ఉపేక్షించకండి. నేరాల తీరు మారింది. కొత్త తరహా నేరాలు, నేరస్తులు వచ్చారు. ఈ విషయంలో పోలీసులు కూడా అప్ డేట్ కావాలి. అప్పుడే శాంతి భద్రతలను పటిష్టంగా కొనసాగించగలం' అని సీఎం అన్నారు.

**ఫ్యాక్షన్‌ను అంతం చేశాం... రౌడీయిజాన్ని రూపుమాపాం:** అన్ని కోణాల్లో ఆలోచించి మీకు ఎస్పీలుగా అవకాశం ఇచ్చాను. బెస్ట్ ఫెర్మామెన్స్‌తో ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి. తొలిసారి సీఎం అయినప్పటి నుంచి నా ఫోకస్ లా అండ్ ఆర్డర్ మీదే ఉండేది. ఫ్యాక్షనిజం, నక్సలిజం, రౌడీయిజం, మత ఘర్షణలు వంటి వాటి విషయంలో చాలా కఠినంగా ఉండేవాడిని. ఫ్యాక్షన్ అణిచివేత కోసం మా పార్టీ ప్రజా ప్రతినిధులను కూడా అరెస్టు చేసిన సందర్భాలు రాయలసీమలో ఉన్నాయి. అంత కఠినంగా ఉండడం వల్లనే నాడు ఫ్యాక్షన్‌ను దూరం చేయగలిగాం. ఫ్యాక్షన్‌లో ప్రాణాలు కోల్పోయిన వారి పిల్లలను ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్‌లో చదివించాను.

### పెట్టుబడులకు అదే కీలకం
### వివేకా హత్య, సింగయ్య మృతిని కేస్ స్టడీలుగా చూడండి
### రియాక్ట్, రీచ్, రెస్పాండ్, రిజల్ట్ విధానం పాటించండి
### బదలీ అయిన ఎస్పీలతో విసిలో మాట్లాడిన సిఎం చంద్రబాబు



శనివారం జిల్లా ఎస్పీలతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత, సిఎస్ విజయానంద్, డిజిపి హరీష్‌కుమార్ గుప్తా తదితర అధికారులు

వారు మళ్లీ ఫ్యాక్షన్ వైపు వెళ్లకుండా చర్యలు తీసుకున్నాను. నాడు తెలంగాణలో నక్సల్ విషయంలో చాలా భయంకరమైన పరిస్థితులు ఉండేవి. తెలంగాణ పల్లెల నుంచి హైదరాబాద్ సరిహద్దు జిల్లాల వరకు నక్సలైట్లు ఉండేవాళ్లు. దీంతో చాలా మంది తెలంగాణ నేతలు ఎన్నికల సమయంలో తప్ప గ్రామాలకు వెళ్లే వాళ్లు కాదు. ఒకసారి పోలీస్ స్టేషన్ పేల్చివేస్తే పోలీసులు వెళ్లడానికి భయపడ్డారు. నేను స్వయంగా వెళ్లి పోలీసుల్లో స్థైర్యం నింపాను. తరువాత గ్రేహౌండ్స్ వంటి విభాగాలను తెచ్చాం. దీంతో నక్సలిజాన్ని అణిచి వేశాం. నాడు ఉప ప్రధానిగా ఉన్న అద్వానీని ఆహ్వానించి ఈ కార్యక్రమాలు వివరించాను. అని సీఎం చంద్రబాబు అన్నారు.

నాడు చాలా కఠినంగా ఉన్నాను కాబట్టే అలిపిరిలో నాపై దాడి చేశారు. నాపై దాడి సమయంలో ముందు అది ప్రమాదం అనుకున్నాను. కానీ బాంబు దాడి అని అక్కడకు వచ్చిన ఎస్పీ చెప్పారు. నాతో ఆసుపత్రికి ఎందుకు వచ్చారు? వెంటనే ఆ ఏరియాను బ్లాక్ చేసి సెర్చ్ ఆపరేషన్ చేయండని ఆదేశించాను. ఇంకా ఏమైనా క్లైమోర్ మైన్లు ఉంటే తొలగించాలని వేరే వాళ్లకు వాటితో ప్రమాదం వాటిల్లకుండా చూడాలని పోలీసులకు చెప్పాను. దొరికిపోతాం అనే భయం ఉంటే నేరాలు తగ్గించవచ్చు. బెజవాడలో రౌడీ వ్యవహారాలు ఎక్కువగా ఉండేవి. సమర్థులైన అధికారులతో ఇక్కడ రౌడీయిజం లేకుండా చేశాం. నాడు కఠినంగా

>>2



# ఆరిన సెగల నుంచి శాంతికపోతాలు..

### మణిపూర్ వాసులకు అండగా ఉంటా
### ఘర్షణల అనంతరం తొలిసారి రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని మోడీ

**ఇంపాల్, సెప్టెంబరు 13:** ఈశాన్యరాష్ట్రంలో ప్రత్యేకించి మణిపూర్ ధైర్యవంతులు, సాహసవంతుల భూమి అని రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధిపథంలోకి తీసుకువస్తామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. పేరులో ఉన్న మణికి ఈశాన్యరత్నం అని అర్థమని ఇలాంటి అందమైన ప్రాంతంలో హింస చెలరేగిందని ఆందోళన వ్యక్తంచేసిన ప్రధాని ఇపుడు మళ్లీ ఉషస్సు ప్రారంభం అవుతున్నదని, ప్రజలు శాంతిమార్గం ఎంచుకున్నారని, శాంతిచర్చలు షురూ అయ్యాయని నేను ఎప్పటికీ మీతోనే ఉంటానని, కేంద్రం మీ వెంటనే ఉంటుందని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రాష్ట్రం శాంతికి చిహ్నంగా మారాలని తాను అభిలషిస్తున్నట్లు మోడీ చెప్పారు. వర్షంసైతం లెక్కచేయకుండాసభకు వచ్చిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మణిపూర్‌లో చెలరేగిన హింసవల్ల శరణార్థులుగా మారిన వారిని శిబిరాల్లో మోడీ పరామర్శించారు. 2023లో ప్రారంభంఅయిన ఈఘర్షణలు రెండేళ్ల తర్వాత ప్రధాని తొలిసారి రాష్ట్రంలో పర్యటించారు. ఈసందర్భంగా 9వేల కోట్ల విలువైనప్రాజెక్టులకు భూమిపూజ, ప్రారంభోత్స వాలు చేసారు. ఈసభలో మోడీ మాట్లాడుతూ ఈ ఏడాది మొదటి త్రైమాసికంలోనే భారత ఆర్థిక వ్యవస్థ 7.8శాతం వృద్ధిని నమోదుచేసిందన్నారు. అత్యంత వేగంగా అభివృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థగా భారత్ఇపుడు ప్రపంచాన్ని ఆకర్షిస్తోందన్నారు. మేకిన్ ఇండియాతో ఎగుమతుల్లో వృద్ధిని నమోదు చేసామని,కాంగ్రెస్ హయాంలో ఔషధాలు, బీమాపైనా అధికపన్నులు వేసారన్నారు.

# అమరావతి అభివృద్ధిని అడ్డుకోలేరు..

### విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం
### పోలవరం -బనకచర్ల లింక్ నిర్మిస్తాం: సిఎం చంద్రబాబు

**విజయవాడ సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి అభివృద్ధిని ఎవ్వరు ఆపలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.సముద్రంలో కలిసి పోయే మిగుల జలాలను వృధాగా సముద్రంలోకి పోకుండా ఒడిసి పట్టి రాయలసీమకు నీరందించాలన్నదే పోలవరం -బనచర్ల లింక్ ప్రాజెక్టు అన్నారు.నిర్దిష్ట లక్ష్యం రూపొందించుకుని,అన్ని అనుమతులతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని . భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఇది తన బాధ్యత అని స్పష్టం చేశారు.రాష్ట్ర అభివృద్ధి కోసం విజన్ కల్పన చేయటంతో పాటు దాన్ని సుసాధ్యం చేసే దిశగా పనిచేయాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. భవిష్యత్ తరాల కోసమే విజన్‌ను రూపొందించి అమలు చేస్తున్నామని.. జాతీయ స్థాయిలో వికసిత్ భారత్2047 అమలు చేస్తుంటే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర2047 విజన్ సిద్ధం చేసి అమలు చేస్తున్నామని వెల్లడించారు. శరీరానికి పోషకాలు ఎంత అవసరమో సమాజానికి మంచి పాలసీల అవసరం అంతే ఉందని సీఎం అన్నారు. వచ్చే 22 ఏళ్లలో మన రాష్ట్రం ఎక్కడ ఉండాలన్న అంశాన్ని నిర్దేశించేందుకే విజన్ రూపొందించి అమలు చేస్తున్నట్టు వివరించారు. సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ విధానాలపై సమగ్రమైన సమాచార పత్రాన్ని రూపొందించారు.సీఎంవో కార్యాలయం ఈ పత్రాన్ని నేడు సమాచార శాఖ ద్వారా విడుదల చేసింది.వచ్చే దశాబ్ద కాలంలో ఏపీ ఎలా ఉండబోతోందన్న అంశాన్ని వెల్లడించారు.రాష్ట్రంలోని స్టేక్ హోల్డర్లను భాగస్వాములను చేస్తూ ఈ తరహా కాంక్లేవ్ నిర్వహించడం మంచి పరిణామం. 25 ఏళ్ల క్రితం భారతీయులకు సరైన గుర్తింపు లేని సమయంలో తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి భారతదేశం అభివృద్ధి అన్‌స్టాపబుల్‌గా మారింది. 2038 నాటికి భారత దేశం నెంబర్1 అవుతుంది. ఇందులో తెలుగు వారి పాత్ర ప్రధానంగా ఉండాలని భావిస్తున్నాను. ఈ ఏడాది గతేడాది డబుల్ డిజిట్ గ్రోత్ సాధించగలిగాం. 2028-29 నాటికి రూ. 29,29,402 కోట్ల మేర జీఎస్డీపీ సాధించగలమని సీఎం పునరుద్ఘాటించారు.. 2029-2034 నాటికి రూ. 57,21,610 కోట్ల జీఎస్డీపీ సాధించేలా ప్రణాళికలు రూపొందించాం. దీన్ని సాధించే బాధ్యత ఎన్డీఏ కూటమి తీసుకుంటుంది. 2028-29 నాటికి తలసరి ఆదాయాన్ని రూ. 5,42,985 సాధిస్తాం. 2029- 2034 నాటికి తలసరి ఆదాయం రూ.10.55 లక్షల కోట్ల సాధించగలం. ఇదేమీ అసాధ్యం కాదు. నిర్దిష్టమైన ఆలోచనతోనే ప్రణాళికలు వేశాం. దీనికి సంకల్పంతో పాటు మెగా డ్రీమ్స్ ఉండాలి. విజన్ 2020 సాకారం అయ్యాక కూడా విజన్ డాక్యుమెంట్లపై ఇంకా అనుమానాలు సరికాదు. భారత్ లాంటి దేశాల్లో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాతరంగా అమలు చేయాలి.సూపర్ సిక్స్ ద్వారా సంక్షేమం చేస్తున్నామని తెలిపారు.అభివృద్ధికి అదే తరహాలో నిధులిస్తున్నాం. రాజకీయాలు అవసరమే కానీ...సమాజం గురించే ఆలోచించాలి. రాజకీయాలే ఆలోచించి ఉంటే హైదరాబాద్ అభివృద్ధి జరిగేది కాదు.. విద్యుత్ సంస్కరణలు వచ్చేవి కావు. సీఎంగా భావితరాల కోసం ఆలోచన చేయాలి. 1994లో చాలా కఠిన నిర్ణయాలు తీసుకున్నాను. ఇప్పుడు సంపద సృష్టిస్తున్నాం..పేదలకు అందిస్తున్నాం. ప్రజలందరికీ ప్రయోజనం కలిగేలా మంచి పబ్లిక్ పాలసీలు తీసుకువచ్చాం" అని ముఖ్యమంత్రి అన్నారు.

విశాఖ, అమరావతి, విజయవాడ, తిరుపతి వంటి నగరాల అభివృద్ధిపై దృష్టి పెడుతున్నాం. అమరావతిలో ప్రారంభించిన ప్రతి పని రాబోయే మూడేళ్లల్లో పూర్తి అవుతుంది. రూ.50 వేల కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు పూర్తిఅవుతాయి. ప్రధాని చేతుల మీదుగా ఇవి ప్రారంభం అవుతాయి. 2019లో గెలిచి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి అయ్యేది. గత ప్రభుత్వ నిర్వాకం వల్ల డయాఫ్రం వాల్ దెబ్బతింది. అధికారంలోకి వచ్చాక పోలవరంపై దృష్టి పెట్టాం. 2027 డిసెంబరు నాటికి పోలవరం పూర్తి చేస్తాం. కియా ఫ్యాక్టరీ కోసం గొల్లపల్లి రిజర్వాయరును ఒక్క ఏడాదిలో పూర్తి చేసి నీరిచ్చాం. హంద్రీనీవా ప్రాజెక్టు కాల్వల విస్తరణ పనులు కేవలం 100రోజుల్లో పూర్తి చేసి నీరు ఇచ్చాం." అని సీఎం వివరించారు. అడవితల్లి బాటల్లో కార్యక్రమం ద్వారా రూ.1,000 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టిన మారుమూల గిరిజన ప్రాంతాలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేస్తున్నామని వెల్లడించారు. ఇమామ్‌లకు 10,000, మోజన్లకు 5,000 చొప్పున గౌరవవేతనం ఇస్తున్నామన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో సోషల్ మీడియాలో మహిళలపై అసభ్యకర పోస్టులు పెడితే కఠినంగా వ్యవహరిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతున్నామని చెప్పారు. ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించటమే కూటమి ప్రభుత్వ ఆశయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

### సిబిఐ చార్జిషీటు ఇవ్వకుండా
# కోర్టుకు హాజరు కాలేం
### అయేషామీరా తల్లిదండ్రులు

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణాజిల్లా(ఇప్పటిఎన్టీఆర్) జిల్లా ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతిగృహంలో జరిగిన బి.ఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్య కేసులో మళ్ళీ సంచలనం సృష్టిస్తుంది. ఈ కేసును పునర్విచారించిన సీబీఐ సత్యంబాబుపై పెట్టిన ఐపీసీ 376, 302 సెక్షన్లపై ఈ నెల 19న విజయవాడలోని సీబీఐ న్యాయస్థానానికి హాజరై ఏమైనా అభ్యంతరాలుంటే చెప్పాలని ఆయేషామీరా తల్లిదండ్రులు షంషాద్‌బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషాలకు సనోటీసులు పంపింది. ఈ కేసులో సీబీఐ నివేదిక వివరాలు తమకు ఇవ్వలేదని, కోర్టు విచారణకు హాజరు కాలేమంటూ ఆయేషా తల్లిదండ్రులు సమాధానం ఇచ్చారు. 2007 డిసెంబరు 27న రాత్రి ఇబ్రహీంపట్నంలోని మహిళల వసతిగృహంలో విద్యార్థిని ఆయేషా మీరా హత్యకు గురయ్యారు.ఈ క్రమంలోనే నందిగామలో ఎస్సీ హస్టల్ వాచ్‌ఉమెన్ వరలక్ష్మి హత్యకు గురయ్యారు.అంతకు ముందు నంది గామలో ఓవిద్యార్థినీల వసతగృహంలోను,ఎస్సీ బాలిక సంక్షేమ పాఠశాలల్లో ఆ గంతకుడు ప్రవేశించిన ఆరోపణలు ఉన్నాయి. తరువాత కొద్దినెలలు ఇటువంటి ఘటనలు సద్దుమణిగినా, నంది గామ మహిళా పాలిటెక్నికల్ కళాశాలల్లో ఓ యువకుడుప్రవేశించిన ఘటన చోటు చేసుకుంది. ఆశోక్‌నగర్‌లో రమాదేవి అనే గృహిణిపై హత్యాయత్నం జరిగింది.ఈ కేసుల్లో నందిగామకు చెందిన పిడతల సత్యంబాబు అనే భవన నిర్మాణ కార్మికున్ని 2008 ఆగస్టులో అరెస్టు చేశారు. ఆ సందర్భంలో సత్యంబాబు తనకు తానుగా అయేషా మీరాను హత్య చేసినట్లు అంగీకరించాడని పోలీసులు వెల్లడించారు.దీనిని దళిత సంఘాలు వ్యతిరేకిస్తూ ఆందోళన చేసాయి.ఈ క్రమంలో విజయవాడ మహిళా సెషన్స్ కోర్టు అతడికి జీవితఖైదు విధించింది.దీనిపై సత్యంబాబు తల్లి మరియమ్మ, ప్రజా సంఘాలు ఏపీ హైకోర్టును ఆశ్రయించాయి.2017మార్చి 31న ఉమ్మడి హైకోర్టు ఈ కేసును కొట్టివేసి సత్యంబాబుని నిర్దోషి అంటూ తీర్పు ఇచ్చింది.సత్యంబాబు నేరస్తుడని కేవలం డిఎన్ఏ పరీక్షలు ఆధారంగా నిర్ధారించలేమని, పోలీసు చార్జిషీటులో ఏ అంశాన్ని పోలీసు నిరూపించలేకపోయిందని హైకో ర్టు వ్యాఖ్యానించినట్లు సమాచారం.ఈ క్రమంలో ఆయేషా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించగా కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించారు. 2018లో పునఃదర్యాప్తు బాధ్యతలు తీసుకున్న సీబీఐ 3 నెలల క్రితం నివేదికను హైకోర్టుకు అందజేసింది.అయితే ఆ నివేదికను తమకు ఇవ్వాలంటూ ఆయేషా మీరా తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు.ఈ విషయాన్ని దిగువ కోర్టులో తేల్చుకోవాలన్న హైకోర్టు సూ చన మేరకు విజయవాడలోని సీబీఐ న్యాయస్థానంలో పిటిషన్ వేసినా వారికి ఇంతవరకు నివేదిక ఇవ్వలేదు.

### కత్తితో పొడిచి
# ప్రియురాలి హత్య
### ప్రేమోన్మాది ఘాతుకం, నెల్లూరులో సంచలనం



సాహితి(ఫైల్)

**నెల్లూరు క్రైమ్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** శనివారం తెల్లవారుజామున నగరంలోని పోస్టల్ కాలనీలో చోటు చేసుకున్న సంఘటన సం చలనంగా మారింది. పోలీసుల కథనం, సేకరించిన సమాచారం మేరకు బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లి గ్రామానికి చెందిన గిరిబాబు, శ్రీలక్ష్మి దంపతులకు మైథిలి ప్రియ(23), సాహితిలు ఇద్దరు సంతానం. సాహితి గూడూరులోని విద్యాసంస్థలో ఇంజనీరింగ్ చదువుతూ స్థానిక పోస్టల్ కాలనీలో రూములో అద్దెకు ఉంటున్నారు. అదే గదికి ఎదురుగా అద్దెకు ఉంటున్న బుచ్చిరెడ్డిపాలెం మండలం మినగల్లు గ్రామానికి చెందిన నిఖిల్, మైథిలి ప్రియలు ఒకే కళాశాలలో చదువుతున్న సమయంలో ఒకరినొకరు ఇష్టపడి ప్రేమించుకున్నారు. ఈనెల ఆరో తేదీ మైథిలి పుట్టినరోజు కావడంతో నెల్లూరు లోని తన చెల్లెలి గదికి వచ్చారు. అక్కడే కుటుంబ సభ్యులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరు పుకున్నారు. ఈ క్రమంలో ఈనెల 12వ తేదీ చెల్లెలు సాహితితో కలిసి నిద్రపోయారు. మధ్య రాత్రి మెలకువ వచ్చిన చూడగా అక్క లేకపోవడంతో ఫోన్‌కు కాల్ చేసి ఎక్క డున్నావని అడిగారు. వేరే స్నేహితులతో మాట్లాడుతున్నాను వెంటనే వస్తానని ఆమె చెప్పడంతో సాహితి నిద్రపోయారు. తెల్లవారుజాము సమయంలో నిఖిల్ నుండి ఫోను రావడంతో సాహితిఫోను తీసి అడగగా మీ అక్క పడిపోయి ఉన్నారు, తీసుకెళ్లమని చెప్పి ఫోన్ కట్ చేశాడు. నిఖిల్ గది మెట్ల పైన చలనం లేకుండా రక్త గాయాలతో పడి ఉన్న మైథిలిని చూసి ఏమైందని నిఖిల్‌ను ప్రశ్నించారు. ఇద్దరి మధ్య కొన్ని విషయాలలో వాదోపవాదాలు రావడంతో తానే కోపంతో మైథిలిని కత్తితో పొడి చినట్లు తెలిపాడు. వెంటనే సాహితి తన తల్లిదండ్రులతో పాటు పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

### 24న విజయవాడలో
# దళిత రణభేరి

**చిత్తూరుహెల్త్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** దళితులపై దాడులను అరికట్టాలని, సామాజికంగా, ఆర్థికంగా దళితులకు జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ ఈ నెల 24వ తేదీన విజయవాడలోని గాంధీనగర్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించతలపెట్టిన 'దళిత రణభేరి' కార్యక్రమంను విజయవంతం చేయాలని రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ కార్యదర్శి కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. చిత్తూరులో శనివారం రాష్ట్ర బహుజన సమాజ్ పార్టీ కార్యదర్శి కె.ప్రభాకర్ దళిత రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు అగ్రకులాలు దళితులకు వ్యతిరేకంగా అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. సంబం ధిత ఉన్మాదుల దాహానికి సామాన్యులైన బహు జన కులాలు ఆహుతి అవుతున్నాయని ఆరోపించారు. డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో సైతం దళితులపై దాడులు ఆగడం లేదని ఆరోపించారు.

# మరో 2రోజులు భారీ వర్షాలు

### పశ్చిమమధ్య, వాయవ్యబంగాళాఖాతం, ఉత్తరాంధ్రతీరంలో అల్పపీడనం
### శ్రీకాకుళం, కోనసీమ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ పలు జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి.అల్పపీడన ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి.పశ్చిమ మధ్య, వాయవ్య బంగాళాఖాతం, ఉత్తరాంధ్రదక్షిణ ఒడిశా తీరాల్లో అల్పపీడనం కొనసాగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది 48 గంటల్లో దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా పశ్చిమ వాయవ్య దిశగా కదిలే అవకాశం ఉందని వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఛత్తీస్‌గఢ్, విదర్భ మీదుగా దక్షిణ మహారాష్ట్ర వరకు ద్రోణి కొనసాగుతోందన్నారు. వీటి ప్రభావంతో రాష్ట్రంలో ఆదివారం అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్ల కింద నిలబడరాదని సూచించారు. ఆదివారం శ్రీకాకుళం, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.పార్వతీపురం మన్యం జిల్లాలో ఏఎన్ఎం, ఆశ వర్కర్ తమ వృత్తి పట్ల నిబద్ధతను చాటుకున్నారు. సాలూరు మండలం తోనాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అక్కడి పెద్ద ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో ఏరుకు అవతలి వైపు గ్రామాలకు వెళ్లడం కష్టంగా మారింది. ఆశా వర్కర్‌తో కలిసి ఏఎన్ఎం సావిత్రి వరద ఉధృతిని చూసి వెనకడుగు వేయకుండా గర్భిణీలకు టీకాలు వేసేందుకు ఏరు దాటి వెళ్లారు. మహిళలైనా భయపడకుండా సమయానికి వెళ్లి గర్భిణీలకు టీకాలు వేసినందుకు వారిని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అజయ్ అభినందించారు.అల్పపీడనం కారణంగా విజయవాడలో మోస్తరు వర్షం కురిసింది. దీంతో రాకపోకలు సాగించేందుకు పడుతున్న వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అనంతపురం నగరంలో గంటపాటు మోస్తారు భారీ వర్షం కురిసింది. ప్రధాన కూడళ్లు సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ సమీపంలో నీరు పెద్ద ఎత్తున నిలిచి వాహన రాకపోగాలకు ఇబ్బంది ఎదుర్కుంది.గుంటూరు నగరంలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. సుమారు అరగంట పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయం అయ్యాయి. బ్రాడిపేట, అరండల్ పేట, లక్ష్మీపురం ప్రాంతాల్లో రోడ్లపైకి వరద చేరింది. మూడు వంతెనలు, కంకరగుంట అండర్ పాస్ వద్ద వాన నీరునిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మహానందిలో భారీ వర్షం కురిసింది. నల్లమల అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న ఆలయ పరిసరాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో ఆలయంలోని కోనేరులు పొంగిపొర్లాయి. ఆలయ సందర్శనకు వచ్చిన భక్తులు వర్షంలోనే కోనేట్లో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. సాధారణ భక్తులు ఇబ్బందులు పడ్డారు.

14-09pg2exHMNWJQE 2nd_14-09pg2exHMNWJQE.qxd 9/14/2025 12:17 AM Page 1





శనివారం తిరుపతికి విచ్చేసిన లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు స్వాగతం పలుకుతున్న బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి

## తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా

**తిరుమల,సెప్టెంబరు 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సులో పాల్గొనేందుకు శనివారం రాత్రి లోక్‌సభస్పీకర్ ఓంబిర్లా తిరుమలకు చేరుకున్నారు. తిరుమలలో బిర్లాకు టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ ఇఒ భాస్కర్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. నేటి ఉదయం నైవేద్య విరామసమయంలో స్వామివారిని దర్శించుకుని తిరుపతికి వెళతారు.

## భారీగా ఐపిఎస్‌ల బదలీలు

### 14 జిల్లాలకు కొత్త ఎస్పీల నియామకం

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో భారీ స్థాయిలో ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి.రాష్ట్రంలో 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమిస్తూ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. 7 జిల్లాలకు కొత్త అధికారులను నియమించగా మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ చేశారు. 12 జిల్లాల్లో ప్రస్తుతం ఉన్నవారినే ఎస్పీలుగా కొనసాగిస్తూ ఆదేశాల్లో పేర్కొన్నారు. పాలనపై పట్టు సాధించేందుకు ఏపీ ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవలే పలువురు ఐఏఎస్‌లను బదిలీ చేసింది.తాజాగా ఎస్పీల బదిలీలపై ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు పూర్తి చేశారు. 14 జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. వీరిలో 7 జిల్లాలకు ఎస్పీలుగా కొత్త అధికారులకు అవకాశమిచ్చారు. మరో 7 జిల్లాలకు ఇతర జిల్లాల నుంచి బదిలీ అయ్యారు. మిగిలిన 12 జిల్లాలకు ఇప్పుడు ఉన్నవారినే కొనసాగించాలని నిర్ణయించారు. ఎస్పీల బదిలీలను పరిశీలిస్తే బీఆర్ అంబేద్కర్ కోనసీమకు రాహుల్ మీనా, బాపట్లకు ఉమామహేశ్వర్, నెల్లూరుకు అజితా వేజెండ్ల నియమితులయ్యారు. తిరుపతికి సుబ్బారాయుడు, అన్నమయ్య జిల్లాకు ధీరజ్ కునుగిలి, కడప జిల్లాకు నచికేత్, నంద్యాల్ జిల్లాకు సునీల్ షెరాన్ కొత్తగా నియమితులయ్యారు. వీరంతా కొత్తగా జిల్లాలకు ఎస్పీలుగా బాధ్యతలు చేపట్టనున్నారు.ఇప్పటికే ఎస్పీలుగా కొనసాగుతున్న వారిలో ఎఆర్ దామోదర్‌ను విజయనగరం జిల్లాకు, విద్యాసాగర్ నాయుడును కృష్ణాజిల్లాకు, వకుల్ జిందాల్ ను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. డి. కృష్ణారావును పల్నాడు జిల్లాకు, హర్షవర్ధన్ రాజును ప్రకాశం జిల్లాకు, తుషార్ డూడిని చిత్తూరు జిల్లాకు,సతీష్ కుమార్ ను శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ చేశారు. శ్రీకాకుళం, పార్వతీపురం,విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఈస్ట్ గోదావరి, వెస్ట్ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, అనంతపురం, కర్నూలు జిల్లాల ఎస్పీలు యథాతథంగా కొనసాగనున్నారు.

### 15 యేళ్ల పెన్షన్ కమ్యుటేషన్ రికవరీ రూల్స్‌పై

## ఎపి ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగి పదవీ విరమణ చేసిన తర్వాత ఇచ్చే పెన్షన్ నుంచి కమ్యుటేషన్ భాగాన్ని తప్పనిసరిగా 15 ఏళ్ళలో రికవరీ చేయాలన్న నిబంధనను సవాల్ చేస్తూ దాఖలైన కేసులో సుప్రీం కోర్టు ఏపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఏపీ హైకోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 28న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బి.అప్పారావు అనే రిటైర్డ్ తహసీల్దార్ దాఖలు చేసిన ఎస్ఎల్‌పీపై శుక్రవారం విచారణ జరిపిన జస్టిస్ జేకే మహేశ్వరి,జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.పెన్షన్ కమ్యుటేషన్ కింద తనకు చెల్లించిన రూ.7.55 లక్షల మొత్తాన్ని 8%వార్షిక వడ్డీ కింద రికవరీ చేస్తే 11 ఏళ్ళ 3 నెలల్లో మొత్తం తీరిపోయిందని వివరించారు. అయినప్పటికీ ఏపీ సివిల్ పెన్షన్స్(కమ్యుటేషన్ రూల్స్) 1944 లోని సెక్షన్ 18 కింద 15 ఏళ్ళ పాటు రికవరీ చేయాలన్న నిబంధన పేరుతో మరో 3 ఏళ్ళ 7 నెలల పాటు రికవరీ కొనసాగించడం వల్ల తనకు నష్టం జరిగిందని తెలిపారు. ఈ నిబంధన రాజ్యాంగ విరుద్ధం కాబట్టి దాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆయన పిటీషన్ దాఖలు చేయడంతో ఏపీ ప్రభుత్వానికి సుప్రీం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలో కోర్టు ఈ సెక్షన్ లోని అంశాలను పరిశీలిస్తుంది.

## చర్లపల్లి నుంచి అనకాపల్లికి ఎనిమిది ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, సెప్టెంబరు13, ప్రభాతవార్త:** పండుగ సీజన్ దృష్టిలో పెట్టుకొని సౌత్ సెంట్రల్ రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని చర్లపల్లి నుంచి అనకాపల్లి వరకు ఎనిమిది ప్రత్యేక సర్వీసులను నడపాలని రైల్వేశాఖ నిర్ణయించింది. సెప్టెంబరు 13 నుంచి అక్టోబరు 5వరకు ప్రతి శని, ఆదివారాల్లో రాకపోకలు సాగించనున్నాయి. చర్లపల్లి -అనకాపల్లి రైలు (07035), అనకాపల్లి నుంచి చర్లపల్లికి (07036) తిరుగు ప్రయాణ రైళ్లు ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.ఈ రైళ్లు ఇరువైపుల జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, రాయనపాడు, ఏలూరు, తాడేపల్లిగూడెం.నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, ఎలమంచిలి స్టేషన్లలో ఆగుతాయి. అలాగే వీటిలో ఫస్ట్ ఏసి, సెకండ్ ఏసి, థర్డ్ ఏసితో పాటు స్లీపర్, జనరల్,సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని వివరించింది.

## దసరా నేపథ్యంలో కాచిగూడ నుంచి రైళ్లు

**హైదరాబాద్, సెప్టెంబరు13, ప్రభాతవార్త:** దసరా పండుగ నేపథ్యంలో కుటుంబంతో కలిసి సొంతూర్లకు వెళ్తుండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఈ నెల 20 నుంచి అక్టోబరు 5వరకు నడపనున్నట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే మధురై ఎక్స్‌ప్రెస్ రైలు ఉందని, మరిన్ని సర్వీసులు అందుబాటులో ఉంటాయని వివరించారు. కాచిగూడ నుంచి రైళ్లు ఆయా జిల్లాలు, ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలకు,ఆంధ్రప్రదేశ్‌కు అనేక రైళ్లను నడుపుతున్నారు.వీటికి అదనంగా దసరా, దీపావళి, ఛత్ పండుగల కోసం మరిన్ని రైళ్లను ప్రత్యేకంగా ప్రకటించారు. ప్రయాణీకుల డిమాండ్‌కు అనుగుణంగా రానున్న రోజుల్లో మరిన్ని రైళ్లను నడపనున్నట్లు అధికారులు చెబుతున్నారు.పాత వాటికి అదనం కాచిగూడ నుంచి బికనేర్ (07053), కాచిగూడ నుంచి మురుదేశ్వర్ (07191), కాచిగూడ నుంచి నాగర్‌సోల్ (07055) ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 20 ప్రారంభమవుతాయని వెల్లడించారు.ప్రతి శనివారం కాచిగూడ నుంచి మధురై ఎక్స్‌ప్రెస్ రైలును నడుపుతున్నారు. అది ఈరోడ్, సేలం(తమిళనాడు) మీదుగా వెళుతుంది. పండుగకు ప్రకటించిన కాచిగూడ నుంచి మధురై (07191/07192) ఈనెల 20 నుంచి నవంబరు 26 వరకు అరుణాచలం మీదుగా సేవలు అందిస్తోంది.గోమతినగర్ నుంచి మహబూబ్‌నగర్ (05314/05313)కు ప్రత్యేక రైళ్లను ఈ నెల 28 నుంచి నవంబర్ 3 రాకపోకలు సాగించనున్నాయి. రోజువారీ రైళ్లు 100 కు పైగా నడపనున్నట్లు తెలిపారు.నిత్యం ప్రయాణికులు 47వేల మంది ఉంటారని అంచనా వేస్తున్నారు. పండుగ కోసం ప్రత్యేకంగా 4 రైళ్లు ఉన్నాయని రైల్వేశాఖ పేర్కొంది.

## తిరుచ్చినుంచే టివికెఅధినేత విజయ్ జైత్రయాత్ర!

**తిరుచ్చి, సెప్టెంబరు 13:** తమిళనాడు రాజకీయాల్లో నటుడు టివికె అధినేత విజయ్ తనదైన శైలిలో రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, ఆయన స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' టీవీకే పార్టీ తొలి ప్రచార యాత్రను నేడు ప్రారంభించారు. ఈ యాత్ర కోసం ద్రవిడ రాజకీయాల్లో చారిత్రక ప్రాధాన్యమున్న తిరుచ్చి నగరాన్ని వేదికగా ఎంచుకోవడం ఇప్పుడు సర్వత్ర ఆసక్తి రేపుతోంది. తిరుచ్చి నుంచి ప్రత్యేక ప్రచార వాహనంలో బయలుదేరిన విజయ్ అరియలూరులో జరగనున్న భారీ బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ పర్యటన కోసం అత్యాధునిక కెమెరాలు, లౌడ్ స్పీకర్లతో పాటు ఎవరూ బస్సుపైకి ఎక్కకుండా ఇనుప రెయిలింగ్‌లతో కూడిన ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేశారు. 'మీ విజయ్, నేను విఫలం కాను', 'తమిళనాడు, విజయ్ వారసత్వం తిరిగొస్తుంది' వంటి నినాదాలతో కూడిన పార్టీ ప్రచార లోగోను కూడా ఆవిష్కరించారు. విజయ్ యాత్రకు పోలీసులు 25 కఠిన నిబంధనలతో కూడిన షరతులతో పోలీసులు అనుమతులు మంజూరు చేశారు. రోడ్‌షోలు, సన్మానాలు, భారీ వాహన కాన్వాయ్‌లపై ఆంక్షలు విధించారు. విజయ్ ప్రచార బస్సును కేవలం ఐదు వాహనాలు మాత్రమే అనుసరించాలని, పార్టీ కార్యకర్తలు ఉదయం 11:25 గంటల కల్లా అరియలూరు పాత బస్టాండ్ వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. ప్రజల భద్రత కోసం పార్టీయే బారికేడ్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే యాత్రను నిలిపివేసే అధికారం తమకు ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. ద్రవిడ రాజకీయాల్లో కీలక నిర్ణయాలకు తిరుచ్చి చారిత్రకంగా ఓ వేదికగా నిలిచింది. గతంలో ఏఐఏడీఎంకే అధినేత, మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) తన చారిత్రాత్మక మధ్యాహ్న భోజన పథకాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. అంతేకాకుండా, తిరుచ్చిని తమిళనాడుకు రెండో రాజధానిగా ప్రకటించారు. అలాగే, డీఎంకే వ్యవస్థాపకుడు సీఎన్ అన్నాదురై కూడా తన పార్టీ ఎన్నికల్లో పోటీ చేయాలా, వద్దా అనే కీలక నిర్ణయాన్ని తిరుచ్చిలోనే తీసుకున్నారు.

# శాంతిభద్రతలే ప్రభుత్వ లక్ష్యం

>> వ్యవహరించడం వల్లనే హైదరాబాద్‌కు పెట్టుబడులు వచ్చాయి. నేడు బ్రాండ్ అయ్యింది. మనం తీసుకునే నిర్ణయాలు భవిష్యత్తులో అనేక మార్పులకు కారణం అవుతాయి." అని చంద్రబాబు అన్నారు.

"ఒకప్పుడు రాజకీయ నాయకులు అవసరానికి రౌడీలను, క్రిమినల్స్‌ను వాడుకునే వాళ్లు. అయితే నేడు రాజకీయాల ముసుగులో నేరాలు చేస్తున్నారు. పాలిటిక్స్‌ను క్రిమినలైజ్ చేశారు. వివేకా హత్య విషయంలో ఏం జరిగిందో ప్రతి పోలీసు అధికారి స్టడీ చేయాలి. ఒక దారుణ హత్యను గుండెపోటు అన్నారు. తరువాత హత్య అన్నారు. తరువాత నాపై నెట్టారు.సీబీఐ కావాలి అన్నారు...తర్వాత వద్దు అన్నారు... ఇలా ఒక్కటి కాదు దేశంలో మరే కేసులోనూ ఇన్ని మలుపులు ఉండవు. పోలీసు అధికారులకు ఇదొక పెద్ద కేస్ స్టడీ. ఇదొక్కటే కాదు మొన్న మన ప్రభుత్వంలో సింగయ్య మృతి ఉదంతాన్ని గమనించే ఉంటారు. వాళ్ల కారు కింద పడి వాళ్ల కార్యకర్త చనిపోతే కూడా పట్టించుకోలేదు. దాన్ని దాచి పెట్టారు. రెండు రోజుల తరువాత వీడియో బయటపడకపోతే ఘటన ఎలా జరిగిందో కూడా తెలిసేదికాదు. ఈ విషయంలో పోలీసు అధికారులు తప్పుడు ప్రచారాన్ని నమ్మారు. చివరికి విషయం బయట పడ్డాక కార్యకర్తపై కారు ఎక్కించిన పార్టీ నేతలే బాధిత కుటుంబంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడించారు. అంబులెన్స్‌లో ఏదో జరిగిందని చెప్పే ప్రయత్నం చేశారు. అంటే వాళ్ల క్రిమినల్ పాలిటిక్స్ ఎలా ఉంటాయో మీరు అర్థం చేసుకోవాలి. అలాంటి వాళ్లు ఉన్న రోజుల్లో మనం ప్రభుత్వాలు నడుపుతున్నా మనేదిమీరంతా గుర్తుంచుకోవాలి." అని ముఖ్యమంత్రి వివరించారు.

నేడు నేరాల తీరు మారింది. అంటే మీ దర్యాప్తు తీరు కూడా మారాలి. టెక్నాలజీని 100 శాతం ఉపయోగించుకోండి. ఇన్వెస్టిగేషన్‌లో టెక్నాలజీతో బెస్ట్ రిజల్ట్ ఇస్తుంది. సీసీ టీవీలు లేకపోతే పాస్టర్ ప్రవీణ్ మృతిని ప్రభుత్వానికి చుట్టేవాళ్లు. ప్రవీణ్ మృతి విషయంలో వాస్తవాలను టెక్నాలజీతో స్పష్టంగా చెప్పగలిగాం. సోషల్ మీడియా ఫేక్ ప్రచారాలు, సైబర్ క్రైం, క్రిమినల్ పాలిటిక్స్ బిగ్ ఛాలెంజ్‌గా మారాయి. ఫ్రెండ్లీ పోలీసింగ్ ఉండాలి క్రిమినల్స్ కు భయం ఉండాలి. తప్పు చేస్తే దొరుకుతాం అనే ఆలోచన వస్తే నేరాలు తగ్గుతాయి. ప్రజా ప్రతినిధులతో సామరస్యంగా, సమన్వయంతో పని చేయండి. తప్పు చేస్తే మాత్రం ఏ పార్టీ వాళ్లను అయినా శిక్షించండి. ఈ విషయంలో రాజీలేదు. మా ఎమ్మెల్యేలు, మంత్రులు చెప్పేదానిలో మంచి ఉంటే పాటించండి. తప్పు ఉంటే చేయమని చెప్పను. మా పార్టీ వాళ్లు చెప్పరు. ఇది కూటమి విధానం." అని సీఎం అన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది రియాక్ట్ రీచ్, రెస్పాండ్, రిజల్ట్ అనే విధానంలో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. "ఏదైనా తీవ్రమైన ఘటన జరిగిన వెంటనే కిందిస్థాయి సిబ్బందిపై వదిలేయకుండా వెంటనే రియాక్ట్ అవ్వండి. అవసరమైన మేరకు క్రైమ్ స్పాట్‌కు రీచ్ అయ్యి సాక్ష్యాధారాల సేకరణ, దర్యాప్తులో అవసరమైన చర్యలు చేపట్టండి. మీడియాతో పాటు సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా లేక సమాచార లోపంతో జరిగే ప్రచారంపై వెంటనే రెస్పాండ్ అవ్వండి. ముఖ్యంగా ఫేక్ ప్రచారాలని తేలితే కఠిన చర్యలకు వెనుకాడకండి ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అయితే ఈ సమయంలో రాజకీయ ముసుగులో కొందరు అలజడులు చేయాలని చూస్తున్నారు. ఇలాంటి వారిని ఉపేక్షించేది లేదు. ప్రతిపక్షాలు పర్యటనలు చేసుకోవచ్చు... కార్యక్రమాలు నిర్వహించుకోవచ్చు. నేను వాటికి వ్యతిరేకం కాదు. అయితే చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తామంటే అంగీకరించేది లేదు. ఈ విషయంలో జిల్లా అధికారులు కూడా స్పష్టంగా ఉండాలి. నేడు దేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. 2029లో ఎన్డీఏ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. మోదీ 4వ సారి ప్రధాని అవుతారు. 2047 నాటికి దేశం ప్రపంచంలో నెంబర్ 1 అవుతుంది అనడంలో సందేహం లేదు. అయితే ఈ సమయంలో వచ్చే ప్రతి అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలి అనేదే నా తపన, ఆలోచన. దీనికి అవసరమైన సహకారం అధికార యంత్రాంగం అందించాలి. రాష్ట్రం బాగుంటే మనం అంతా బాగుంటాం. ఈ క్రమంలో అత్యంత ముఖ్యమైనది లా అండ్ ఆర్డర్. అందుకే సుదీర్ఘ కసరత్తు తరువాత అన్ని అంశాలు చూసి మీకు అవకాశం ఇచ్చాను. ప్రూవ్ చేసుకోండి. బెస్ట్ ఫెర్ఫామెన్స్ చూపించండి. ఆల్ ది బెస్ట్. అని సీఎం చంద్రబాబు అన్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత,.సీఎస్ కె,విజయానంద్,డీజీపీ హరీస్‌కుమార్ గుప్తా తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వచ్చే యేడాది జూన్‌కు భోగాపురం విమానాశ్రయం పూర్తి

### డిసెంబర్‌లో వేలిడేషన్ ఫ్లైట్

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయనగరం, సెప్టెంబరు 13 ప్రభాతవార్త ప్రతినిధి:** భోగాపురంలో నిర్మాణ దశలో ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయ పనులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం పరిశీలించారు. భోగాపురం చేరుకున్న రామ్మోహన్ నాయుడుకు జి.ఎం.ఆర్ అధికారులు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న నిర్మాణ పనుల వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా విమానాశ్రయం అంతా కలియతిరిగి పనులన్నీ సక్రమంగా సాగుతున్నాయి అన్న సంతృప్తిని రామ్మోహన్ నాయుడు వ్యక్తపరిచారు. అనంతరం నిర్మాణం దశను పూర్తి చేసుకున్న రన్ వేను సైతం పరిశీలించారు. ముందుగా నిర్ణయించుకున్న డి.పి.ఆర్ మేరకు నిర్మాణాలు సక్రమంగా జరుగుతున్నాయని, దేశంలోనే మిన్నగా భోగాపురం ఎయిర్ పోర్ట్ నిలుస్తుందన్న ఆశాభావాన్ని రామ్మోహన్ నాయుడు వ్యక్తం చేశారు. తర్వాత విమానాశ్రయ నిర్మాణ పనులు చేపడుతున్న జిఎంఆర్ అధికారులతో సమీక్ష సమావేశంలో రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పనులు ఎక్కడ వరకు జరుగుతున్నాయి. ఏ దశలో ఉన్నాయన్న విషయాలను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు జిఎంఆర్ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా తనకున్న సందేహాలను సైతం సమీక్షలో చెప్పి వాటి నుంచి వివరణ తీసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడిన రామ్మోహన్ నాయుడు జూన్ 2026 నాటికల్లా విమానాశ్రయ నిర్మాణ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధమవుతామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. గడిచిన 14 నెలలుగా నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని, ఇప్పటికే ఏడుసార్లు ప్రత్యేకంగా ఈ విమానాశ్రయ నిర్మాణ పనులపై క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మెన్ కర్రోతు బంగారురాజు, ఆర్డీవో డి.కీర్తి, డీఎస్పీ శ్రీనివాసరావు, జిఎంఆర్ సీఈవో కన్వర్ బీర్ సింగ్ కలరా, సిడిఓ కోటేశ్వరరావు, ప్రాజెక్ట్ హెడ్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.



శనివారం భోగాపురం ఎయిర్‌పోర్టు పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

## రష్యాపై నాటోదేశాలు కూడా ఆంక్షలు విధిస్తేనే ముందుకు

### నాటో దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ లేఖలు

**వాషింగ్టన్,సెప్టెంబరు 13:** రష్యాపై కఠినమైన ఆంక్షలు విధించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు నాటో మిత్రదేశాలన్నీ ఏకతాటిపైకి వచ్చి కొన్ని షరతులను అంగీకరించాల్సి ఉంటుందని ట్రంప్ అల్టిమేటమ్ ఇచ్చారు.

రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపివేయడంతో పాటు, నాటో దేశాలు కూడా సొంతంగా ఆంక్షలు అమలు చేస్తేనే తాను ముందుకు వెళతానని తేల్చిచెప్పారు. అంతటితో ఆగకుండా నాటో దేశాలన్నింటికీ ట్రంప్ ఒక లేఖ రాశారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యా, చైనాలకు వ్యతిరేకంగా ఉమ్మడి చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ లేఖ వివరాలను తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ చేశారు. "రష్యాపై కఠిన ఆంక్షలు విధించడానికి నేను సిద్ధం. కానీ నాటో దేశాలన్నీ కూడా అదే పని చేయాలి. మాస్కో నుంచి చమురు కొనడం పూర్తిగా ఆపేయాలి. మీరు సిద్ధమని చెబితే చాలు, నేను రంగంలోకి దిగుతానని ట్రంప్ తన లేఖలో పేర్కొన్నారు. కొన్ని నాటో దేశాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని ఆయన "దిగ్భ్రాంతికరం" అని అభివర్ణించారు.

ఈ చర్య మాస్కోపై బేరసారాల శక్తిని తీవ్రంగా బలహీనపరుస్తుందని ఆయన విమర్శించారు. ఇదే సమయంలో చైనాను లక్ష్యంగా చేసుకుని మరో సంచలన ప్రతిపాదన చేశారు. రష్యాఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో దేశాలన్నీ కలిసి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలని సూచించారు.

ఇలా చేయడం ద్వారా రష్యాపై చైనాకున్న బలమైన పట్టును విచ్ఛిన్నం చేయవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా బైడెన్ పరిపాలనపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఇది ట్రంప్ యుద్ధం కాదు. అప్పుడు నేను అధ్యక్షుడిగా ఉంటే ఇది మొదలయ్యేదే కాదని ఇది బైడెన్, జెలెన్‌స్కీల యుద్ధం. నేను కేవలం దీన్ని ఆపడానికి, వేలాది మంది రష్యన్, ఉక్రెనియన్ల ప్రాణాలను కాపాడటా నికి మాత్రమే ఉన్నానని ఆయన స్పష్టంచేసారు. తాను ప్రతిపాదించిన చర్యలు తీసుకుంటే యుద్ధం త్వరగా ముగుస్తుందని, లేదంటే తన సమయాన్ని, అమెరికా సమయాన్ని, శక్తిని, డబ్బును వృథా చేయవద్దని ట్రంప్ పేర్కొన్నారు.

### మరో 114 రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు

## మొత్తం అంచనా విలువ రూ.2 లక్షలకోట్లు

### హైదరాబాద్‌లో రాఫెల్ జెట్‌ల ఎం88 ఇంజన్లు, ఓవర్‌హాలింగ్ ఏర్పాటుకు యోచన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** భారత వైమానిక దళం (ఐఎఎఫ్) మరో 114 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలుకోసం రక్షణశాఖకు ప్రతిపాదనలు అందించింది. ఈ జెట్‌లను ఫ్రాన్స్‌కు చెందిన దసాల్ట్ ఏవియేషన్, టాటా వంటి భారతీయ అంతరిక్ష సంస్థలు తయారు చేస్తాయి.ఈ ప్రతిపాదన అంచనాలు రూ.2లక్షల కోట్ల వరకు ఉంటుంది. రాబోయే రోజుల్లో రక్షణ కార్యదర్శి నేతృత్వంలోని డిఫెన్స్ ప్రొక్యూర్‌మెంట్ బోర్డు ఈ విషయంపై చర్చించనున్నది. విమానాల భాగాల్లో 60 శాతం భారతదేశంలోనే తయారు చేయనున్నట్లు పేర్కొంది. తెలంగాణలోని హైదరాబాద్‌లో రాఫెల్ జెట్‌ల ఎం88 ఇంజిన్‌ల నిర్వహణ, మరమ్మతుల ఓవర్‌హాల్ ఫెసిలిటీని సైతం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు వార్తాసంస్థ కథనం ప్రచురించింది.తెలిపింది. భారత వైమానిక దళం తయారుచేసిన 114 రాఫెల్ జెట్‌ల ప్రతిపాదన, స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్ కొద్దిరోజుల క్రితం రక్షణ మంత్రిత్వ శాఖకు అందింది. ఈ ప్రతిపాదన డిఫెన్స్ ఫైనాన్స్ సహా దాని కింద ఉన్న వివిధ విభాగాల పరిశీలనలో ఉంది. చర్చల తర్వాత ఈ ప్రతిపాదనను డీపీబీకి ఆ తర్వాత డిఫెన్స్ ఆక్విజిషన్ కౌన్సిల్‌కు పంపుతారని రక్షణశాఖ అధికారులను ఉటంకిస్తూ వార్తాసంస్థ నివేదిక తెలిపింది. ఆపరేషన్ సింధూర్‌లో రఫేల్ యుద్ధ విమానాలను వినియోగించిన విషయం విధితమే. ఈ క్రమంలో తాజాగా వాయుసేన ఈ ప్రతిపాదనను తీసుకువచ్చింది. రఫేల్ యుద్ధ విమానాలు స్పెక్ట్రా ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ సూట్‌ను ఉపయోగించి.. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ ఉపయోగించిన చైనీస్ పీఎల్15 ఎయిర్‌టుఎయిర్ మిస్సైల్స్‌ను విజయవంతంగా ఓడించాయని రక్షణ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఎయిర్‌ఫోర్స్ వద్ద 36 రఫేల్ జెట్స్ ఉన్నాయి. మరోవైపు, ఇండియన్ నేవి 26 రాఫెల్‌లను కొనుగోలు చేయడానికి ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చింది. అయితే, కొత్త ఆర్డర్ నేపథ్యంలో భారత డిఫెన్స్‌లోకి రఫేల్ జెట్ల సంఖ్య 176కి పెరగనున్నది. ప్రస్తుతం ఐఏఎఫ్ 4.5 జెనరేషన్ విమానాలు అయిన రాఫెల్స్, సుఖోయ్ , హెచ్ఏఎల్ తేజస్‌లను ఉపయోగిస్తోంది. నాల్గవ తరం యుద్ధ విమానాలు అయిన దస్సాల్ట్ మిరాజ్ 2000, మిగ్29లను కూడా వాడుతోంది.



## 23న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2లో బలమైన వాదనలు వినిపిస్తాం

### తెలంగాణనీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి జలసౌధలో సమీక్ష

**హైదరాబాద్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** కృష్ణా జలాల వివాద-2 విచారణలో తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణాకు చెందాల్సిన నీటివాటలో చుక్క నీరు కుడా వదులుకునే ప్రసక్తేలేదని ఆయన తేల్చిచెప్పారు. ఈ నెల 23 నుండి 25 వరకు దేశరాజధాని ఢిల్లీలో జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్ విచారణలో తాను స్వయంగా పాల్గొన బోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఢిల్లీలో 23 నుండి 25 వరకు జరగనున్న కృష్ణా జలాల వివాద ట్రిబ్యునల్-2 విచారణలో తెలంగాణా ప్రభుత్వం అనుసరించాల్సిన అంశంపై శనివారం రోజున ఆయన నీటిపారుదల శాఖా కేంద్ర కార్యాలయం జలసౌధలో న్యాయనిపుణులు, నీటిపారుదల రంగ నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

## వారం - వర్జ్యం

14-09-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
అష్టమి రా.3.07
రోహిణి ఉ.8.42
వర్జ్యం : మ.2.02-3.33
దు.సా.4.29-5.18
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** మీ ప్రమేయం లేకపోయినా తగాదాలలోనికి లాగడానికి మీ ఓర్పును రెచ్చగొట్టేవారు అధికమవుతారు.

**వృషభం:** నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేస్తారు. మిత్రులనుండి శుభవార్తలు అందుకుంటారు.

**మిథునం:** సంతాన క్షేమం కోసం, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పెద్దమొత్తాలను డిపాజిట్ చేస్తారు.

**కర్కాటకం :**రాజకీయ, కళారంగాల వారు గౌరవ సత్కారాలు అందుకుంటారు.

**సింహం:**డబ్బు కన్నా మానవత్వాన్ని విలువనిచ్చి కొన్ని మంచి పనులు చేస్తారు.

**కన్య :** ఉద్యోగస్తులకు కార్యాలయంలో అనుకూల వాతావరణం ఉంటుంది. వస్తులాభం.

**తుల :** మోకాళ్ళ నొప్పులు, పాదాలనొప్పులు బాధించవచ్చు. తనఖా వస్తువులు విడిపిస్తారు.

**వృశ్చికం:** నూతన వ్యక్తులతో పరిచయాలు పెంచుకొని మిత్రబృందాలను పెంచుకుంటారు.

**ధనుస్సు:** జీవితభాగస్వామి సలహాతో వ్యాపార విస్తరణ చేస్తారు. వాహన సౌఖ్యం.

**మకరం:** ప్రముఖులను కలుసుకొని కీలక విషయాలపై చర్చిస్తారు. వస్తువులు కొనుగోలు.

**కుంభం:**ఇంటిలో శుభకార్యాలు జరుగుతాయి. నూతన విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

**మీనం :** మాటల చాతుర్యంతో కార్యాలయంలో ఉన్నతాధికారుల మెప్పు పొందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## ఉచ్చులో పడొద్దు

>> చేయాలి. ఈ దిశగా ముందుకు వెళ్లాలని జనసేన నాయకులు, శ్రేణులతోపాటు కూటమి నాయకులకు సూచిస్తున్నాను. సోషల్ మీడియా, యూట్యూబ్ చానెల్స్ రూపంలోనో, విశ్లేషకుల ముసుగులోనో రెచ్చగొట్టే వారినీ, అభ్యంతరకర రీతిలో మాట్లాడేవారినీ భారత న్యాయ సంహిత ప్రకారం చట్టం ముందు నిలపాలి. వీరి వెనక ఉండి వ్యవస్థీకృతంగా రెచ్చగొట్టి కుట్రలు చేసేవారిపైనా ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయాలి. మచిలీపట్నం వివాదంపై అంతర్గత విచారణ నాయకులకు ఆదేశాలు ఇచ్చాను. ఈ ఘటనలో పాలుపంచుకున్న వారికి నోటీసులు ఇచ్చి వివరణ ఇవ్వాలని స్పష్టం చేశాం. కుట్రలు చేసేవారి కుత్సిత నైజం కలిగిన పార్టీ, ఆ పార్టీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వారు చేసే దుష్ప్రచారాన్ని ప్రజాస్వామ్యయుతంగా, చట్ట ప్రకారమే తిప్పికొడదామని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

### వరదలలో కొట్టుకుపోయిన మహిళలు

## ఇద్దరు గల్లంతు, ఇద్దరు క్షేమం,

**జీలుగుమిల్లి, సెప్టెంబరు13, ప్రభాతవార్త:** మండలంలోని పూచికపాడులో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పాలడుగుల చెన్నమ్మ (50), పచ్చిశాల వరలక్ష్మి (55) మరో ఇద్దరు మహిళలు తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మండలం పెదవాగు ప్రాజెక్టు వరదలో కొట్టుకుపోయారు. వీరిలో చెన్నమ్మ, వరలక్ష్మి గల్లంతు కాగా, మరో ఇద్దరు మహిళలు వరద నుంచి ప్రాణాలతో బయటపడ్డారు. వీరంతా కూలి పనులు కోసం అశ్వరావుపేట మండలం చిన్నాపురం వెళ్లి వెనక్కి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గల్లంతైన ఇద్దరు మహిళలు కూడా మృతి చెందినట్లు సమాచారం.

## తిరుపతికి నేడు సిఎం చంద్రబాబు

### మహిళా సాధికారతపై జాతీయసదస్సు ప్రారంభం

**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదివారం ఉదయం (నేడు)తిరుపతికి వస్తున్నారు. తిరుపతిలో రెండు రోజులపాటు ప్రతిష్టాత్మకంగా మహిళా సాధికారతపై పార్లమెంట్, శాసనసభ కమిటీల జాతీయ సదస్సుకు ముఖ్యఅతిధిగా విచ్చేస్తున్నారు. ఆదివారం ఉదయం విజయవాడ నుండి హెలికాప్టర్‌లో తాజ్‌హోటల్ సమీపంలోని హెలిపాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుండి శ్రీకన్వెన్షన్ హాల్‌లో జరిగే ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొని అనంతరం రాహుల్ కన్వెన్షన్‌లో జాతీయ సదస్సులో ముఖ్యఅతిదిగా హాజరవుతారు. ప్రసంగించిన తరువాత తిరిగి హెలికాప్టర్‌లో విజయవాడకు వెళతారు.తిరుపతిలో దాదాపు ఐదుగంటలు సిఎం గడపనున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం,భద్రతపై తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు భద్రత ఏర్పాట్లుపై అదికారులతో సమీక్షించారు.

14-09Pg3exHMNWJQE ONG_14-09Pg3exHMNWJQE.qxd 9/13/2025 10:47 PM Page 1



# అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాలు

## బిసి సంక్షేమ మంత్రి సవిత



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతిపై జగన్ రివర్స్ డ్రామాకు తెరతీశారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత ఆరోపించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల దృష్టిలో పెట్టుకుని అమరా వతిపై మరో జగన్నాటకానికి తెర తీశాడన్నారు. ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరు దాటాక తెప్ప తగలేసే రకం జగన్ దన్నారు. 2019 ఎన్నికల సమ యంలో అమరావతే రాజధాని అని, తన నివాసం ఇక్కడే ఉందని ప్రజలను నమ్మబలి కాడన్నారు. అధికారంలోకి రాగానే, మాట మార్చేసి మూడు రాజధానులంటూ మూడు ముక్కలాటకు తెర తీశాడన్నారు. అయి దేళ్లలో ఏ ఒక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా, రాజ ధాని లేని రాష్ట్రానిగా ఏపీని భ్రష్టు పట్టించా డరన్నారు. అమరా వతిని స్మశాన మని, మునిగిపోయే ప్రాంత మని చులకన చేసి జగన్ సహా వైసీపీ నాయకులంతా మాట్లాడార న్నారు. ఆంధ్రుల చిరకాల కలయిన అమరావతి కోసం భూములిచ్చిన రైతులను, మహిళలను పెయిడ్ ఆర్టిస్టులంటూ హేళన చేశార న్నారు. వారిని నిర్బం ధాలకు గురి చేస్తూ, పోలీసు లతో కొట్టించారన్నారు. జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన యావత్ ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఛీ కొట్టి ప్రతిపక్ష హోదా కూడా ఇవ్వకుండా 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. నిన్నగాక మొన్న తన నీలి మీడియాలో అమరావతి వేశ్యల నగరమంటూ సభ్య సమాజం సిగ్గుపడేలా తప్పుడు మాటలు ఆడించారన్నారు. ఇన్ని విధాలా అమరావతిపై విషంకక్కిన జగన్..ఇపుడు రాజధానికి అనుకూల మంటూ చెప్పడం మరో జగన్నాటకానికి తెర తీయడమేనన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉనికిని కాపాడుకోడానికి జగన్ రెడ్డి ఆడుతున్న రివర్స్ డ్రామా అని మంత్రి సవిత మండిపడ్డారు. అయితే కాళ్లు పట్టుకోవడం, లేకుంటే జుట్టు పట్టుకోవడం జగన్ కు అలవాటేనన్నారు. జగన్ ఎన్ని రివర్స్ డ్రామాలు ఆడినా ప్రజలు పట్టించుకునే పరిస్థితుల్లో లేరన్నారు. సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు.

### జ్యోతిర్లింగ యాత్రకు

# ప్రత్యేక రైలు

**విజయవాడ, సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్య క్షేత్రాల సందర్భనకు వెళ్ళే యాత్రికుల కోసం ఐఆర్‌సీటీసీ జ్యోతిర్లింగ సహిత దక్షిణ యాత్ర' పేరుతో భారత్ గౌరవ్ టూరిస్ట్ ప్రత్యేక రైలును నడపనుంది. ఈ నెల 23న రైలు సికింద్రాబాద్‌లో ప్రారంభమై జనగా, వరంగల్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా వెళ్ళూ తిరువణ్ణామలై లోని అరుణాచలేశ్వర ఆలయం, రామేశ్వరం లోని రామనాథస్వామి దేవాలయం, మధురై మీనాక్షి అమ్మ దేవస్థానం, త్రివేంద్రం, తిరుచ్చి, తంజావూరులోని ఆలయాల సందర్భన కల్పించనుంది. టిఫిన్, భోజన ం, రవాణా, హోటల్ గదులతో కలిపి ఒక్కొక్కరికి టికెట్ ధర స్లీపర్ తరగతిలో రూ.14,10, థర్డ్ ఏసీలో రూ.22,500, సెకెండ్ ఏసీలో రూ.29,500గా నిర్ణయించారు. వివరాలకు ఫోన్ నెంబర్లు 9701360701, 9281030726లో సంప్రదించవచ్చు.

# తిరుమల సమాచారం

## భక్తులకు సంతృప్తికరంగా సేవలందిస్తాం

### - బోర్డుసభ్యులుగా హరిజవహర్‌లాల్, సుదర్శన్‌వేణు ప్రమాణం



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థమ్ వచ్చే భక్తులకు సేవకులుగా తాము సేవలందిస్తామని ఇద్దరు బోర్డు సభ్యులు తెలిపారు. టిటిడి బోర్డుతో కలసి సామాన్యభక్తులకు మరింత సంతృప్తి కరంగా శ్రీవారి దర్శనం చేయించడానికే ప్రాధాన్యతనిస్తామని అన్నారు. తిరుమలతిరుపతిదేవస్థానం ధర్మకర్తల మండలిలో సభ్యుడుగా నియమితులైన పారిశ్రామికవేత్త సుదర్శన్‌వేణు, ఎక్స్ అఫిషియోసభ్యుడిగా నియమితులైన దేవాదాయశాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ శనివారం తిరుమలకు చేరుకున్నారు. ఈ ఇద్దరితో టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, జెఈఒ వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామకృష్ణ వీరికి స్వామివారి తీర్థప్రసాదాలను, చిత్రపటం అందజేశారు. ఇంతటి అదృష్టం ఇచ్చిన స్వామివారికి, మరోసారి పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

# త్వరలో తిరుమలలో ముఖగుర్తింపు సాంకేతికత

### - సేవకుడిగా భక్తులతో మమేకమైన టిటిడి ఇఒ సింఘాల్



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాత వార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ పుణ్యక్షేత్రం తిరుమలకు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం కోసం ప్రపంచనలుమూలల నుండి విచే ్చసే ప్రతి యాత్రికుని ముఖ గుర్తింపు వ్యవస్థను అందుబాటు లోకి తీసుకురావాలని టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్ ఆదేశించారు. రియల్ టైమ్‌లో వ్యక్తుల గుర్తింపు, వారి కదలికలపై నిఘా కోసం ఇది ఎంతగానో దోహదపడుతుందన్నారు. టిటిడి ఇఒగా రెండవసారి బాధ్యతలు చేపట్టిన సింఘాల్ శనివారం ఉదయం తిరుమలలో వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్ క్యూలైన్లు, లగేజీ కౌంటర్‌లను, శ్రీవారిసేవకుల సేవలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సేవకుడిగా క్యూలైన్లో భక్తులతో మమేకమై అందుతున్న సేవలు, సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. దర్శన టోకెన్లు పొందిన భక్తులు ఎన్ని గంటలకు క్యూలోకి వచ్చారు, టోకెన్ తీసుకున్న సమయం వారికి సేవకులు అందించిన సేవలను తెలుసుకుని భక్తుల సంతృప్తి చెందడం గమనించారు. టిటిడి సేవలు, స్వామివారి దర్శనం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. శ్రీకాకుళం, మహారాష్ట్రనాందేడ్ ప్రాంతాల శ్రీవారిసేవకులతో మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. శ్రీవారి సేవకులకు మరింత నాణ్యమైన శిక్షణనిచ్చి తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సిపిఆర్ఒ డాక్టర్‌తలారి రవికి సూచించారు. శ్రీవారి దర్శనానికి వచ్చి క్యూలైన్లలో, ఆలయం వెలుపల, అఖిలాండం వద్ద తప్పిపోతున్న భక్తులను గుర్తించే ప్రక్రియ మరింత వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తుండటంతో ఆయన భద్రత అంశంపై అనంతరం కమాండ్ కంట్రోల్ సెంటర్‌కుచేరుకుని కొండపై సిసి కెమెరాల పనితీరు, భద్రత సిబ్బంది విధులు గమనించారు.

ఈ తనిఖీల్లో టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ, డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విఎస్ఒలు ఎస్వీవి రామ్‌కుమార్, సురేంద్ర, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# దుకాణాల సూచిక ఫలకాలు తెలుగులో కూడా ఉండేలా సిద్ధం చేయండి

### - గుంటూరు వాణిజ్యమండలికి డా.గజల్ శ్రీనివాస్ వినతి పత్రం



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో, తెలుగు భాషా సంస్కృతి పరిరక్షణ, అభివృద్ధి, విశ్వవ్యాప్తి లక్ష్యంగా వచ్చే ఏడాది జనవరి 3, 4, 5 తేదీలలో గుంటూరులోని శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ (నేషనల్ హైవే) ప్రాంగణంలో, 3వ ప్రపంచ తెలుగు మహా సభలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా పరిషత్ అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ గుంటూరు వాణిజ్యమండలి( ఛాంబర్ ఆఫ్ కామర్స్ )అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు, ఏల్చూరి వెంకటేశ్వరావు, నాగిరెడ్డి తదితరులను కలసారు. 3 వ ప్రపంచ తెలుగు మహా సభలకు గుంటూరులోని "దుకాణాల సూచిక ఫలకాలు" తెలుగులో కూడా వుండేలా చూడమని కోరారు. ప్రతి వ్యాపార సంస్థ తమ ప్రకటనలు తెలుగు భాషలో ప్రచురించేలా, తమ ఫ్లెక్సీలు, బోర్డులు, సైను బోర్డ్స్ మొదలైనవి తెలుగు అక్షరాలతో , తెలుగు లిపిలో తెలుగు తోరణాల వలె ఉండేలా ప్రోత్సహించగలరని కోరారు. గుంటూరు నగరానికి వచ్చే లక్షలాది తెలుగు భాషాభిమానులకు మన "వ్యాపార సంస్కృతిలో మాతృ భాషకు ఇచ్చే గౌరవం" స్పష్టంగా కనపడేలా చేయాలని మా ఆకాంక్ష అని డా.గజల్ శ్రీనివాస్ అభ్యర్థించారు. ఛాంబర్ ఆధ్వర్యంలో నగరమంతటా స్వాగత తోరణాలు, తెలుగు ప్రచార పదబంధాలు , తెలుగు వెలుగుల ప్రముఖుల చిత్రాల ఫ్లెక్సీలు ఏర్పాటు చేయమని ప్రార్థిస్తున్నామని, ఈ ప్రయత్నం ఇతర నగరాలకు కూడా స్ఫూర్తి అవుతుందని మేము విశ్వసిస్తున్నామని ఆయన విన్నవించారు గుంటూరు ఛాంబర్ సభ్యులు డా.గజల్ శ్రీనివాస్ అభ్యర్థనను మన్నించి గుంటూరు ను పూర్తి స్థాయిలో వ్యాపార సూచిక ఫలకాలను తెలుగు లిపిలో ఉంచుతామని డా.గజల్ శ్రీనివాస్ కు హామీ ఇచ్చారు. ఈ సమావేశానికి పరిషత్ సభ్యులుఅన్నాప్రగడ రవి శ్రీనివాస్ , మనోజ్ కమల్ , ఆంధ్ర ప్రదేశ్ తెలుగు సంఘం పూర్వ సభ్యులు డా. కత్తి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ మహిళా సాధికారత సదస్సుకు ఏర్పాట్లు పూర్తి : మంత్రి సవిత



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరంలో తొలిసారిగా జాతీయ మహిళా సాధికారత సదస్సును నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపారని, ఈ సదస్సుకు దేశంలోని పార్లమెంటరీ, అసెంబ్లీల్లోని మహిళ ప్రజాప్రతినిదులు, అధికారులు విచ్చేస్తున్నట్లు రాష్ట్రమంత్రి సవిత తెలిపారు. ఈసదస్సుకు అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం పూర్తిచేసిందని, ప్రతిష్టాత్మకంగా నిర్వహించేలా శ్రీవారి ఆశీస్సులు తీసుకున్నట్లు ఆమె తెలిపారు. రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందాలని, మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి పలు పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. శనివారం ఉదయం నైవేద్యాల విరామసమయంలో తిరుమలకు వచ్చిన మంత్రి సవిత శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆమెకు రిసెప్షన్ ఓఎస్‌డి సత్రానాయక్, ఆలయ పేష్కార్ రామకృష్ణ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవారి సేవలో తెలంగాణ జడ్జి నగేశ్



**తిరుమల,సెప్టెంబర్13ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని శనివారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక కుటుంబ సభ్యులతో కలసి దర్శించుకున్నారు. కుటుంబంతో కలసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండ పంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అమరావతిపై వైఎస్సార్సీ నేతల దొంగ నాటకాలు: మంత్రి అనగాని



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజా రాజధాని అమరావతిపై మళ్ళీ వైసిపి నేతలు దొంగ నాటకాలు ఆడుతున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. ఈ విషయంలో మూడు ముక్కలాట ఆడిన జగన్‌ను ప్రజలు ఛీదరించుకునానరని మండిపడ్డారు. అమరావతి రాజధాని నిర్మాణం అక్కర్లేదంటూనే గుంటూరు ,విజయవాడ మధ్య నిర్మిస్తామని కబుర్లు చెబుతున్నారని దుయ్యబట్టారు. ఇక్కడి రైతులు, మహిళలపై జగన్ వేధింపులు, పెట్టిన కేసులు ఇంకా మర్చిపోలేదన్నారు. ఆయన గోడ మీద పిల్లి వైఖరిని ప్రజలు గమనిస్తునే ఉన్నారని చెప్పారు. ఐదేళ్ళ పాటు అమరావతిని నిర్లక్ష్యం చేసిన జగన్‌ను వచ్చే ఎన్నికల్లోనూ రాష్ట్ర ప్రజలు ఓడిస్తారని పేర్కొన్నారు. అబద్ధాలతో జగన్ ప్రజలను నమ్మించలేరన్నారు. జగన్ వచ్చే ఎన్నికల్లో పులివెందుల్లో గెలిచేపరిస్థితి లేదన్నారు. చంద్రబాబ ఒక విజన్‌తో ముందుకు వెళ్తున్నారన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలుపుతారన్నారు.

# ఆత్మకూరు గురుకుల పాఠశాలలో విషజ్వరాలపై తక్షణ చర్యలకు మంత్రి ఆదేశం



హాస్టల్‌ను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

**ఆత్మకూరు (నెల్లూరు), సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** ఆత్మకూరులోని బాలికల గురుకుల పాఠశాలలో విషజ్వరాల కలకలంపై రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తక్షణమే స్పందించారు. విషజ్వరాల సమాచారం తెలియాగానే మంత్రి అధికారులను అప్రమత్తం చేసి విద్యార్థులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఆత్మకూరు గురుకుల పాఠశాల ఘటనలపై నెల్లూరులోని క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్ని స్థాయిల అధికారులతో మంత్రి అత్యవసరంగా గ్రూప్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి చేపట్టాల్సిన చర్యలపై సూచనలకు ఆదేశాలిచ్చారు. మంత్రి ఆదేశాలతో సమాయత్తమైన వైద్యఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆత్మకూరు గురుకుల పాఠశాలకు వెళ్ళి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఏ ఒక్క విద్యార్థికి కూడా ఇబ్బంది కలగకఉండా చూడాలని మంత్రి ఆనం అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రస్తుతం జ్వరాల బారినపడిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలలు, హాస్టల్స్ లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ స్వచ్ఛమైన తాగునీటిని విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విషయంలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి ఆనం హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా జాయింట్‌కలెక్టర్ కార్తీక్, డిఎంఅండ్‌హెచ్ఒ సుజాత, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఒ ఖాదర్‌వలి, ఆర్‌డిఒ పావని, తహసిల్దార్ పద్మజాకుమారి, జిల్లా బిసికార్పోరేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యాశాఖ, ఐటిడిఎ, గురుకుల పాఠశాలల అధికారులు, జిల్లా ఆసుపత్రి సూపర్నెంట్ డాక్టర్ శేషారత్నం, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గోపవరం వెంకటరమణమ్మ, టిడిపి నాయకులు తుమ్మల చంద్రారెడ్డి, పులిమి శైలజారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ శివకోటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నప్రసాదాలకు రూ.44 లక్షలు విరాళమిచ్చిన తమిళ మంత్రి



**తిరుమల,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమలలో భక్తులకు ఒకరోజు అన్నప్రసాదం వడ్డనకు అయ్యే 44లక్షలు రూపాయలు విరాళాన్ని తమిళనాడుమంత్రి కెఎన్ నెహ్రూ అందించారు. నవంబర్ 9వతేదీ తన పుట్టినరోజున పూర్తిగా భక్తులకు తనపేరున అన్నప్రసాదాలు వడ్డించాలని కోరుతూ టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు శనివారం రాత్రి అందజేశారు.

# రాజకీయ పార్టీలకు నిర్దిష్టమైన ఏకాభిప్రాయం ఉండాలి: మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి

**సచివాలయం,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త :** ఏ ఎండకా గొడుగు కాసే రాజకీయ పార్టీలను ప్రజలు విశ్వసించే రోజులు పోయాయని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖమంత్రి బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూటర్న్ తీసుకోవడానికి ముందు అమరావతి ప్రజలు, మహిళలు, రైతులకు వైసిపి క్షమాపణ చెప్పాలన్నారు. అమరావతిని స్మశానంతో పోల్చిన వైసీపీ నేడు ఏ మోహం పెట్టుకొని అమరావతి రాజధాని అంటుంది. మూడు రాజధానుల పేరిట ఐదేళ్ళ కాలాన్ని వృధా చేసినందుకు జగన్మోహనరెడ్డి సిగ్గుతో తల దించుకోవాలన్నారు.

# విజయవాడలో డయేరియా మూలాలు పరిశీలిస్తున్నాం: మంత్రి నారాయణ



**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** నగరం లోని న్యూరాజరాజేశ్వరీపేటలో డయేరియా మూలాలు ఎక్కడున్నాయో కనుక్కొనేందుకు దృష్టి పెట్టామని తెలిపారు. ఆర్‌ఆర్ పేటలో శనివారం ఆయన పర్యటించారు. స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన డయేరియా మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. నూతన ప్రభుత్వాసుపత్రిలో భాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ...ఈ సాయంత్రం లేదా సోమవారం ఉదయానికి నీటి పరీక్షల నివేదికలు వస్తాయన్నారు. రిపోర్టులు వచ్చాక అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. డయేరియా కారణం తాగునీరా లేదా ఫుడ్ పాయిజన్ అన్నది స్పష్టత రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే 15 వేల వాటర్ క్యాన్ల ద్వారా తాగు నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 150 మంది చికిత్స తీసుకొని ఇంటికెళ్ళారని వివరించారు. డయేరియా వల్ల ఎలాంటి మరణాలు సంభవించలేదని పేర్కొన్నారు. ప్రజలెవరూ వదంతులు నమ్మవద్దని సూచించారు.

# తిరుపతి జిల్లాకు కొత్త ఎస్పీగా సుబ్బారాయుడు

**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** అంతా ఊహించినట్లే ఐపిఎస్ అధికారుల బదిలీల్లో తిరుపతి జిల్లాకు నూతన ఎస్పీగా మళ్ళీ లంకెల సుబ్బరాయుడు నియమితులయ్యారు. 14 మంది ఐపిఎస్ అధికారుల బదిలీల్లో సుబ్బరాయుడు తిరుపతికి నియమితుల య్యారు. తెలంగాణారాష్ట్రం నుండి ఇంటర్‌కేడర్‌లో మూడేళ్ళ డిప్యూటేషన్‌పై గత ఏడాది వచ్చిన సుబ్బరాయుడు 2013 పోలీసు బ్యాచ్ అధికారి. గత ఏడాది జూలై 16వ తేదీ తొలిసారిగా తిరుపతి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. ప్రజలకు భద్రత కల్పించే విషయంలో ,పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారు. 2025జనవరి 8వతేదీ రాత్రి జరిగిన తిరుపతి తొక్కిసలాటలో ఆరుగురు ప్రాణాలు కోల్పోవడంతో ఉన్నతాధికారుల బదిలీల్లో జిల్లా ఎస్పీ బదిలీ తప్పలేదు. సుబ్బరాయుడును బదిలీ చేస్తూ ,డిజిపి కార్యాలయంలో రిపోర్టుచేయాలని ఈ ఏడాది జనవరి 9న ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆ తరువాత ఆయన్ను ఎర్రచందనం అక్రమరవాణా టాస్క్‌ఫోర్స్ చీఫ్‌గా ప్రభుత్వం నియమించినా ఆయన పెద్దగా సుముఖత చూపలేదు. ముఖ్యమంత్రిచంద్రబాబుకు విశ్వాసమున్న అధికారి.

# ఆలయాల్లో జరిగే వివాహాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి

### - ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలి: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

### - బాల్య వివాహ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరం

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆలయాల్లో జరిగే వివాహాలపై ఆయా ఆలయాల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని.. ప్రతి వివాహం తప్పనిసరిగా రిజిస్టర్ కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో వాసవ్య మహిళా మండలి, జస్ట్ రైట్ ఫర్ చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మత పెద్దలు.. పేరిట ప్రత్యేక సమావేశం జరిగింది. విజయవాడ నగరంతో పాటు జిల్లాలోని వివిధ దేవాలయాల అధికారులు హాజరైన ఈ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ బాల్య వివాహాలు లేని సమాజ నిర్మాణానికి సమష్టి భాగస్వామ్యం అవసరమన్నారు. బాల్య వివాహ రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్ది, ఆదర్శంగా నిలపడంలో ప్రతిఒక్కరూ చేయిచేయి కలపాలని పేర్కొన్నారు. పిల్లలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు నిబద్ధతతో కృషిచేయాల్సి ఉందన్నారు. ఈ వసుధైవ కుటుంబంలో భాగమైన మనందరం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించి, బాల్య వివాహాలు జర క్కుండా కలిసికట్టుగా కృషిచేయాల్సి ఉందన్నారు. చట్టాలను గౌరవిస్తూ, నిబంధనలు పాటిస్తూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా గళమెత్తాల్సిన అవసర ముందన్నారు. ప్రతి దేవాలయంలో వివాహానికి అర్హత వయసు, వయసు ధ్రువీకరణపత్రాలు, చట్ట నియమ నిబంధనలు తెలియజేసేలా ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఆలయాల్లో జరిగే వివాహాలపై ఈవోలు ప్రత్యేకంగా దృష్టిసారించి, పర్యవేక్షించాలని సూచించారు. బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేసేందుకు సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేసేందుకు 112 నంబరుతో పాటు చైల్డ్ హెల్ప్ లైన్ 1098కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయాల్లో ప్రదర్శించాల్సిన వివరాలతో కూడిన నమూనా పోస్టర్లను కలెక్టర్ లక్ష్మీశ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆలయాల అధికారులతో కలిసి ఆవిష్కరించారు.

సమావేశంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డా. బి.కీర్తి,

ఎండోమెంట్ ఏసీ షణ్ముఖ నటరాజన్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వివాహ రిజిస్ట్రేషన్‌లపై పోస్టరును ఆవిష్కరిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఇతరులు

# ఆకట్టుకుంటున్న రాయలసీమ నృత్యకళోత్సవాలు




**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాత వార్తప్రతినిధి:** తిరుపతి మహతి కళాక్షేత్రంలో జరుగుతున్న రాయలసీమ రంగస్థలి నృత్యకళోత్సవాలు కళాకారులను, ఆహుతులను ఆకట్టుకుంటున్నాయి. నృత్యోత్సవాల్లో రెండవరోజు శనివారం ఉదయం నుండి సాయంత్రం వరకు భీమవరం కళాకారులు ప్రదర్శించిన బుడబుక్కలు జానపదనృత్యం విశేషంగా ఆకట్టుకుంది. గుడివాడ, హైదరాబాద్, విజయనగరం, ఒంగోలు ప్రాంతాల నుండి వచ్చిన నృత్యకళాకారులు ప్రదర్శించిన నృత్యోత్సవాలు జనరంజకంగా నిలిచాయి. కళాకారులకు శ్రీకృష్ణదేవరాయ పురస్కారాలను నిర్వాహకులు రాయలసీమ రంగస్థలి ఛైర్మన్ గుండాల గోపీనాధరెడ్డి, ,కళాకారులు కెఎన్ రాజ, విజయభాస్కర్‌రెడ్డి, కోండే చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, నాగేశ్వరరావు ,మల్లారపు వాసు ప్రదానం చేశారు.

ప్రస్తుత ఖరీఫ్ సీజను చివరి దశకు చేరింది. అయినా రైతులకు కష్టాలు తప్పడం లేదు. ప్రధానంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఖరీఫ్ సాగు ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఈ సీజన్లో వరి సాగుతో పాటు పత్తి, మొక్కజొన్న వంటి పంటలసాగు గణనీయంగా జరిగింది. ఈనెలాఖరు నాటికి సాగు టార్గెట్ దాటే అవకాశం ఉంది. సకాలంలో వర్షాలు రాక నాట్లు జాప్యం జరిగినా, తదుపరి కురిసిన వానలతో ఖరీఫ్‌సాగు జోరందుకుంది. అయితే మళ్లీ భారీవర్షాలు, వరదలతో వేసిన పంట దెబ్బతినడంతో కొందరురైతులు మళ్లీ రెండోసారి విత్తులు నాటారు. వానాకాలం ప్రారంభంలో మే నెలలో వర్షాలు కురిసినప్పటికీ, ఆ తర్వాత నెలన్నర రోజుల పాటు వానలు ముఖం చాటేయడంతో సాగు మందగించింది. జూన్లో వర్షాలు సరిగా కురువక పంటల సాగుకు ప్రతికూలంగా మారాయి. జులై నెలాఖరు, ఆగస్టు ప్రారంభం నుంచి కురుస్తున్న వర్షాలు పంటలకు ప్రాణం పోశాయి. ఈనేపథ్యంలో ఖరీఫ్ సీజను గాను కొన్ని పంటల సాగు ఆశాజనకంగా సాగుతుండగా, మరికొన్ని పంటల పరిస్థితి నిరాశను కలిగిస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో అతివృష్టి, మరికొన్నిప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ పంటల సాగు అనుకున్నంత మేర ఫలితాలను ఇస్తాయాలేదా అనేది సందిగ్ధమే అవుతోంది. దీనికి తగినట్లుగా ఇటీవల కాలంలో లేనటువంటి సమస్య ఖరీఫ్ రైతులను వెంటాడుతోంది. ప్రధానంగా యూరియా కొరత రైతులను వేధిస్తోంది. సకాలంలో పంటలకు అవసరమైన యూరియా లభ్యం కాక అన్నదాతల పరిస్థితి ఇప్పటికీ దయనీయగా ఉంది. కొన్నిచోట్ల ఒక్కోబస్తా, రెండేసి బస్తాలు యూరియా సరఫరా చేస్తున్నా, అది సాగు చేసిన పంటలకు సరిపోక రైతుల్లో ఆందోళన స్పష్టంగా కనిపిస్తోంది. రాత్రి, పగలుయూరియా కోసం సహకార సంఘాలు, ఫెర్టిలైజర్ షాపులు, ఇతర విక్రయ కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు.

# సగటు రైతును వీడని ఖరీఫ్ కష్టాలు

**సిహెచ్ వి వి రఘుబాబు**

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నారు. వర్షాభావ పరిస్థితులు, భారీ వర్షాలకు తోడు, యూరియా కొరతతో ఖరీఫ్ కష్టాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. తెలంగాణలో ఈ వానాకాలంలో సాగు 1.27 కోట్ల ఎకరాలకు చేరింది. ఈ సీజన్లో సాధారణ సాగులక్ష్యం 1.34కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటికే 96శాతం లక్ష్యం సాధించిందని వ్యవసాయశాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసింది. ఈ వానాకాలం సీజన్ లో సాగైన పంటల్లో వరి 62.27 లక్షల ఎకరాలతో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తరువాత పత్తి పంట 45.47 లక్షల ఎకరాలతో రెండో స్థానంలో ఉంది. రికార్డు స్థాయిలో మక్కలు 6.27లక్షల ఎకరాలు, కంది 4.78 లక్షల ఎకరాలు, సోయా 3.62 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. పెసర 61వేల ఎకరాలు, జొన్న 34,611ఎకరాల్లో సాగు కాగా, మినుములు 23వేల ఎకరాలు, ఇతర పంటలు 30వేల ఎకరాల్లో సాగయ్యాయి. ఇక వానకాలం సాగులో రాష్ట్రంలో 10.50 లక్షల ఎకరాలతో నల్గొండ టాప్‌లో నిలిచింది. ఈ జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో పత్తి, 4.84 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. అలాగే, 7.28 లక్షల ఎకరాలతో సంగారెడ్డి రెండో స్థానంలో, 6.27లక్షల ఎకరాలతో ఖమ్మంజిల్లా మూడో స్థానంలో ఉంది. ఆ తరువాత ఆదిలాబాద్ 5.79 లక్షల ఎకరాలతో నాలుగో స్థానంలోఉండగా ఆ తరవాత స్థానాల్లో నిజామాబాద్ (5.52 లక్షల ఎకరాలు), సూర్యాపేట (5.43 లక్షల ఎకరాలు), కామారెడ్డి (5.43 లక్షల ఎకరాలు), 5.37 లక్షల ఎకరాలతో వికారాబాద్ జిల్లాలు వరుస స్థానాల్లో నిలిచింది. కాగా ఈ ఖరీఫ్ సీజనులో రాష్ట్రంలోని 21 జిల్లాల్లో ఎక్సెస్ వర్షపాతం చూస్తే జులై 20 వరకు 25 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదవడంతో సాగు వెనకబడింది. విత్తనాలు, మొలకలు ఎండిపోవడంతో రైతులు దిగ్భ్రాంతికి గురయ్యారు. అయితే, జులై నెలాఖరు నుంచి కురిసిన వానలు సాగు పుంజుకునేలా చేశాయి. గత నెల రోజుల్లోనే పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోని పంటలు సాగయ్యే 32 జిల్లాల్లో 21 జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా, మరో 11 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఫలితంగా దాదాపు అన్ని జిల్లాల్లో పంటల సాగు 100 శాతానికి చేరువైయ్యాయి. 10 జిల్లాల్లో వందశాతం సాగును దాటేశాయి. అయితే ఇటీవల కురిసన వర్షాలు రైతుల్లో ఆశలు రేకెత్తించగా, సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందనేది వ్యవసాయశాఖ అంచనా. మరోపక్క ఈ ఖరీఫ్ సేద్యానికి 9.80లక్షల టన్నుల యూరియా అవసరమని రాష్ట్ర వ్యవసాయ శాఖ అంచనా వేసింది.



కేంద్రం 9.8లక్షల యూరియా కేటాయించింది. ఈ ఖరీఫ్‌లో ఆగస్టు నాటికి కేంద్రం నుంచి 8.32 లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 5.12 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. అలాగే ఏప్రిల్ 1.70 లక్షల టన్నులు, మే 1.60 లక్షలు, జూన్‌లో1.70లక్షలు, జులైలో 1.60లక్షలు, ఆగస్టులో 1.70 లక్షల టన్నులు మాత్రమే వచ్చింది. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీనుండి రాష్ట్రానికి అత్యధిక శాతం యూరియా రావాల్సి ఉంది. సాంకేతిక కారణాలు, రిపేర్లతో మూడు సార్లు షట్‌డౌన్ అయింది. దీంతో ఆగస్టు వరకు 1.69లక్షల టన్నుల యూరియా రావాల్సి ఉండగా, 1.06లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయ్యింది. రామగుండం ఫ్యాక్టరీ సక్రమంగా పనిచేయక పోవటానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమనేభావన ఉంది. మరోపక్క ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 8.21 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగుచేశారు. ఈ సీజనుకు రాష్ట్రానికి 6.22 లక్షల టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. ఇది గతసంవత్సరం కన్నా 10,138 టన్నుల తక్కువ. గత సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 4,69,297 టన్నులు సరఫరా కాగా, ఈ ఏడాది 3,72,246 టన్నుల మాత్రమే కేంద్రం నుండి సరఫరా జరిగింది. రాష్ట్రానికి యూరియా కోత 96 వేల టన్నులకు పైగా ఉంది. ఆగస్టుకి 1 లక్షా 30 వేల టన్నుల యూరియా కేంద్రం సరఫరా చేయాల్సి ఉండగా, అందింది మాత్రం 49, 485 టన్నులు మాత్రమే. ఆగస్టు నెల కోటాలో ఇంకా కేంద్రం నుంచి 81 వేల టన్నులు రావాల్సిన దానిలో 53 వేల టన్నులు కేంద్రం విడుదల చేసినా ఇంకా 28వేల టన్నులు కేంద్రం నుంచి రావాల్సి ఉంది. దీన్ని గమనిస్తే అదనంగా కేంద్రం యూరియా కేటాయింపు ఎక్కడా కనిపించడం లేదు. 53వేల కేటాయింపుల్లో కూడా కాకినాడ పోర్టు నుండి 17,293 టన్నులు దిగుమతి చేసుకోవటానికి మాత్రమే కేంద్రం జిఒ విడుదల చేసింది. ఇక యూరియా సరఫరాలో ప్రభుత్వాల నిర్లక్ష్య పంట దిగుబడులపై ప్రభావం చూపిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న యూరియా కొరత కారణంగా పత్తి, వరి దిగుబడి 20 నుంచి 30 శాతం తగ్గే అవకాశం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. యూరియా కొరత ఇలాగే కొనసాగితే దిగుబడులు 40 శాతం తగ్గినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్తున్నారు. ఈ రెండు పంటలకు సకాలంలో యూరియా వేస్తే పంట ఏపుగా పెరిగి దిగుబడికూడా పెరుగుతుంది. లేదంటే సమస్యలు తప్పవని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పైరు ఎర్రబారడంతో పాటు చీడపీడలు పీడిస్తాయని చెప్తున్నారు. దీనికి తోడు యూరియా కొరతతో ఒకవైపు దిగుబడి తగ్గే ప్రమాదం ఉండగా, మరోవైపు రైతులకు చీడపీడల నివారణ ఖర్చు పెరుగుతున్నది. రెండురాష్ట్రాల్లో ఎకరానికి 23నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం ఉత్పత్తి అవుతున్నది. యూరియా కొరత కారణంగా దిగుబడి 30 శాతం తగ్గితే దాదాపు ఏడు క్వింటాళ్ల దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అదే జరిగితే ఒక్కో రైతు ఎకరాకు సగటున రూ.17 వేల వరకు నష్టపోతాడు. దిగుబడి తగ్గితే రైతు ఆదాయంలోనూ కోత పడుతుంది. దీనికి తగినట్లుగా చీడపీడల నివారణకు గాను రైతులు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఇదే సమయంలో ఇటీవల రెండు రాష్ట్రాల్లో వర్షబీభత్సం అన్నదాతలకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి. పలుచోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. దీంతో తెలంగాణ వ్యాప్తంగా సుమారు 4.10 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టంజరగ్గా నిబంధనల ప్రకారం ప్రభుత్వం 2.50 లక్షల ఎకరాలే దెబ్బతిన్నట్లు గుర్తించింది. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టం మిగిలింది. దెబ్బతిన్న పంటల్లో 1.80 లక్షల ఎకరాల్లోని పత్తి చేలు నీట మునిగాయి. అలాగే మరో 1.30 లక్షల ఎకరాల్లో వరిచేలు వరద ముంపునకు గురైంది. ప్రధానంగా రాష్ట్రంలోని మెదక్, సంగారెడ్డి, నల్లగొండ, కొత్తగూడెం, జనగాం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట్, ములుగు, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, హన్మకొండ తదితరజిల్లాల్లో అత్యధికంగా పంటలు నీట మునిగాయి. ఒక్క ఖమ్మం జిల్లాలోనే 5లక్షలకుపైగా ఎకరాల్లో పంట నీట మునిగింది. వాగులు, వంకలు, చెరువులు, కాల్వలు పొంగిపొర్లడంతో పొలాల్లోకి భారీగా నీరు వచ్చిచేరింది. పత్తి, మిరప, వరి, మొక్కజొన్న, కూరగాయల తోటలకు వర్షాలు, వరదలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో గత నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా వరి, పత్తి, చెరుకు, మొక్కజొన్న వంటి పంటలకు గణనీయమైన నష్టంజరిగింది. పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని లోతట్టుప్రాంతాలు నీట మునగడంతో పాటు, కొన్ని చోట్ల పంట పొలాలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఆగస్టు 18, 19 తేదీల్లో కురిసిన భారీ వర్షాలు రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించాయి. ●

---

తమిళనాడు

కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే పిల్లలు పుడతారంటారు. తమిళనాట బిజెపి ప్రస్తుతం అదే అభిప్రాయంతో కనిపిస్తోంది. సిపి రాధాకృష్ణన్ గతవారం ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత నుంచి బిజెపిలో ధీమా మరింతపెరిగింది. రాష్ట్రానికి చెందిన బిజెపి సీనియర్ నేత అయిన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉండడం వల్ల విజయావకాశాలు మెరుగుపడ్డాయనే పార్టీ నేతలంతా భావిస్తున్నారు. యేడాదిలోగా అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రానికి చెందిన నేత ఉపరాష్ట్రపతిగా ఉంటే పార్టీకి ఆ భరోసాయే వేరు. ఆ ప్రభావం అనేక విధాలుగా కనిపిస్తుంది. రాష్ట్రంలో బిజెపి పరిస్థితి ప్రస్తుతం అంతంత మాత్రంగానే ఉంది. సీనియర్ లీడర్లు చాలా కొద్దిమందే ఉన్నారు. అన్నాడిఎంకెతో పొత్తు కొనసాగిస్తున్నది కానీ 2021, 24 ఎన్నికల్లో ఆ పొత్తు వల్ల ఎలాంటి ప్రయోజనం లభించక పోవడంతో ప్రస్తుతం డోలాయమానంలో పడింది. అందుకు ప్రధాన కారణం అన్నాడిఎంకె పరిస్థితి కూడా క్షీణ దశలో ఉండడమే. గతంలో ఎమ్జీఆర్, జయలలిత వంటి కీలకనేతలెందరో ముఖ్యమంత్రులైన అన్నాడిఎంకెలో ప్రస్తుతం ఓ పది సీట్లు గెలిపించగల నేతలు కూడా కరవవడంతో ఆ పార్టీతో పొత్తువల్ల తమకు ఎలాంటి ప్రయోజనం ఉండదనే భావిస్తున్నా పొత్తు మాత్రం కొనసాగుతోంది. బిజెపి అధిష్ఠానం తమిళనాడుపై దృష్టిని కేంద్రీకరించి అధికారంలోకి రావడానికి అవసరమైన పావులు కదుపుతోంది. ప్రధాని మోడీ కూడా తనదృష్టిని, శక్తిని తమిళనాడుపైనే ఎక్కువ కేంద్రీకరించారని ఆయన ఇటీవల రాష్ట్రానికి చేసిన పర్యటనలు, ప్రకటించిన నిధులను చూస్తే స్పష్టమవుతుంది. దక్షిణాదిలో ప్రధానంగా ఎపిలో ఎన్డీయే ప్రభుత్వం ఉంది. అయితే అక్కడ టిడిపి, జనసేన తర్వాత నిలబడవలసిందే. తెలంగాణలో అంతర్గతంగా విపక్ష బిఆర్ఎస్‌తో సాన్నిహిత్యం పెంచుకున్నదనీ, అందుకే సీట్లు పెరిగాయనీ అంటారు. ఇక మెరుగుపడవలసింది తమిళనాడు లోనే. అధికారంలోకి వచ్చినా రాకపోయినా వచ్చేయేడు జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో కీలక రాజకీయ శక్తిగా మారాలని మాత్రం బిజెపి భావిస్తున్నదనడానికి రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి చేయడమే బలమైన ఉదాహరణగా చెప్పవచ్చు.

# కలిసొచ్చే కాలానికి..

**ఎ.వి.వి ప్రసాద్**

ఆయన గెలుపు ఫలితం వెలువడగానే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన కె అణ్ణామలై చేసిన ప్రకటన చూస్తే ఎలాంటి వ్యూహంతో వారు కదులుతున్నారో అర్థమవుతుంది. రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా ఉండగా బిజెపి రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. తమనాయకుడు ఉపరాష్ట్రపతి అయ్యారనే ఆనందంలో ఆయన అలాంటి ప్రకటనచేసిఉండవచ్చు కానీ బిజెపికి అంతటి'శక్తిసామర్థ్యాలు' ఉన్నాయా? అనే సందేహం కూడా వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ పార్టీకి రాష్ట్రంలో 2.6 శాతం ఓట్లు మాత్రమే ఉన్నాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన సీట్లు కూడా 4మాత్రమే. అన్నాడిఎంకె 66సీట్లు సాధించడంతో, పిఎంకె వంటి పార్టీలతో కలుపుకొని



సిపి రాధాకృష్ణన్

ఎన్డీయె కూటమి మొత్తం 76సీట్లు సాధించగలిగింది. అదే సమయంలో 133 సీట్ల డిఎంకె తో కలిపి ఆ కూటమికి మొత్తం 162సీట్లు లభించాయి. అంటే డిఎంకె కూటమి సమీపంలోకి కూడా ఎన్డీయే కూటమి రాలేకపోయింది. డిఎంకె కూటమిలో కాంగ్రెస్, ఎండిఎంకె, వామపక్షాలు ఉండడంతో సీట్లుకూడా వారికి అధికంగానే వచ్చాయి. అయితే చీలికలు పీలికలుగా ఉన్న అన్నాడిఎంకెతో పొత్తు వల్ల వాస్తవానికి గత ఎన్నికల సీట్లు కూడా ఈసారి వచ్చే అవకాశం లేదనే వాదన వినిపిస్తోంది. అందుకే కొత్తపార్టీ, ప్రజల్లో విశేషాదరణ గల సినీనటుడు విజయ్ సారథ్యంలోని టివికెను తమ కూటమి లోకి ఆకర్షించేందుకు బిజెపి గట్టిగా ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నం ఫలిస్తే ఎన్డీయే విజయావకాశాలు మరింత మెరుగుపడతాయని చెప్పవచ్చు. కానీ ఒంటరిగానే బరిలోకి దిగుతామని విజయ్ అంటున్నారు. ఎన్నికల వాతావరణం ఏర్పడేసరికి ఆయన అభిప్రాయం మారినా మారవచ్చు. ప్రత్యక్షంగాపొత్తు ఉన్నాలేకపోయినా పరోక్ష మద్దతు అయినాటివికె నుంచి బిజెపికి లభించగలదని పరిశీలకులు భావిస్తున్నారు. అలా విజయ్‌తో చేతులు కలిపితే బిజెపికి అధికార అవకాశాలు కూడా పెరుగుతాయి. అది విఫలమైతే బిజెపివద్ద 'ప్లాన్ బి' కూడా ఉన్నట్లు తెలుస్తోంది. మొదటి నుంచి ఆరెస్సెస్‌లో బలమైన నేతగా ఎదిగిన రాధాకృష్ణన్‌కు తమిళనాడులోని గౌండర్ కమ్యూనిటీలో చాలా ఆదరణ ఉంది. ఇంతకుముందు గవర్నర్‌గా బిజెపి రాష్ట్రాల మధ్య సమన్వయకర్తగా కూడా ఆయన ఉన్నారు. మంచి వాగ్ధాటి ఉన్న రాధాకృష్ణన్ పిలుపు ఇస్తే గౌండర్ కమ్యూనిటీతోపాటు ఇతర ఒబిసి వర్గాల్లోకూడా ఎక్కువ ప్రభావమే ఉంటుందనీ, తద్వారా ఓట్లశాతం బాగా పెరుగుతుందనీ బిజెపి భావిస్తోంది. కనీసం 10, 15 శాతానికి ఓట్లు పెంచుకోగలిగితే సీట్లసంఖ్య బాగా పెరుగుతుంది గనుక అధికారానికి దగ్గరవుతుంది. అప్పుడు విజయ్ వంటి పార్టీల మద్దతుతోనైనా అధికారంలోకి వచ్చేఅవకాశం ఉంటుంది. అన్నాడిఎంకెలోని చీలిక వర్గంనేత, మాజీముఖ్యమంత్రి పన్నీర్ సెల్వం సొంతపార్టీ పెట్టేఆలోచన చేస్తుండటంతో ఆయన మద్దతు కూడా ఉపయోగించుకొని చక్రం తిప్పేందుకు బిజెపి వ్యూహరచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ఏదిఏమైనా ఈ ఎత్తుగడలన్నీ ఫలించడానికి రాధాకృష్ణన్ సహకారం పూర్తిగాఉంటుందనీ, ఆయనను ఉపరాష్ట్రపతిని చేయడానికి అది ఒకబలమైన కారణమనీ అంటున్నారు. అన్నాడిఎంకె మాజీనేత టిటివి దినకరన్ నాయకత్వంలోని ఎఎంఎంకె పార్టీని తిరిగి కూటమిలోకి రప్పించే యత్నాలను కూడా బిజెపిచేస్తోంది. దానికి కూడా రాధాకృష్ణన్ సహకారం ఉంటుందనుకొంటున్నారు. శశికళసహా అన్నాడిఎంకెలోనిమాజీ నేతలందరినీ తిరిగి రప్పిస్తే విజయావకాశాలు బాగా పెరుగుతాయని బిజెపి భావిస్తోంది. ఈ సమీకరణలన్నిటికీ రాధాకృష్ణన్ చాలా ఉపయోగపడతారని వారిఉద్దేశం. రాధాకృష్ణన్‌సేవలువారికి ఏమేరకు ఉపయోగపడతాయో చూడాలి. ●

---

నేపాల్

ప్రపంచంలోని కొన్ని దేశాల్లో స్థానికతపై ఉద్వేగం, మా ఉపాధి మాకే కావాలంటూ నిరసనలు, స్థానికులకే ప్రాధాన్యం అన్న చందాన మరోదేశం ఇలా ఎవరి సమస్యలతో వారు సతమతం అవుతూ భూగోళాన్ని హింసాత్మకంగా మార్చేసారు. మూడేళ్లుగా సాగుతున్న ఉక్రెయిన్ యుద్ధం ఇప్పటికీ కొలిక్కిరాలేదు. పొరుగుననే ఉన్న చైనా, పాక్‌లు సందు దొరికితేచాలు ఎక్కడ చొరబడదామా అన్న ఆలోచనలే. వీటికి భిన్నంగా ఇప్పుడు చిన్న హిమాలయ దేశం నేపాల్‌లో ఉవ్వెత్తున ఎగిసి పడిన జెన్‌జడ్ ఉద్యమం చివరకు ప్రభుత్వాన్నే కూలదోసింది. ప్రధాని కెపిశర్మ ఓలి రాజీనామా చేయడంతోపాటు పార్లమెంటురద్దుకు సైతం దారితీసింది. సామాన్య మధ్యతరగతి జీవనప్రమాణాలు మెరుగుకోసం శ్రమిస్తుంటే పాలకుల వారసులు మాత్రం అవినీతి సొమ్ముతో విలాసజీవితాలు అనుభవిస్తున్నారంటూ ఉద్యమకారులు ఆందోళన లేవనెత్తారు. నెపోకిడ్‌పేరిట లేచిన ఈఉద్యమం చివరకు పార్లమెంటు, మంత్రులు ప్రభుత్వ కార్యాలయాలను సైతం దగ్ధం చేసింది. సైన్యం రంగంలోకి దిగినా పట్టువిడవని విద్యార్థి, యువలోకం కొత్తప్రభుత్వం రావాలని, ఎన్నికలు జరగాలన్న పట్టుదలతోనే నిరసన కొనసాగించారు. మొత్తం 51మందివరకూ చనిపోగా 1300 మందికిపైగా తీవ్ర గాయాలపాలై వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. అయినా కూడా ఈ జెన్‌జెడ్ నెపోకిడ్ వ్యతిరేక ఉద్యమాన్ని కొనసాగించింది. నేపాల్‌లోని వివిధజైళ్ల నుంచి పదివేలమందికిపైగా ఖైదీలు కూడా పరారయ్యారు. వారిని అదుపుచేసేందుకు సరిహద్దుల్లో అప్రమత్తం అయిన దేశాల భద్రతా దళాలు కొందరిని పట్టుకుని అప్పగించాయి. సైన్యంపై తిరగబడిన కొందరిపై నేపాల్ సైన్యం కాల్పులు జరపక తప్పలేదు. వీరిలో రాజకీయ ఖైదీలతో పాటు ప్రమాదకరమైన నేరాలు చేసిన ఖైదీలు కూడా ఉన్నారు. ఇది దేశానికి ముప్పు అని భావించడంతోనే సైన్యం రంగంలోకి దిగి ఎక్కడికక్కడ కట్టడి కార్యాచరణ అమలుచేసింది. రాను రాను ఉద్యమం తారస్థాయికి చేరుకుంటుండటంతో పాలకులు మెట్టుదిగి జెన్‌జడ్ సూచించిన సుశీలా కర్కినే ప్రధానిని చేయాలన్న డిమాండ్‌కు తలొగ్గడం వంటి పరిణామాలు చకచకా జరిగాయి. అవినీతి మరకలులేని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీలా కర్కిని ఎంపికచేసి ఆమె ఆధ్వర్యంలోనే తాత్కాలిక ప్రభుత్వం కొనసాగించాలని పట్టుబట్టారు. యువత డిమాండ్లకు దిగివచ్చిన ప్రభుత్వం అప్పటికప్పుడు రాత్రిపొద్దుపోయాక రాష్ట్ర పతిభవన్‌లో కర్కిచేత ప్రమాణ స్వీకారం చేయించింది. పరిమిత కేబినెట్‌తో అత్యవసర సమావేశం నిర్వహించి ముందు పార్లమెంటును రద్దుచేయడం ఆతర్వాత వచ్చే ఏడాది మార్చిలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని ప్రకటించడం చకచకా జరిగిపోయాయి. దీనితో ఉవ్వెత్తున ప్రజ్వరిల్లిన హింస ఒక్కసారిగా శాంతించింది. దీనికంతటికీ ప్రధాన మూలం సుశీల కర్కిని ఎంపిక చేయడమే. అభిశంసన తీర్మానాన్ని సైతం అధిగమించి పదవీ విరమణ వరకూ కొనసాగిన ఏకైక మహిళా ప్రధాన న్యాయమూర్తిగా పేరున్నసుశీల కర్కి ఆనాటి నేపాల్ సమాచార మంత్రినిసైతం జైలుకు పంపించేందుకు వెనుకాడలేదు. ఆమె చీఫ్‌జస్టిస్‌గా కొనసాగిన కాలంలో నేపాల్‌లో అవినీతి రాజ్యమేలింది. అవకతవకల పాలనలతో అట్టుడికిన నేపాల్‌లో అవినీతిపై ఆమె రాజీలేని వైఖరిని కొనసాగించారు. పాలక నేతలతో సన్నిహిత సంబంధంఉన్న కుటుంబం నుంచే వచ్చినప్పటికీ కర్కికి రాజకీయ నేపథ్యం ఏమీలేదు. న్యాయ వ్యవస్థలో ఆమె అవలంభించిన వైఖరే ఆమెకు పేరుప్రతిష్టలు తెచ్చిపెట్టింది. ఆనాడు అధికారం లోని నేపాలి కాంగ్రెస్ సిపిఎన్ మావోయిస్టు సెంటర్ ఆధ్వర్యంలో ఆమెపై పదవీచ్యుతి తీర్మానం ప్రవేశపెట్టారు. అవినీతినిరోధకశాఖ చీఫ్‌ను అవినీతి ఆరోపణలపై ఆమె తొలగించాలని తీర్పుచెప్పడం పాలకులకు సుతరామురుచించ లేదు. ఈప్రతిపాదన ఏకపక్షంగానే సాగి ఆమెను సస్పెండ్ చేసేంతవరకూ దారితీసింది. అయితే ప్రభుత్వ చర్యలు కొరివితో తలగోక్కునట్లయింది. పెద్దఎత్తున దేశవ్యాప్తంగా నిరసనలు ఎగిసిపడ్డాయి. న్యాయవ్యవస్థ స్వతంత్రత, స్వయం ప్రతిపత్తిని పరిరక్షించుకోవాలంటూ పెద్దఎత్తున ఆందోళన సాగడంతో సుప్రీంకోర్టు సైతం జోక్యం చేసుకోక తప్పలేదు. ఫలితంగా ఆమెపై చేపట్టిన అభిశంసన చర్యలు వెనక్కుపోయాయి. ఆమె సస్పెన్షన్ కూడా కొద్దివారాల్లోనే రద్దయి కర్కి తిరిగిసుప్రీం కోర్టు చీఫ్‌జస్టిస్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత నెలరోజులకు అంటే 2017 జూన్‌లో ఆమె పదవీ విరమణ చేసారు. ఆమె వెలువరించిన కీలక తీర్పులు పాలకప్రతినిధులకు నిద్ర లేకుండాచేసాయి. ఆనాటి సమాచారమంత్రి జయప్రకాష్ ప్రసాద్ గుప్తాను ఒక అవినీతికేసులో శిక్ష విధించడం అప్పట్లో సంచలనం కలిగించింది. మడమతిప్పని వైఖరితో ఉన్న సుశీలకర్కి అయితే ప్రస్తుత అవినీతి ఊబిలో చిక్కుకున్న నేపాల్‌ను గాడిలో పెట్టగలరన్న నమ్మకం ఈ జెన్‌జెడ్‌లో బలంగా నాటుకుపోయింది. భారత్‌లోనే చదువుకున్న కర్కి బనారస్ హిందూ వర్సిటీలో ఉన్న సమయంలోనే సహచర విద్యార్థిగా ఉన్న దుర్గాప్రసాద్ సుబేదిని వివాహం చేసుకున్నారు. అయితే ఆనాటి రాజరిక వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటంలో విమానం హైజాక్ కేసులో ఆయన పాలుపంచుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. రెండేళ్ల భారత్‌లో జైలు జీవితం తర్వాత నేపాల్‌కు వెళ్లిపోయిన తర్వాత సుబేది ఇకపై వార్తల్లోకి రాలేదు. ఈకేసులోకూడా సుశీలాకు ఎలాంటి మరకలు అంటకపోవడం విశేషం. మొత్తంగా చూస్తే దశాబ్దాల తరబడిజరిగిన అవినీతి పాలనకు వ్యతిరేకంగా ఇప్పుడు ప్రజాస్వామ్యయుతంగా జరిగే అవినీతి రహిత పాలనవైపు హిమాలయ దేశం అడుగులు వేస్తోందని చెప్పవచ్చు. ఈక్రమంలో ప్రధానిగా సుశీల కర్కి పాలనతీరు, రాజీలేని ధోరణి, సంస్కరణలే ఇప్పుడు నేపాల్ భవిష్యత్తుకు దిక్సూచి అవుతాయని నిస్సందేహంగా చెప్పుకోగలం. ●

# అవినీతిరహిత పాలనకు అడుగులు!

**గన్ని మోహన్**



సుశీలా కర్కి

---

# అమెరికా ఆధిపత్యం అంతరించబోతోందా?



**సుంకవల్లి సత్తిరాజు**

వాణిజ్య పరమైన సుంకాలతో భారత్‌ను ఇబ్బంది పెడుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ప్రస్తుతం దిక్కుతోచని పరిస్థితుల్లో, స్వీయరక్షణలో పడి, డ్యామేజ్ కంట్రోల్ కోసం ప్రయత్నాలు చేస్తున్న సూచనలు కానవస్తున్నాయి. భారత్‌తో వాణిజ్య ఇబ్బందులు తొలగించుకుంటానని, మోడీ తన మిత్రుడంటూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ సరికొత్త రాగం ఆలపిస్తున్నారు. ఇదే సందర్భంలో భారత్‌పై నూరు శాతం వాణిజ్య సుంకాలు విధించాలని యూరోపియన్ దేశాలను రెచ్చగొట్టడం ట్రంప్ నిలకడ లేని మనస్తత్వానికి నిదర్శనం. ఇటీవల జరిగిన షాంఘై సహకార సదస్సు అగ్రరాజ్యమైన అమెరికాకు కంటిమీద కునుకు లేకుండా చేసిన మాట వాస్తవమని చెప్పడానికి డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న వ్యాఖ్యలే నిదర్శనం. ట్రంప్ ఆగ్రహానికి, అసహనానికి, అనుమానానికి, అభద్రతకు, భయానికి అమెరికన్ ఆల్ట్‌టెక్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ ట్రూత్‌సోషల్ ప్రత్యక్ష నిదర్శనంగా మారింది. భారత్‌నుఅనేక ఇబ్బందులు పెట్టి, అవమానించి, ట్రేడ్‌వార్ సాగించిన ట్రంప్ ఇప్పుడు భారత్‌పై సానుభూతి చూపించడం విడ్డూరం. భారత్, రష్యాలు చైనా చీకటి వ్యూహంలోకి నెట్టబడ్డాయన్న శ్వేత సౌధ విహారి ఆవేదనలో ఎన్నో అర్థాలు ఇమిడి ఉన్నాయి. భారత్, రష్యాలు అమెరికాకు దూరమయ్యాయంటూ ఒక వైపు ఆవేదన వ్యక్తంచేస్తూనే, మరో వైపు భారత్, రష్యాలపై అక్కసు వెళ్లగక్కడం ట్రంప్‌లోని పరస్పర వైరుధ్య భావాలను, మానసిక వత్తిళ్లను ప్రస్ఫుటం చేస్తున్నాయి. రష్యా, ఇండియాలు అమెరికాను విడిచి పెట్టడం బాధాకరమంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యల్లోని చిత్తశుద్ధిని శంకించవలసిందే. నియంతలతో కలవడం మోడీ చేసిన తప్పిదమంటూ, సిగ్గుచేటంటూ డోనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదం. ఉక్రెయిన్ రష్యా యుద్ధాన్ని ఆపుతానంటూ ఇటీవల అలాస్కాలో పుతిన్‌కు రాచమర్యాదలతో స్వాగతం చెప్పినప్పుడు, పుతిన్ తన స్నేహితుడంటూ వల్లె వేసినప్పుడు పుతిన్ నియంత అని ట్రంప్‌కు తెలియదా? అమెరికాకు అత్యంత ఆప్త దేశమైన ఖతార్ పై ఇజ్రాయిల్ వైమానిక దాడులతో విరుచుపడి, విధ్వంసానికి పాల్పడితే తనకు ఏమీ తెలియదన్నట్టుగా మాట్లాడడం ట్రంప్ విశ్వసనీయతను ప్రశ్నిస్తున్నది. ఎన్నికలు జరపకుండా, యుద్ధం పేరుతో ఎమర్జెన్సీ విధించి పాలన సాగిస్తున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఏ కోవకు చెందిన వాడో ట్రంప్ చెప్పగలరా? ఉగ్రవాదులను భారత్ పై ఉసిగొల్పుతూ, తాను తలచుకుంటే సగం ప్రపంచాన్ని అణ్వాయుధాలతో భస్మీపటలం చేస్తానన్న పాక్ ఆర్మీ ఛీఫ్ అసిమ్ మునీర్‌ను వైట్‌హౌస్‌కు ప్రత్యేక అతిధిగాఆహ్వానించి, అతనితో కలిసి విందారగించిన ట్రంప్ భారత్‌కు నీతివచనాలు చెప్పడంలో ఎలాంటి ఔచిత్యం కానరావడం లేదు. భారత్ విషయంలో ట్రంప్ ఏ విషయంలోను పరిణితి గల రాజకీయవేత్తగా ప్రవర్తించలేదు. పాక్ వేడుకుంటేనే కాల్పుల విరమణకు అంగీకరించామని భారత్ పదే పదే స్పష్టం చేస్తున్నా, ట్రంప్ మాత్రం తన బెదిరింపులతో, మధ్యవర్తిత్వంతో భారత్ పాక్‌తో కాల్పుల విరమణకు అంగీకరించిందని, అణుయుద్ధం జరగకుండా తానే ఆపగలిగానని భారత్‌ను తక్కువ చేసి మాట్లాడడం, భారత్‌ను వాణిజ్య సుంకాల పేరుచెప్పి బెదిరించి, దారికి తెచ్చానని ప్రగల్భాలు పలకడం అమెరికా అధ్యక్ష స్థానానికున్న విలువను, స్థాయిని ట్రంప్ తగ్గించినట్టుగానే భావించాలి. ఆరు యుద్ధాలను ఆపానంటూ తనకు నోబెల్ శాంతి బహుమతి కావాలంటూ, ట్రంప్ చేస్తున్న ప్రకటనలు విడ్డూరంగా ఉన్నాయి. గాల్వాన్ సంఘటన తర్వాత భారత్ చైనాల మధ్య సుదీర్ఘ కాలం ద్వైపాక్షిక సంబంధాలు సంక్షోభంలో పడ్డాయి. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌కు వీటోహక్కు లేకుండా చైనా ఎప్పటికప్పుడు అడ్డుపడుతూనే ఉంది. కాని ప్రస్తుత పరిస్థితులు మారాయి. చైనా, భారత్‌ల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటున్న పరిస్థితులపై డోనాల్డ్ ట్రంప్ నీళ్ళు చల్లి చల్లార్చడమే కాకుండా బద్ధ శతృవులను మిత్రులుగా మార్చిన వైనం ఆశ్చర్యం కలిగించింది. సరిహద్దు వివాదాన్ని



పక్కన బెట్టి, ఇరుదేశాల మధ్య సఖ్యత, స్నేహం పెంపొందించుకోవాలని మోడీ, షీ జిన్‌పింగ్‌లు భావించడం శతృవులు మిత్రులుగా మారుతున్న క్రమంలో జరుగుతున్న సకారాత్మక ప్రక్రియగా భావించవచ్చు. షాంఘై సదస్సులో మోడీ, పుతిన్, జిన్‌పింగ్‌ల స్నేహం చూసి ట్రంప్‌కు వెన్నులో వణుకు పుట్టింది. ట్రంప్ రెండవ సారి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుండే భారత్‌ను లక్ష్యంగా చేసుకుని భారత్ ఆర్థిక స్థిరత్వాన్ని, ఎదుగుతున్న భారత్ ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడానికి కుటిల ప్రయత్నాలు చేసిబలమైన భారత్‌ను దూరం చేసుకున్న మాటవాస్తవం. భారత్‌అమెరికా సంబంధాలు మెరుగుపడుతున్న దశలో, ట్రంప్‌కు మిత్రుడుగా మోడీ ప్రచారంలోకి వచ్చిన తరుణంలో అమెరికా అధ్యక్ష స్థానంలో కూర్చున్న ట్రంప్ ధోరణిలో మార్పు వచ్చింది. ట్రంప్ విజయానికి దోహదం చేసిన అమెరికాలోని ప్రవాస భారతీయులను సైతం ట్రంప్ ఆశ్చర్యానికి గురిచేసాడు. భారత్‌పై ప్రతీకార సుంకాలు విధిస్తూ, రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు విధించడమే కాకుండా భారత్ పట్ల అత్యంత అవమానకరంగా ప్రవర్తించాడు. అమెరికా కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టవద్దని, భారతీయులను అమెరికా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో నియమించుకోవద్దని చెబుతూనే, భారత్‌లో సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాక్‌ను నెత్తిన పెట్టుకోవడం వంటి దుశ్చర్యలకు ట్రంప్ పాల్పడ్డాడు. 50శాతం సుంకాలతో భారత్‌ను ఇబ్బంది పెట్టాలన్న ట్రంప్ ఆలోచన బెడిసికొట్టింది. ట్రంప్ ధోరణి పట్ల భారత్ విసిగి వేసారింది. షాంఘై సహకార సదస్సులో జిన్ పింగ్, పుతిన్ వంటి దిగ్గజాలతో మోడీ సుహృద్భావ వాతావరణంలో జరిపిన చర్చల పట్ల అమెరికా భీతిల్లింది. మారిన ప్రపంచ రాజకీయ పరిణామాల నేపథ్యంలో అమెరికా ఆధిపత్యానికి బ్రిక్స్ దేశాలు చరమగీతం పాడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. క్వాడ్ కూటమి ఎందుకు ఏర్పడినా, ఇదిచైనాకు వ్యతిరేకంగా ఏర్పడిన కూటమిగానే పేర్కొంటారు. ప్రస్తుతం అమెరికాతో భారత్‌కు తలెత్తిన విభేదాల దృష్ట్యా, చైనాతో భారత్ సంబంధాలు ఇటీవలి కాలంలో మెరుగైన దృష్ట్యా, ఇక క్వాడ్ కూటమి మనుగడ సాగిస్తుందా? చైనాకు వ్యతిరేకంగా పనిచేసే పరిస్థితి ప్రస్తుతం భారత్‌కు లేకపోవడంతో ఇక క్వాడ్ కూటమి నిరుపయోగంగా మారే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. మారిన వర్తమాన, రాజకీయ, వాణిజ్య, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో బ్రిక్స్ కూటమి బలపడే అవకాశాలు మెండుగా ఉన్నాయి. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడిన 'బ్రిక్' దక్షిణాఫ్రికా చేరికతో 'బ్రిక్స్'గా మారింది. ఆ తర్వాత యు.ఎ.ఇ, ఇండోనేషియా, ఇథియోపియా, ఇరాన్, ఈజిప్టు దేశాల చేరికతోబ్రిక్స్ కూటమి 'బ్రిక్స్‌ప్లస్'గా రూపాంతరం చెందింది. సభ్య దేశాల మధ్య విభిన్న రంగాల్లో పరస్పర సహకారానికి, అభివృద్ధికి ఏర్పడిన బ్రిక్స్ కూటమి ప్రధానఉద్దేశ్యం ప్రపంచాన్ని శాసిస్తున్న అమెరికా డాలర్‌కు కళ్లెం వేయడమే. డాలర్‌కు ప్రత్యామ్నాయంగా నూతన కరెన్సీని రూపొందించాలన్న లక్ష్యం సమీప భవిష్యత్తులో సాధ్యపడవచ్చు. ట్రంప్ సాగిస్తున్న ట్రేడ్‌వార్‌పట్ల ఆగ్రహంతో ఉన్న పలుదేశాలు బ్రిక్స్ కూటమిలో చేరడానికి సంసిద్ధంగా ఉన్నాయి. బ్రిక్స్‌పట్ల ట్రంప్ ఇప్పటికే పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. అమెరికా ప్రతీకార సుంకాలతో ఆగ్రహంగా ఉన్నవర్తమాన ప్రపంచవాణిజ్య పరిణామాల రీత్యా బ్రిక్స్ కూటమి బలోపేతం కావడం ఆవశ్యకమనే ధోరణి నెలకొంది. ఈ పరిణామాలు ట్రంప్‌కు మింగుడు పడడం లేదు. తలతో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయి. రష్యా, ఉత్తర కొరియాలు అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నాయంటూ పేర్కొనడం ట్రంప్‌లో ఏర్పడిన భయానికి అద్దం పడుతున్నాయి. ఒక అగ్రరాజ్యం ఇంతలా భయపడడం బహుశా ఇదే మొదటి సారేమో. భారత్‌తో కయ్యానికి కాలుదువ్వి, వాణిజ్య సుంకాలను పెంచిన ట్రంప్ అమెరికా వీసాల విషయంలో కూడా కఠిన నిబంధనలు విధిస్తున్నారు. ఇదే బాటలో ఆస్ట్రేలియా కూడా పయనిస్తున్నది. 27 దేశాలకు సభ్యత్వమున్న యూరోపియన్ యూనియన్ కూడా భారత్‌తో ట్రేడ్ డీల్ కుదుర్చుకోనుంది. అమెరికా మిత్రదేశాలు భారత్‌తో ద్వైపాక్షికవాణిజ్య సంబంధాలు కుదుర్చుకోవడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం ట్రంప్‌కు శరాఘాతం. భారత్ ను బెదిరించాలనుకుని భంగపడిన అమెరికా ప్రస్తుతం నిస్సహాయ స్థితిలో ఉంది. ●

Main tab page 111_Main tab page 111.qxd 9/13/2025 11:59 PM Page 1



## జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటా

- జిల్లా 39వ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ రాజాబాబు
- శుభాకాంక్షలు తెలిపిన జేసి, డిఆర్ఓ, పలువురు ఉద్యోగులు

**ఒంగోలు, ప్రభాతవార్త**



ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ప్రకాశం జిల్లా 39వ కలెక్టర్‌గా శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఎన్ఎస్పీ గెస్ట్ హౌస్‌కు వచ్చిన కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, డీఆర్వో బి.చిన్న ఓబులేష/, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఇతర రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రకాశం భవనముకు తీసుకొని రాగా వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ఆశీర్వచనాలు మధ్య





జిల్లా కలెక్టర్‌గా రాజాబాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దిశానిర్ధేశం మేరకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పొలిటికల్ గవర్నెన్స్ పై ప్రత్యేక దృష్టి పెడతానని చెప్పారు. పరిష్కారం కాని సమస్య అంటూ ఏదీ ఉండదని, ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తానని స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వెలుగొండ ప్రాజెక్టుతో పాటు ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై తాను దృష్టి సారిస్తానని కలెక్టర్ తెలిపారు. అనంతరం పలువురు జిల్లా స్థాయి అధికారులు, ఉద్యోగులు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.



## కమీషనర్‌ను కలిసిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ ప్రతినిధి బృందం సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు ఆధ్వర్యంలో ఒంగోలు నగర పాలక సంస్థ కమీషనర్ కే.వెంకటేశ్వరరావుని కలిసి మానవత సంస్థ సేవా కార్యక్రమాలు కమీషనర్‌కి వివరించడం జరిగింది. ఫ్రీజర్ బాక్సులు, శాంతి రథం ఉంచుకొనుటకు ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ పక్కన గల మహాప్రస్థానం నందు అవకాశం ఇప్పించాల్సిందిగా కోరారు. కమీషనర్ అనుమతిని మంజూరు చేశారు. అలాగే ఒంగోలులో గల మూడు స్మశానవాటికలను మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఒంగోలు శాఖ తరుపున అన్ని స్మశాలను శుభ్రం చేసి ఆధునికరించుటకు కమీషనర్ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, జిల్లా కమిటీ బాధ్యులు తమటం రామిరెడ్డి, అధ్యక్షులు శరభలింగాచారి, కోశాధికారి ఎం.భోజిరెడ్డి, జాయింట్ సెక్రటరీ మోటుపల్లి వెంకటేశ్వర్లు, డైరక్టర్లు వడ్డేంపూడి సుజాత, కోసూరి శ్రీదేవి, చెరుకూరి ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## చుండూరు రవిని కలిసిన వైవి గౌతమ్ అశోక్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నియోజకవర్గం సమన్వయకర్త చుండూరి రవి కుమార్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి, తన పేరును రాష్ట్ర పార్టీకి సూచించి, ఈ పదవి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా చుండూరి రవి గారు మాట్లాడుతూ ఒంగోలు నియోజకవర్గంలో అందర్నీ కలుపుకొని పార్టీని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు . ఒంగోలు నియోజకవర్గం లోని అన్ని పోలింగ్ బూతుల్లో కమిటీల మీద దృష్టి కేంద్రీకరించి పూర్తిస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలను సూచించారు. ఈ సందర్భంగా వై వి గౌతమ్ అశోక్ తో పాటు తన సోదరుడు అభిలాష్ యాదవ్, కంచర్ల సురేష్, ఎం యశ్వంత్, రఘురాం కాశి లతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే దామచర్లను కలిసిన కమ్మకార్పొరేషన్ చైర్మన్

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ కమ్మ కార్పొయేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసన సభ్యులు దామాచర్ల జనార్ధన్ రావుని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భవిష్యత్ లో కార్పొరేషన్ ద్వారా చేయబోయే కార్యక్రమాల గురించి చర్చించారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాటూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## 33 మంది లబ్ధిదారులకు సిఎం రిలీఫ్‌ఫండ్ పంపిణీ

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని పార్టీ కార్యాలయం నందు 33 మంది లబ్ధిదారులకు 27 లక్షల 38వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ రావు పాల్గొని పంపిణీచేశారు.

## జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్

**ఒంగోలు, ప్రభాతవార్త**



జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల ప్రకారం శనివారం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాలలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరిగిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.భారతి అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో సుమారు 167 సివిల్ వ్యాజ్యాలు దాదాపుగా 6558 క్రిమినల్ వ్యాజ్యాలు, ప్రీ లిటిగేషన్ స్థాయిలో 4 కేసులు పరిష్కరించడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా కక్షదారులకు మోటార్ వాహన ప్రమాద బీమా కేసుల్లోనూ, కొన్ని రకాలైన ఇతర కేసుల్లో దాదాపుగా రెండు కోట్ల రూపాయలు పరిష్కారం రూపంలో చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. కేసుల పరిష్కారం కోసం ప్రకాశం జిల్లా వ్యాప్తంగా 25 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ బెంచీలలో న్యాయమూర్తులు, న్యాయవాదులు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కారం కోసం సహకరించిన న్యాయవాదులకు పోలీస్ వారికి వివిధ ప్రభుత్వ శాఖల ప్రతినిధులకు, బ్యాంకు అధికారులకు, ఇన్సూరెన్స్ అధికారులకు న్యాయ సేవాధికార సంస్థ తరఫున అభినందనలు తెలియజేశారు.

ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## ప్రకాశం ఎస్పీగా హర్షవర్ధన్

- ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ విజయనగరం జిల్లాకు బదిలీ

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా ఎస్పీగా ఇప్పటి వరకు బాధ్యతలు నిర్వహిస్తున్న దామోదర్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులను జారీ చేసింది. దామోదర్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రకాశం జిల్లాకు ఎస్పీ హర్షవర్ధన్‌ను నియమించింది. అతి త్వరలో ఎస్పీ హర్షవర్ధన్ ప్రకాశం జిల్లాకు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్నారు.



# ఐసీడీఎస్‌లో ఇష్టారాజ్యం

- పోషకాహార పంపిణీలో చేతివాటం

**ఒంగోలు, ప్రభాతవార్త**

గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పౌష్టికాహారంలోనూ అక్రమార్కులు దోచుకుని తింటున్నారు. నాశిరకం సరుకులు సరఫరా చేస్తున్నా యంత్రాంగం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహారిస్తోంది. ఇదే అదునుగా గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహారిస్తున్నారు. గుడ్డు కనీస సైజు 50 గ్రాములకు పైగా ఉండాలి. 20 నుంచి 30 గ్రాములు బరువు కలిగిన గుడ్లను సరఫరా చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పాలు సరఫరా అదనపు పౌష్టికాహారంగా ఇచ్చే కిట్లలో చేతివాటం చూపిస్తున్నారు. రాగిపిండి, అటుకులు, చిక్కి, బెల్లం, ఇలా ప్రతిదానిలో కల్తీ ఉన్నట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు ఫిర్యాదు చేసినా స్పందించే నాధుడే కరువయ్యాడు. బియ్యం, కందిపప్పు, వంటనూనె సరఫరా పూర్తి స్థాయిలో కేంద్రాలకు చేరడం లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు 13 ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలు 2903 ఉన్నాయి. ఆరు సంవత్సరాల లోపు పిల్లలు 1,20,340 మంది ఉన్నాయి. గర్భిణీ, బాలింతలకు నెలకు 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, బియ్యం, కందిపప్పు, నూనె అదనపు ఆహారం కింద కిలో అటుకులు, రాగిపిండి, రెండు కిలోల కర్జూరం, బెల్లం 250 గ్రాములు ఇవ్వాలి. మూడేళ్లలోపు పిల్లలకు 2.5 కిలోల బాలామృతం, 30 కోడిగుడ్లు, 2.5 లీటర్ల పాలు, 3-6 లోపు పిల్లలకు 2.5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు, మధ్యాహ్న భోజనం కేంద్రంలోనే ఇవ్వాలి. ఈ మెనూ సక్రమంగా అమలు కావడం లేదు. కోడిగుడ్లను ప్రతి నెల 1,10,15, 25 తేదీల్లో నాలుగు విడతల్లో కేంద్రాలకు సరఫరా చేయాలి. పాలు, కిట్లు నెల మొదటి వారంలోనే ఇవ్వాలి. చాలా చోట్ల అమలు కావడం లేదు. వాటిపై ఒంగోలు అర్బన్‌తో పాటు జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ప్రతి నెల సీడీపీఓలు కనీసం 20 రోజులు సూపర్‌వైజర్లు



ప్రతి రోజు రెండు కేంద్రాలను తనిఖీ చేయాలి. చాలా మంది సీడీపీఓలు అసలు ప్రాజెక్టులకే వెళ్లడం లేదు. కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలే కోడిగుడ్లను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ ఎవరికి కోడిగుడ్లు ఇవ్వడం లేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. సరఫరాలో అక్రమాలకు వడిగట్టినా బిల్లుల్లో కోతపెట్టడం లేదు. గుత్తేదారులు, అధికారులు గుమ్మక్కై పేదల కడుపు కొడుతున్నారు. చిన్నారులపైనే భావితరం ఆధారపడి ఉంది. వయసుకు తగ్గ బరువు, ఎత్తు పిల్లల ఎదుగుదలకు ప్రామాణికం. అది ఉన్నప్పుడే భవిష్యత్తులో శారీరకంగా, మానసికంగా దృడంగా ఉంటారు. ఎలాంటి వ్యాధులు ధరిచేరవు. అలాంటిది బాల్యం బక్కచిక్కిపోతుందని, ఇందుకు భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వైద్య రంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిన్నారుల పోషకాహార లోపం, రక్తహీనత భారిన పడకుండా ఉండేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. పోషకాహారానికి కోట్లు ఖర్చు చేస్తున్నాయి. అయినప్పటికి చిన్నారులు పోషకాహార లోపంతో బాధపడుతున్న సర్వేలలో వెల్లడవుతుంది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు పిల్లల ఎదుగుదలను పరిశీలించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇటీవల ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 సంవత్సరాలు వయసు గల పిల్లలు ఎంత మేర బరువు ఉన్నారు. ఎంత ఎత్తు ఉన్నారన్న వివరాలను అంగన్‌వాడీ కార్యకర్తలు సేకరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిన్నారులకు, బాలింతలకు చేరాల్సిన పౌష్టికాహారాలు నల్లబజారుకు తరలింపకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజానీకం కోరుతున్నారు.

## ఘనంగా శిద్దా లక్ష్మీ పద్మావతి జన్మదిన వేడుకలు

సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులు

**చీమకుర్తి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**



రాష్ట్ర మాజీమంత్రి శిద్దా రాఘవరావు సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి జన్మదిన వేడుకలు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో శనివారం ఘనంగా జరిగాయి. గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ.గిరి బాబు,కాట్రగడ్డ రమణయ్యల ఆద్వర్యంలో లక్ష్మీపద్మావతి జన్మదిన వేడుకలలో శిద్దా రాఘవరావు అభిమానులు, శ్రేయోభిలాషులు, జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు,ఆర్యవైశ్య మహిళా విభాగ్,ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి సేవాదళ్ నాయకులు, గ్రానైట్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అభిమానులు ఏర్పాటు చేసిన భారీ



కేకును శిద్దా రాఘవరావు దంపతులు కట్ చేశారు. అనంతరం భారీ గజ మాల తో సత్కరించారు.ఆలయ ఇంచార్జ్ ఎమ్.వెంకటేశ్వర్లు, అర్చకులు శిద్దా రాఘవరావు, లక్ష్మీ పద్మావతి దంపతులను గజమాలతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జ్యోతి గ్రానైట్ ఆధ్వర్యంలో లక్ష్మీ పద్మావతి పుట్టినరోజు రోజు వేడుకలు. మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు సతీమణి శిద్దా లక్ష్మీ పద్మావతి పుట్టినరోజు వేడుకలు శ్రీ హరిహర క్షేత్రంలో వైభవంగా నిర్వహించారు.జ్యోతి గ్రానైట్ సి ఓ.ఓ ఎమ్.శివ రామ్ ఆధ్వర్యంలో జ్యోతి గ్రానైట్ సిబ్బంది ఏర్పాటు చేసిన భారీ కేకు ను శిద్దా దంపతులు కట్ చేసారు. అనంతరం జ్యోతి గ్రానైట్ భారీ గజమాల తో శిద్దా దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాల అభిమానులు నిర్వహించారు. బండ్లమూడి ప్రభుత్వ పాఠశా ల చెందిన 200 మంది విద్యార్థులకు నోట్ బుక్స్,చీమకుర్తి మండల పాత్రికేయ మిత్రులకు హాట్ వాటర్ కేటిల్స్, మహిళలకు పసుపు కుంకుమ,సారెను శిద్దా రాఘవరావు దంపతులు అందచేశారు. ఆలయ అర్చకులు,శ్రీశైలం దేవస్థానం వేద పండితులు,శ్రీ హరిహర క్షేత్రం అర్చకులు సుబ్రమణ్యం శర్మ,హరి కుమారా చార్యులు, హరికృష్ణ శర్మ, కృష్ణ శర్మ శిద్దా రాఘవరావు దంపతులకు వేద ఆశీర్వాదాలు అందచేసారు. ఈ వేడుకలలో శిద్దా రాఘవరావు గారి కుటుంబ సభ్యులు,రావిపూడి లక్ష్మీనారాయణ దంపతులు, గుమ్మడి సాయి బాబా, ఆర్యవైశ్య సంఘం నాయకులు, దర్శి, చిమకుర్తి పట్టణానికి చెందిన ప్రముఖులు,శ్రేయోభిలాషులు ఆర్యవైశ్య జిల్లా నాయకులు, చీమకుర్తి, దర్శి,ఒంగోలు కు చెందిన ఆర్యవైశ్య మహిళా విభాగం, ఆర్యవైశ్య యువజన నాయకులు,వాసవి సేవాదళ్‌నాయకులు,చీమకుర్తికి చెందిన మిత్రులు,శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిద్దా లక్ష్మీ పద్మావతికి శుభాకాంక్షలు తెలిపారు.

## జగనన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటా..

- అద్దంకి సమన్వయకర్తగా నియమించడం పట్ల జగన్‌కు అశోక్‌కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు

**అద్దంకి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త**




వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరిన అనతి కాలంలోనే తనపై నమ్మకంతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అద్దంకి వైసిపి సమన్వయకర్తగా నియమించడం పట్ల డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ జగనన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. శనివారం ఆయన కార్యాలయం నుండి విడదల చేసిన ప్రకటనలో తనపై ఇంతటి పెద్ద బాధ్యత వుంచడం, నాపట్ల పార్టీ చూపిన విశ్వాసం, ఎంతో గర్వకారణంగా వుందని అన్నారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, నాధర్మం, నాకర్తవ్యం, ఈ బాధ్యత నాపై పెట్టడం, ద్వారా జగనన్న నాపై చేపిన నమ్మకానాన్ని ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటానని, పార్టీ కోసం, ప్రజల కోసం, జగనన్న కలల సాధనం కోసం, నాశక్తి కొలది కృషిచేస్తానని, డాక్టర్ అశోక్‌కుమార్ పేర్కొ న్నారు. ఈ ప్రయాణంలో మా కుటుంబం, నా ప్రతి అడుగులోను ధైర్యం ఇచ్చి ఇప్పటి వరకు అండగా, నిలిచిందని ఆయన వివరించారు. రాజకీయంగా నాకు ఇంత గుర్తింపు రావడంలో గురజాల నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోబిలాషులు, అండగా నిలిచారని, వారి నమ్మకం, ప్రోత్సహం, మద్దతు లేకుండా, తనకు ఈ గౌరవం సాధ్యమయ్యేది కాదని, డాక్టర్ ఆశోక్ కుమార్ అన్నారు. ప్రత్యేకంగా నా గ్రామం, జానపాడు ప్రజలకు నాకృతజ్ఞతలు, నాకు మీరిచ్చిన మద్దతు, మీరు చూపిన ప్రేమ, నాకు అతిపెద్ద బలమని, మీ ఆదరాభిమానాలు, ఎప్పటికీ నాగుండెల్లో చిరస్థాయిగా నిలిచివుంటాయని, తాను ఎక్కడికి వెళ్ళిన నా ఊరు జానపాడు పేరు ఎక్కడ వినిపించిన, నాహృదయం గర్వంతో నిండిపోతుందని అన్నారు. నాశ్రేయోభిలాషులకు పార్టీలో మార్గ నిర్ధేశం చేసిన పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు అంటూ ఈ ప్రయాణంలో మీ విలువైన సలహాలు, ప్రోత్సహం, ఆశీస్సులు, దిక్సూచిలని అన్నారు. అద్దంకి ప్రజల హృదయాలలో నేను ఒక నాయకుడులా కాకుండా వారి కుటుంబాలలో ఒక సభ్యు డుగా వుండాలని, మనమంతా ఒకటై అద్దంకి విజయాన్ని జగనన్నకు ఒక బహుమతిగా అందిద్దామని డాక్టర్ అశోక్‌కుమార్ చింతలపూడి పేర్కొన్నారు.

# మంత్రి హోదా మసకబారుతుందా..?

- సొంత నియోజకవర్గానికే పరిమితం
- రాష్ట్రానికి మంత్రి అయినా జిల్లాకు ఎమ్మెల్యేనే
- వైసీపీ బాటలో కూటమి పాలన

**ఒంగోలు, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వ పాలనలో మంత్రి కీలక పాత్ర పోషిస్తున్నారు. క్యాబినెట్ సమావేశాలు నిర్వహిస్తున్నా అందులో మంత్రుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. ఒకప్పుడు మంత్రికి ఎనలేని గౌరవం, మర్యాద ఉండేది. జిల్లా అంతటా తన ప్రభల్యంతో పాటు అంతా తిరుగుతూ సొంత పార్టీని ప్రభుత్వానికి కేంద్ర బిందువుగా మెలిగే వారు. ఇటీవల కాలంలో ఈ పరిస్థితి కనిపించడం లేదు. రోజు రోజుకు మంత్రి హోదా దిగజారిపోతుందనే విమర్శలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రులు తమ సొంత నియోజకవర్గానికే పరిమితం అయ్యేవారు. ప్రభుత్వ విధానాలు రోజు రోజుకు మారిపోతున్నాయి. ఒకప్పుడు మంత్రులకు ఎంతో ప్రాధాన్యత ఉండేది. రొడ్డా నారపరెడ్డి, కే.రోశయ్య, కందుల ఓబుల రెడ్డి, పిడతల రంగారెడ్డి, గొట్టిపాటి హనుమంతరావు, బాలినేని శ్రీనివాసరెడ్డి మంత్రులుగా ఉన్న సమయంలో కాంగ్రెస్, టీడీపీ నాయకత్వంలో ఒక వెలుగు వెలిగారు. రాష్ట్రంలో మంత్రిగా ప్రత్యేక గుర్తింపుతో పాటు జిల్లా వ్యాప్తంగా మంత్రికి ఎనలేని గౌరవం ఉండేది. నిత్యం జిల్లా పర్యటన చేస్తూ అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో మంత్రి కీలకంగా వ్యవహారించే వారు. ప్రజలు జిల్లా వ్యాప్తంగా మంత్రి ఇంటిలో, ఆఫీసులకు క్యూ కట్టే పరిస్థితి ఉండేది. మంత్రి వస్తున్నారంటే పది, ఇరవై కార్ల కాన్వాయ్ కలియతిరిగేవి. మంత్రిని జిల్లా ప్రజలు తమ వ్యక్తిగా భావించే వారు. ఇప్పుడు ఆ పరిస్థితులు దాదాపుగా కనిపించడం లేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రుల ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోయిందని చెప్పాలి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి వర్గంలో జిల్లాకు చెందిన ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. బాలినేని శ్రీనివాసరెడ్డికి ఆదిమూలపు సురేష్‌కి మంత్రి పదవి దక్కింది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి రెండున్నర సంవత్సరాలమాత్రమే పదవిలో ఉంచారు. తరువాత రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేర్పుల కారణంగా అతణ్ణి తొలగించారు. బాలినేని మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆదిమూలపు సురేష్ ఐదు సంవత్సరాలు మంత్రిగా పని చేసినా అతణ్ణి నియోజకవర్గానికే పరిమితం అయ్యారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎవరి నియోజకవర్గానికి వారే సర్వం అనే సంకేతాలు పంపారు. నియోజకవర్గాన్ని



ఎమ్మెల్యేలంతా చూసుకున్నారు. జిల్లా స్థాయిలో సమన్వయం లేదు. మంత్రులు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశం కల్పించలేదు. తమ నియోజకవర్గానికి మాత్రమే మంత్రులుగా పని చేశారు. జిల్లా అభివృద్ధికి ఇది తీవ్ర ఆటంకంగా మారింది. ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారైంది. మంత్రులు తమ నియోజకవర్గంలో తప్ప ఎక్కడా ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. బాలినేని శ్రీనివాసరెడ్డి మాత్రం జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు నిధులు కేటాయించారు. జిల్లా మంత్రులకు ప్రాధాన్యత పూర్తిగా తగ్గిపోతుంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విధానాలనే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సమర్ధవతంగా అమలు చేస్తుంది. ప్రస్తుతం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా డాక్టర్ బాల వీరాంజనేయస్వామి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్‌లు కొనసాగుతున్నారు. అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఏం జరిగిందో ఇప్పుడు అదే పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఇద్దరు మంత్రులు తమ నియోజకవర్గం వదిలి వెళ్ళడం లేదు. ఎప్పుడైనా ఇతర నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, శంకుస్థాపనలు ఉంటే వారు పిలిస్తే వెళ్లి వస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇద్దరు మంత్రులు అయిన వారు అప్పుడప్పుడు జడ్పీ సమావేశాలకు, పీఆర్సీ సమావేశాలకు హాజరవుతున్నారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేలే సుప్రీం అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించినట్లు తెలిసింది. పక్క నియోజకవర్గంలో ఎలాంటి జోక్యం చేసుకోవద్దని చెప్పడంతో తమ నియోజకవర్గానికి మాత్రమే పరిమితం అయ్యారు. జిల్లాలోనూ అదే స్థాయిలో పర్యటనలు సాగించే అవకాశాలు మాత్రం తగ్గడంలేదు. ఇది కేవలం మంత్రుల హోదాకు సంబంధించిన విషయం కాదు. ఎమ్మెల్యేల మధ్య సమన్వయం, అభివృద్ధి విషయంలోనూ మంత్రుల నియోజకవర్గానికి పరిమితం కావడం అభివృద్ధికి ఆటంకంగా భావిస్తున్నారు.

## నిరుపేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి ఓ వరం



**సింగరాయకొండ, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

నిరుపేదల ఆరోగ్య రక్షణకు సీఎం సహాయనిధి ఓ వరం లాంటిదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శనివారం టంగుటూరు నాయుడుపాలెం తన నివాసంలో ఆయన చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని కనుమల్ల గ్రామానికి చెందిన మలినేని పున్నయ్య కుమార్తె తనయ వైద్య అవసరాల కోసం రూ.32 వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కును మంత్రి స్వయంగా అందజేశారు. పేదల ఆరోగ్య రక్షణ కోసం కూటమి ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందని స్వామి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిపిఎసిఎస్ చైర్మన్, ఏఎంసీ డైరెక్టర్ భైరవునేని మోహన్ రావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 13 ఎక్సైజ్ కేసులు పరిష్కారం



**సింగరాయకొండ, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్లో సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని ఎక్సైజ్ స్టేషన్లో కేసులు నమోదై పెండింగ్ లో ఉన్న 13 కేసులను విజయవంతంగా పరిష్కరించినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శివకుమారి తెలిపారు. వీటికి జరిమానాగా మొత్తంగా 41,130 రూపాయలు ను ప్రభుత్వ ఖజానాకు చలానా ద్వారా జమ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ నమోదైన 6 డీజిల్ కేసులు, 7 కన్సంప్షన్ కేసులను ఈ లోక్ అదాలత్లో ప్రవేశపెట్టి జడ్జి సమక్షంలో పరిష్కరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాలవికాస్ కేంద్రాలతోనే విలువలతో కూడిన విద్య



**సింగరాయకొండ, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దేవాలయాల కేంద్రంగా నడుస్తున్న బాలవికాస్ కేంద్రాల్లో చిన్నారులకు ఆటలు, పాటలు, కళలు, జ్ఞానం, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు సింహపురి జోన్ ధర్మప్రచారకులు ఊరిమిండి వెంగలరెడ్డి తెలిపారు. సింగరాయకొండ అయ్యప్ప స్వామి దేవస్థానంలో శనివారం జిల్లా (ఒంగోలు కేంద్రం) బాలవికాస్ కేంద్రాల మతాజీలు, అర్చకస్వాముల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు చిన్నతనం నుంచే సంస్కృతి, సంప్రదాయాలు, పూర్వీకుల చరిత్రపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ప్రకాశం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో 25 దేవాలయాలు నిర్మించామని, అర్చక శిక్షణ పొందిన వారు సేవలందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ధర్మప్రచారక గొల్లపోతు వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ ఆరిబోయిన రాంబాబు, సహ కన్వీనర్ బిలకపాటి సుధాకర్, మండల కన్వీనర్ చిమట సుధాకర్ పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ను కలిసి బొకేను అందజేస్తున్న
## ఆంధ్ర కేసరి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షప్రీతమ్



**ఒంగోలు - (ప్రభాతవార్త**

స్థానిక ఆంధ్ర కేసరి యూనివర్సిటీలో ఎన్.ఎస్. ఎస్. కో ఆర్డినేటర్గా పని చేస్తున్న డాక్టర్ మండే. హర్ష ప్రీతందేవ్ కుమార్ నూతన కలెక్టర్ పి.రాజాబాబు ని కలెక్టర్ ఛాంబర్లో గౌరవ పూర్వకంగా కలుసుకుని ప్రత్యేకంగా బొకేని అందజేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారిద్దరూ కాసేపు ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో చదివిన కాలం నాటి రోజుల్లో చిర స్మృతులను గుర్తుకు తెచ్చుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం పూర్తి అయిన అనంతరం డాక్టర్ మండే. హర్ష ప్రీతం దేవ్ కుమార్ మాట్లాడుతూ సోదరుడు రాజా బాబు చిన్నతనం నుంచి మంచి వ్యక్తిత్వం, సాధించాలనే పట్టుదల, ప్రజలకు ఏదైనా సేవ చేయాలనే ఆలోచన కలిగిన మంచి మనసున్న వ్యక్తిత్వం కలిగినవారిని ఆయన పేర్కొన్నారు. సామాజిక స్పృహ, పేద ప్రజలకు సేవ చేయాలనే తపన కలిగిన వ్యక్తిగా రాజాబాబు వెనుక బడిన ప్రాంతమైన ప్రకాశం జిల్లాకు కలెక్టర్గా రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పలువురు ఉమ్మడి కుటుంబ నేతలు కూడా జిల్లా కలెక్టర్ రాజాబాబును మర్యాద పూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు.

## వైసీపీ శ్రేణుల్లో అయోమయం.. గందరగోళం

**బల్లికురవ, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గంలో యువజన శ్రామిక రైతు పార్టీలో ఏడాది నిండిందో లేదో నియోజకవర్గ ఇన్ఛార్జ్ మార్పు అనివార్యమైంది. ఇప్పటి వరకు నియోజకవర్గ ఇన్ఛార్జ్గా కొనసాగిన పల్నాడు జిల్లాకు చెందిన చిన్న హనిమిరెడ్డి 2024 ఎన్నికల వేళ కార్యకర్తలకు అన్ని తానై అండగా ఉంటానంటూ హామీలు ఇచ్చి, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే పత్తా లేకుండా పోయారు. కనీసం కార్యకర్తలకు సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి ఆ పార్టీ శ్రేణులది. గ్రామీణ స్థాయిలో పటిష్టమైన ఓటు బ్యాంకు కలిగిన యువజన శ్రామిక రైతు పార్టీకి ఇన్ఛార్జ్ ఎంపిక విషయంలో ప్రతి సారి గ్రహణం పడుతున్న కారణంగా కార్యకర్తలు అయోమయం పడుతున్నారు. మరలా ఇప్పుడు పల్నాడు జిల్లాకి చెందిన చింతలపూడి అశోక్ కుమార్ను అద్దంకి నియోజకవర్గ నూతన ఇన్ఛార్జ్గా పార్టీ అధిష్టానం ప్రకటించింది. ఎన్నికలు ముగిసిన నాటి నుండి ఇప్పటి వరకు కార్యకర్తలను ఆదరించిన దాఖలా, మరింత పెరిగింది తప్ప ఒరిగిందేమీ లేదు. పార్టీ అధినాయకత్వం తల తిక్క నిర్ణయాలతో అధికార పార్టీకి అమితమైన మేలు చేకూరుస్తున్నారంటూ పార్టీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వార్డులకు నిలబడేనందుకు అభ్యర్థులు సైతం దొరకరంటే అతిశయోక్తి కాదు. మరో వైపు అధికార పార్టీకి కుడిభుజం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పార్టీలతో ప్రమేయం లేకుండా అందరికీ అన్నహస్తం అందిస్తూ అందరివాడిగా ప్రజల మదిలో రోజు రోజుకు స్థిరమైన స్థానాన్ని పొందుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే సార్వత్రిక ఎన్నికల నాటికి గ్రామాలలో పార్టీ జెండా మోసేవారు కూడా కరువయ్యే పరిస్థితి ఏర్పడబోతున్నది. అద్దంకి నియోజకవర్గంపై అదనపు బాధ్యతలు తీసుకున్న పెద్దలు నియోజకవర్గంలో నెలకొన్నటువంటి పరిస్థితులు పట్ల అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారంటూ పార్టీ శ్రేణులు తిరుగుబాటు బావుటా ఎగరవేయనున్నారు. షరా మామూలుగా అందరికి అండగా ఉంటా, ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కొంటా అనే నాయకులు వస్తుంటారు పోతుంటారు. 2029 ఎన్నికల్లోనూ రాష్ట్ర విద్యుత్శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అఖండ మెజారిటీతో డబుల్ హ్యాట్రిక్ సొంతం చేసుకుంటారు అంటూ వైసీపీ శ్రేణుల్లో బాహాటంగా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నాయి.

## కేఎస్ఎస్ సభ్యులే పార్టీకి మూలస్తంభాలు - ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర



**వెలిగండ్ల, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి గ్రామాల్లో ఉంటున్న కేఎస్ఎస్ సభ్యులు క్షేత్ర స్థాయి నుండి పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ పార్టీకి ఎల్లప్పుడూ మూల స్తంభాలుగా ఉండడం ఉన్నారని స్థానికశాసనసభ్యులు డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో మండల పార్టీ అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కేఎస్ఎస్ సభ్యుల ఆత్మీయ సమావేశంలో స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ ను సమర్థవంతంగా అమలుపరిచి రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి మేలు కలిగేలా చేశారని అన్నారు. రాష్ట్ర ప్రజలకు మేలు కలగడాన్ని జీర్ణించుకోలేకపోతున్న వైసీపీ శ్రేణులు పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. వైసీపీ చేస్తున్న అసత్య ఆరోపణలను కేఎస్ఎస్ సభ్యులు సమర్థవంతంగా క్షేత్ర స్థాయిలో తిప్పి కొట్టాలని అన్నారు. అనంతరం నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభ దశలో ఉన్న గన్నవరం బ్రిడ్జిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్యామల కాశిరెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శి దొడ్డ వెంకట సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గడదర్ల హరి, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మువ్వరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు ముక్కు పెద్దిరెడ్డి, వెలిగండ్ల ఎంపీటీసీ బిలకల వెంకటేశ్వర్లు, ఏరువా వెంకటరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు కేఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## భైరవకోనలో విద్యార్థుల సందడి



**సీఎస్పురం, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

ప్రముఖ పర్యాటక క్షేత్రం భైరవకోనలో శనివారం విద్యార్థుల సందడి నెలకొంది. కడప జిల్లా బద్వేలుకు చెందిన భాష్యం హైస్కూల్ విద్యార్థులు శనివారం భైరవకోనను వీక్షించారు. అక్కడి జలపాతం వద్ద కేరింతలు కొడుతూ స్నానాలు చేసి, ఆలయాల వద్ద పూజలు చేసి ఆటపాటలతో సందడి చేశారు. అలాగే టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంగయ్య,రామకృష్ణంరాజు,రావా చంద్రశేఖర్, కామనబోయిన వెంకటస్వామి తదితరులు భైరవకోనలో పూజలు చేశారు. ఆలయ చైర్మన్ ముప్పాళ్ళ శ్యాంసుందర రాజు,ఈవో వంకిశ్వర్లరెడ్డిల పర్యవేక్షణలో ఆలయ పూజారులు ఆలయంలో పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

## శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ పాలకమండలి సమావేశం

### - ఆలయంలో అన్నదాన పథకం నిర్వహణకు తీర్మానం
### - నక్షత్ర వనంలో మొక్కలు నాటాలని నిర్ణయం
### - నీటి వసతి ఏర్పాటుకు తీర్మానం



**అద్దంకి, సెప్టెంబరు 13, (ప్రభాతవార్త**

సింగరకొండలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పాలకమండలి సాధరణ సమావేశం చైర్మన్ గుంజి శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం ఉదయం 10గంటలకు జరిగింది. ఈ సమావేశంలో ఆలయంలో అన్నదాన పథకాన్ని ప్రారంభించాలనే అంశపై చర్చించి, అధికారుల అనుమతి తీసుకోవాలని తీర్మానించారు. నక్షత్రవనంలో మొక్కలు నాటాలని, ట్రీ గార్డ్లు వంటి సౌకర్యం, అందుకు అవసరమైన నీటి వసతిని డ్రిప్ ద్వారా సమకూర్చేందుకు, కూడ చర్యలకై తీర్మానించారు. అదేవిధంగా భక్తులకు త్రాగునీటి సౌకర్యం వాటర్ప్లాట్ ఏర్పాటుపై కూడ తీర్మానం చేశారు. శంకుస్థాపన నిర్వహించి, నిర్మాణ దశలో ఆగిన వసతి గృహం విషయం కూడ సమావేశంలో చర్చించారు. అన్నదాన భవనం నిర్మాణం కూడ అసంపూర్తిగా వుండటంపై సమావేశంలో చర్చించి,దాతల వద్ద నుండి స్పష్టమైన లిఖితపూర్వకంగా ఏప్పటికి పూర్తిచేస్తారో హామి తీసుకోవాలని కూడ సమావేశం అధికారు సూచించింది. ప్రధానంగా రాబోవు దసరా పండుగ సందర్భంగా నవరాత్రులు నిర్వహణ కొరకు చేయవలసిన ఏర్పాట్లపై కూడ చర్చించారు. ఆలయ అవరణలో గ్రానైట్ ఫ్లోరింగ్ చేసిన దాతలకు మహామండపం నందు, గ్రానైట్ రాయి ఇచ్చిన దాతలకు కూడ సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది. ఈ సమావేశంలో ఆలయ ఇఒ మద్దినేని శ్రీనివాసరావు, పాలకమండలి డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వైవిని కలిసిన డాక్టర్ ఆశోక్కుమార్



**అద్దంకి , సెప్టెంబరు 13 (ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి నియమితులైన డాక్టర్ చింతలపూడి ఆశోక్కుమార్ శనివారం తాడేపల్లిలో ఉమ్మడి గుంటూరు జిల్లా సమన్వయకర్త వైవి సుబ్బారెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, బోకే అందజేసి,కృతజ్ఞతలు తెలిపారు. తనను అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయ కర్తగా నియమించిన నేపద్యంలో వైవిని ఆశోక్కుమార్ కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వైసిపి సమన్వయ కర్తను కలిసిన అద్దంకి నేతలు





**అద్దంకి , సెప్టెంబరు 13,(ప్రభాతవార్త**

అద్దంకి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్తగా పిడుగురాళ్ళ మండలం,జానపాడు గ్రామానికి చెందిన డాక్టర్ చింతలపూడి ఆశోక్కుమార్ను శుక్రవారం నియమించిన విషయం పాఠకులకు విధితమే. ఈ నేపద్యంలో డాక్టర్ ఆశోక్కుమార్ను శనివారం నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు, పిడుగురాళ్ళలోని ఆయననివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. అద్దంకి పట్టణానికి చెందిన మాజీ వార్డుసభ్యులు మోటుపల్లి శివరామకృష్ణ ప్రసాద్, ఉడత్తుసురేష్, బన్ను,సుధాకర్రెడ్డి, ప్రవీణ్, అవిశన ప్రభాకరరెడ్డితో పాటు సంతమాగులూరు, బల్లికురవ,కొరిశపాడు, అద్దంకి టౌన్కు చెందిన పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆశోక్కుమార్ను కలిసి దుశ్శాలువాలతో సత్కరించి, పూలమాలలు,బోకేలతో, అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బాపట్ల జిల్లా వైస్సార్సీపీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా
## నియమితులైన అట్లూరి వెంకయ్యకు సన్మాన కార్యక్రమం




**మార్టూరు, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్రెడ్డి ఆదేశాల మేరకు, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త గాదె మధుసూదన్రెడ్డి సూచనల మేరకు బాపట్ల జిల్లా ఎస్సీ విభాగ కమిటీ కార్యదర్శిగా నియమితులైన అట్లూరి వెంకయ్యను సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ ఉప్పలపాటి అనిల్ చౌదరి, మార్టూరు మండల కన్వీనర్ జంపాని వీరయ్య చౌదరి, మార్టూరు టౌన్ అధ్యక్షులు అడకా గంగయ్య, పర్చూరు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు చిన్నా నాయక్, మార్టూరు టౌన్ ప్రధాన కార్యదర్శి అట్లూరి కృష్ణారావు, వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు మైలా చిన్న నాగేశ్వరరావు, తమ్మలూరి సురేష్, దుడ్డు ప్రసన్న, పాలేటి లింగారావు, కలామ్,ఉలాస గాంధీ, పోవూరి చందు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

## సిబ్బంది లేక సమస్యలతో రెవెన్యూ కార్యాలయం

### - డిప్యూటేషన్లు, ప్రమోషన్లతో ఖాళీ అయిన రెవెన్యూశాఖ కార్యాలయం





**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం ముఖ్యంగా సిబ్బంది డిప్యూటేషన్లు, ప్రమోషన్లతో ఉద్యోగులు తరలి వెళ్లడంతో కార్యాలయం బోసిపోయింది.ప్రస్తుతం సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్ఎల్ నారాయణరెడ్డి ఒక్కరే అన్నీ తానై పని చేయాల్సి వస్తుంది. కార్యాలయంలో తహసీల్దారు, జూనియర్ కంప్యూటర్ అసిస్టెంట్ ఇరువురు మాత్రమే పని చేస్తున్నారు. ఇక్కడ డిప్యూటీ తహశీల్దారులుగా పని చేసిన ఎస్కే రఫీ ప్రమోషన్పై ఒంగోలు ఆర్డీఓ కార్యాలయానికి డీఈఓగా బదిలీ అయి వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న ఎంవీఎస్ సుధీర్ కుమార్ తాళ్లూరు రెవెన్యూ కార్యాలయంకు రెవెన్యూ ఇన్స్పెక్టర్గా ప్రమోషన్పై బదిలీ అయి వెళ్లారు. సీనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న శ్రీధర్రెడ్డి డిప్యూటేషన్పై ఒంగోలు ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా పని చేస్తున్న శ్రీనివాస్ ఒంగోలు కలెక్టర్రేట్ కార్యాలయానికి డిప్యూటేషన్పై వెళ్లారు. ఇద్దరు అటెండర్లో ఒక అటెండర్ కొండయ్య ఒంగోలు ఆర్డీఓ కార్యాలయానికి డిప్యూటేషన్పై వెళ్లారు. ప్రస్తుతం కార్యాలయంలో జేఏసీఏగా పని చేస్తున్న సందీప్ కుమార్ గ్రూపు2కు ఎంపిక అయ్యారు. త్వరలో ఆయన కూడా కార్యాలయం నుండి బదిలీ కానున్నారు. వీఆర్వోలు కూడా డిప్యూటేషన్పై ఒంగోలు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. మండలంలో పలు గ్రామాలకు వీఆర్వోలు కొరత కూడా అధికంగా ఉంది.కొన్ని గ్రామాలకు ఇన్ఛార్జ్ వీఆర్వోలు పని చేస్తున్నారు. సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో జిల్లా, హైకోర్టులలో 20 కేసులు పెండింగ్లో ఉన్నాయి. ముఖ్యంగా ఒంగోలు సమీపంలో పేర్నమిట్ట ఏరియాలో కోర్టు కేసులు అధికంగా ఉన్నాయి. అధికారులు తరచూ కోర్టు కేసులు నిమిత్తం వెళ్తుండడంతో రెవెన్యూ కార్యాలయం ఎక్కడి సమస్యలతో అక్కడే నిలిచిపోతుంది. ఇద్దరు ఉద్యోగులు ప్రమోషన్పై మరొక ముగ్గురు ఉద్యోగులు డిప్యూటేషన్పై వెళ్లడంతో సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం మరింతగా బోసిపోయింది. దీని వల్ల సమస్యలతో సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయం పేరుకుపోయింది. ఇకనైనా ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు స్పందించి సంతనూతలపాడు రెవెన్యూ కార్యాలయంలో ఉద్యోగుల కొరతను భర్తీ చేసి ఈ మేరకు సమస్యలను పరిష్కరించాల్సి ందిగా ప్రజలు కోరుతున్నారు.



## రాజీ మార్గంతో శాశ్వత పరిష్కారం

### - కక్షిదారులు లోక్ అదాలత్ను సద్వినియోగం చేసుకోవాలి
### - జూనియర్ సివిల్ జడ్జి లీలా శ్యాంసుందరి



**సింగరాయకొండ, సెప్టెంబర్ 13,(ప్రభాతవార్త**

పరస్పర సమ్మతితో రాజీ చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని, కక్షిదారులు లోక్ అదాలత్ అవకాశాన్ని తప్పక వినియోగించుకోవాలని జూనియర్ సివిల్జడ్జి వి.లీలా శ్యాంసుందరి సూచించారు. జాతీయ మెగా లోక్ అదాలత్ను శనివారం సింగరాయకొండ జూనియర్ సివిల్జడ్జి కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి లీలా శ్యాంసుందరి మాట్లాడుతూ సంవత్సరంలో నాలుగు సార్లు మాత్రమే జరిగే ఈ లోక్ అదాలత్లు, వివాదాలను సులభంగా,త్వరగా పరిష్కరించుకునే సమర్థవంతమైన వేదిక అనిపేర్కొన్నారు. ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం పెంపొందించడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఈ లోక్ అదాలత్లో అరుదైన పరిణామం చోటుచేసుకుంది. 1986లో టంగుటూరు పోలీస్ స్టేషన్లో నమోదైన 39 ఏళ్ల పాత కేసు జూనియర్ సివిల్ జడ్జి సమక్షంలో పరిష్కారమైంది. ఫిర్యాదుదారులు కేసు ఉపసంహరించుకోవడానికి అంగీకరించడంతో రాజీ కుదిరింది. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు, కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ పి.సంజీవరెడ్డి, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత



**మార్టూరు, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

స్థానిక ఎఫర్ట్ ఆఫీస్ నందు రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో రోటరీ మాజీ అధ్యక్షులు తాళ్లూరి సాంబశివరావు సౌజన్యంతో చిమ్మిరిబండ గ్రామానికి చెందిన దుడ్డు ప్రేమ్ చంద్ తండ్రి కిషోర్ అనువారికి కాలేజీ ఫీజు నిమిత్తం రూ.20 వేలు విలువ గల ఎస్బీఐ చెక్కును అందించడం జరిగింది. వీరి యొక్క పేదరికాన్ని గుర్తించి గత నాలుగు సంవత్సరాల నుంచి వీరికి తాళ్లూరి సాంబశివరావు కాలేజీ ఫీజు చెల్లించడం జరుగుతుంది. తాళ్లూరి సాంబశివరావు మాట్లాడుతూ ఇదే విధంగా తన చదువు పూర్తయ్యేంత వరకు ఆ విద్యార్థి యొక్క కాలేజీ ఫీజును చెల్లించటానికి మా యొక్క పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేస్తూ ఆ విద్యార్థి ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు మాట్లాడుతూ ఒక విద్యార్థికి చదువు పూర్తయ్యేంతవరకు ఫీజులు చెల్లించటం సంతోషదాయకమని తాళ్లూరి సాంబశివరావుని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి చెరుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, రోటరీ మాజీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, మాజీ అధ్యక్షులు మద్దుమాల కోటేశ్వరరావు, చెన్నుపాటి బసవయ్య, కొర్రపాటి కాజారావు, చింతల సుబ్బారావు, మురకొండ ఈశ్వర్ ప్రసాద్, వంకాయలపాటి శేషుబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

## కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

### - విద్యుత్ జేఏసీ చైర్మన్ హరికృష్ణ



**సీఎస్పురం, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

విద్యుత్శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని విద్యుత్శాఖ జేఏసీ నాయకులు సీహెచ్ హరికృష్ణ, కె.రవిలు డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికులకు సమస్యల పట్ల అవగాహన కల్పించేందుకు శనివారం జేఏసీ నేతలు సీఎస్పురం సబ్ స్టేషన్కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15నుంచి దశల వారి ఆందోళనలు విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15 నుంచి దశల వారీగా ఆందోళనలు చేపడుతున్నట్లు విద్యుత్ జేఏసీ చైర్మన్ హరికృష్ణ తెలిపారు. ఈనెల 15,16వ తేదీలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన, 17,18వ తేదీల్లో భోజన విరామ సమయంలో ధర్నా, 19,20వ తేదీల్లో జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్ష, 22న జిల్లా కేంద్రంలో శాంతియుత ర్యాలీ, జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించడం తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, నేరుగా వేతనాలు చెల్లించాలి, ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలి, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సర్వీస్ రెగ్యులేషన్లు రూపొందించాలి డిపార్టుమెంట్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించాలి. విద్యుత్ కార్మికులకు పెండిగంగ్ డీఎల్ను వెంటనే చెల్లించాలి, ప్రతి విద్యుత్ కార్మికుడికి అపరిమిత హెల్త్ కార్డులను అందించాలి, అన్ని కేడర్లో ఉన్న ఖాళీ పోస్టులను కాంట్రాక్టు కార్మికులతోటే భర్తీ చేయాలి తదితర డిమాండ్లతో చేపడుతున్న ఈ నిరసన కార్యక్రమాలలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ నేతలు సీహెచ్ హరి కృష్ణ, డివిజన్ ప్రెసిడెంట్ ఎల్ఎస్ఎస్ అనిల్ కుమార్, గూడూరి కరుణాకర్, సీనియర్ నాయకులు పి.మల్లయ్య, కనిగిరి డివిజన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.కృష్ణకుమార్, జి.రమేష్, నాగభూషణం, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## శ్రీ ప్రేమ సాయి మందిరంలో రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్
## చైర్మన్ నూకసాని బాలాజీ దంపతుల ప్రత్యేక పూజలు





**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

పెద్దదోర్నాల శ్రీ ప్రేమ సాయి మందిరంలో శనివారం రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి వార్లను దర్శించుకుని తిరుగు ప్రయాణంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ ప్రేమ సాయి మందిరాన్ని సందర్శించారు. చైర్మన్ నూకసాని బాలాజీ మందిరంలో పూజలు చేస్తుండగా స్థానిక టీడీపీ, కూటమి నాయకులు ఆసక్తిగా వీక్షించారు. సాయి దర్శనం మనశ్శాంతి నిస్తుందని,ప్రజలుసుఖసంతోషాలతో ఉండాలని కోరుతున్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీతో పాటు స్థానిక టీడీపీ కూటమి నాయకులు ఏరువా మల్లిఖార్జునరెడ్డి, బట్టు సుధాకర్రెడ్డి, బండారు సుబ్బనారాయణ, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, చంటి, శ్రీనివాస్ యాదవ్, మండల జనసేన అధ్యక్షుడు కేతి వెంకట మోహన మురళి, గుర్రాల ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు ఒంటేరు


## మార్కాపురం నూతన డీఎఫ్ఓగా బాధ్యతలు చేపట్టిన అబ్దుల్ రవుఫ్



**మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త**

మార్కాపురం నూతన అటవీ శాఖాధికారి (డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్, మార్కాపురం)గా అబ్దుల్ రవుఫ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో భాగంగా ఆయన శ్రీశైలంలో సబ్ డీఎఫ్ఓగా సేవలందిస్తూ ఆయన మార్కాపురంకు బదిలీఅయ్యారు. ప్రస్తుతం మార్కాపురం డిప్యూటీ డైరెక్టర్గా విధులు నిర్వహిస్తున్న గుండాల సందీప్ కృపాకర్ను పీసీసీఎఫ్ కార్యాలయానికి సీఎఫ్ గా బదిలీ చేశారు. ఈ సందర్భంగా నూతన డీడీ అబ్దుల్ రవుఫ్ కార్యాలయ సిబ్బందిని కలుసుకొని పరిచయం చేసుకున్నారు. అనంతరం అటవీశాఖ అధికారులు, అటవీశాఖ కార్యాలయ సిబ్బంది అబ్దుల్ రవుఫ్కు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయనను సన్మానించారు.

## గాయం ఆదిలక్ష్మీ పార్థివ దేహానికి ఎమ్మెల్యే ఉగ్ర నివాళి



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 13 (ప్రభాతవార్త**

హనుమంతునిపాడు మండలం మొరవారిపల్లి గ్రామం కనిగిరి ఏఎంసీ డైరక్టర్ గాయం కృష్ణారెడ్డి మాతృమూర్తి ఆదిలక్ష్మి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ మక్కు ఉగ్ర నరసింహారెడ్డి అక్కడికి చేరుకుని ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంట కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, మండల క్లస్టర్ ఇన్ఛార్జ్ గాయం తిరుపతిరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు కుందురు నారాయణరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నర్సయ్య, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి,చీకటి వెంకట సుబ్బయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు తాటిరెడ్డి వీరనారాయణరెడ్డి, కత్తి తిరుపాలు తదితరులు ఉన్నారు.

7_7.qxd 9/14/2025 12:33 AM Page 1



## అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వ పరిపాలన

**- మ్యాజిక్ డ్రైన్ కాల్వల నిర్మాణ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల**





**రాచర్ల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి దిశగా పరిపాలన సాగిస్తుందని గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. మండలంలోని గౌతవరం గ్రామానికి 23.75 లక్షల రూపాయలతో మంజూరైన మ్యాజిక్ డ్రైన్ కాల్వల నిర్మాణానికి శనివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని, సూపర్‌సిక్స్ లో భాగంగా ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చి తమ చిత్తశుద్ధి నిరూపించు కున్నారని అన్నారు. అభివృద్ధిని ఓర్చుకోలేని వైసిపి నాయకులు అసత్య ప్రచారాలతో ప్రభుత్వంపై బురద చెల్లుతున్నారని, వారి కుయుక్తులను ప్రజలు గమనించాలన్నారు. సూపర్ సిక్స్ లో అన్ని హామీలు దాదాపు కూటమి ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. పెన్షన్ పెంపు, తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వీటిని ఇప్పటికే నెరవేర్చమని, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి త్వరలో నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపిడి ఎస్ భాస్కరరావు, ఎంపీడీవో ఎస్ వెంకటరామిరెడ్డి, ఏపీవో ఆర్ మహాలక్ష్మి, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కటిక యోగానంద్, రాచర్ల సొసైటీ బ్యాంక్ చైర్మన్ గోపిరెడ్డి జీవనేశ్వర్ రెడ్డి, రామాపురం సొసైటీ చైర్మన్ భవనం పుల్లారెడ్డి, గిద్దలూరు ఏఎంసీ చైర్మన్ బైలడుగు బాలయ్య, నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, భవనం శ్రీధర్ రెడ్డి, నల్లబోతుల శ్రీనివాసులు, పేర్ల సుధీర్ కుమార్ రెడ్డి, పఠాన్ సనావుల్లా ఖాన్, ఎస్ కళ్యాణ్‌రెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, ముత్తుముల రాజశేఖర్‌రెడ్డి, దూదేకుల సయ్యద్ మియా, పాపిశెట్టి శ్రీనివాసులు, సూర్నేని రామకోటయ్య, సిరిగిరి వెంకటపతి, బత్తిని రామకృష్ణ, యాసం లక్ష్మిరెడ్డి, ఉలాపు శంకర్‌నాయుడు, పుట్ట బాలకృష్ణ, స్థానిక సర్పంచ్ మార్తోట లక్ష్మీదేవి, ఎంపీటీసీ ఏలం వెంకట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అనుములవీడులో ఆర్‌డిఎస్ఎస్ పనుల ప్రారంభానికి భూమిపూజ




**రాచర్ల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని అనుమలవీడు గ్రామంలో శనివారం ఆయన ఆర్‌డిఎస్ఎస్ (రివ్యాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్) పనుల ప్రారంభానికి శనివారం మండల టిడిపి యువనాయకుడు అంబవరం శ్రీనివాసరెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ద్వారా ఏళ్లతరబడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు ప్రస్తుతం ప్రభుత్వం పరిష్కారం చూపిందని తెలిపారు. గృహాలపై ప్రమాదకరంగా, అడ్డంకిగా మారిన సర్వీసులు తొలగించి గ్రామ వెలుపల నుండి విద్యుత్ లైన్ ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. పాత విద్యుత్ సర్వీస్‌లను అన్నింటిని తొలగించి వాటి స్థానంలో క్రొత్తవి ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ విధానం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తొలగడమే కాకుండా త్రీఫేస్ కరెంట్ గ్రామాల్లో 24 గంటలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు చప్పిడి శ్రీనివాసరావు, డివి రమణారెడ్డి, వి.శివరామిరెడ్డి, రఘురామిరెడ్డి, యామ సంజయ్, తలపాటి దివాకర్, పి ఆంజనేయులు, విద్యుత్ శాఖ ఏఈ బాలగురవయ్య, జేఎల్ఎం రహమత్ బాషా, షిఫ్ట్ ఆపరేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నల్లమలలో విరిగిపడిన కొండచరియలు..

**- భక్తులకు ఆగిపోయిన స్వామివారి దర్శనం**





**రాచర్ల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
మండలంలోని జేపీ చెరువు అటవీ ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయంలో శనివారం లక్ష్మమ్మవనం దాటిన తరువాత కొండచరియలు విరిగిపడ్డాయి. దీనికి తోడు నల్లమల అడవుల్లో కురుస్తున్న భారీ వర్షాలకు రంగస్వామి గుండానికి వరద నీరు భారీగా చేరుతుంది. దీంతో లక్ష్మమ్మ వనం వద్ద వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తూ భక్తులకు ఇబ్బంది తలెత్తే పరిస్థితి ఏర్పడింది. దీంతో భక్తులకు స్వామివారి దర్శనం అర్ధాంతరంగా ఆగిపోయింది. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు మరియు స్వామి దర్శన కార్యక్రమాలు ప్రారంభమైన కొద్దిసేపటికే లక్ష్మమ్మ వనం దాటిన తర్వాత ఒక్కసారిగా కొండ చరియలు విరిగిపడడంతో సమాచారం అందుకున్న దేవస్థానం కార్యనిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య వెంటనే స్వామివారి దర్శనాన్ని ఆపివేసి, తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని భక్తులను అప్రమత్తం చేశారు. భక్తులకు ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోయినప్పటికీ ముందు జాగ్రత్తగా భక్తులను ఆలయం నుండి వెలుపలికి పంపించివేయడంతో తక్షణ చర్యలు తీసుకున్నారు. అప్రమత్తమైన ఈవో నాగయ్య వెంటనే ట్రాక్టర్ల సహాయంతో భక్తులను సురక్షితంగా వాగు దాటించేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం ఆలయం మూసివేశామని, దర్శనాన్ని నిలిపివేశామని ఆయన తెలిపారు. భక్తులు పరిస్థితిని అర్థం చేసుకొని తమకు సహకరించాలని ఆయన కోరారు.

## బలిజ సంఘం నూతన అధ్యక్షుడిగా సూరే ప్రసాద్





**కంభం, సెప్టెంబరు 13, ప్రభాతవార్త**
శ్రీకృష్ణ దేవరాయ బలిజ సేవా సంఘం కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల కమిటీ నూతన అధ్యక్షుడిగా మాజీ సైనికోద్యోగి సూరే ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. శనివారం కంభం సంఘం కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు కమిటీ పాత అధ్యక్షులు తోట కోటేశ్వరరావు, పలువురు సభ్యులు నూతన అధ్యక్షునిగా సూరే ప్రసాద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన సూరెప్రసాద్‌కు బలిజ సేవా సంఘంసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సూరె ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు కంభం చెరువు కట్టపై జరిగే కార్తీక వనభోజన కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## శ్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలి

**- ఎస్‌జికెయస్ రాష్ట్ర నాయకులు యండి ఆనంద్ బాబు**

**గిద్దలూరు, సెప్టెంబరు 13,ప్రభాతవార్త**
స్మశానంలో వృత్తిని నిర్వహించే కాటికాపరిలను ప్రభుత్వం గుర్తించి వారిని 4వ తరగతి ఉద్యోగులుగా నియమించాలని ఎస్‌జికెయస్ రాష్ట్ర నాయకులు యండి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శనివారం గిద్దలూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఉన్న యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో స్మశానంలో గుంతలు తీసి పూడ్చే, కాల్చే కాటికాపరుల సంఘం ప్రకాశం జిల్లా సదస్సును నిర్వహించారు. ఎస్‌జికేఎస్ నాయకులు మెరుగు రాజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సును ఉద్దేశించి ఎస్‌జికేఎస్ రాష్ట్ర నాయకులు యండి ఆనంద్ బాబు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మ తోటి రఘురామ్, గిద్దలూరు సిఐటియు, కేవీపీఎస్ నాయకులు ఆవులయ్య, పరదేశి రాజశేఖర్ మాట్లాడుతూ సాంప్రదాయం పేరుతో వారసత్వంగా అంటగట్టబడిన స్మశాన వృత్తిని బాధ్యతగా భుజస్కంధాలపై వేసుకుని, కడుపు నింపకపోయినా అర్ధాకలితోనే బతుకు కొనసాగిస్తూ వస్తున్నామన్నారు. చనిపోయింది పేద అయినా, దనికుడైన, అధికారైనా, చివరికి ప్రజా ప్రతినిధి అయినా పూడ్చేది, లేదా కాల్చేది మేమే అన్నారు. అయినా ఇప్పటికీ ఈ వృత్తిని ప్రభుత్వం ఒక వృత్తిగా కూడా గుర్తించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనున్న కర్ణాటక రాష్ట్రంలో కాటికాపరి వృత్తిని ప్రభుత్వం వృత్తిగా గుర్తించడంతోపాటు వృత్తి పరికరాలను ఉచితంగా ఇప్పటికే అందించిందన్నారు. వృత్తిదారులను 4వ తరగతి ఉద్యోగులుగా నియమిస్తామని హామీ ఇచ్చిందన్నారు. సమస్త వృత్తులను గుర్తించి సహకారం అందిస్తున్న పాలకులు ఇప్పటికైనా కాటికాపరి వృత్తిని ప్రభుత్వం గుర్తించి గుర్తింపు కార్డులను మంజూరు చేయాలన్నారు. కాటికాపరులు, సల్వాదులు, బేగరోల్లు, ఎటోళ్లు అనే పేర్లతో పిలవబడుతున్న స్మశానంలో వృత్తిని నిర్వహించే వారందరినీ 4వ తరగతి ఉద్యోగులుగా నియమించి బృతి కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారానికై అన్ని సచివాలయాలలో అర్జీలు ఇవ్వడంతో పాటు, అసెంబ్లీ ప్రారంభమయ్యేలోపు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శాసనసభ్యులందరినీ కలిసి సమస్యను వివరిస్తామన్నారు. సమస్యపై చర్చించి పరిష్కరించకపోతే గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి దాకా మరింత పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ మండలాల నుండి హాజరైన ప్రతినిధులు పెద్దన్న, సురేష్, విజయభాస్కర్, సుధాకర్, డేవిడ్ రాజ్, సామెల్, ప్రదీప్, ఆనంద్ కుమార్, కేశాలు, ఎలీషా రాజు, సతీష్ కుమార్, ఏసేపు, విక్టర్, మనోహర్ తోపాటు మరో వందమంది పాల్గొన్నారు.

## "సృష్టి" విశ్వకర్మ యజ్ఞోత్సవం సభను విజయవంతం చేయాలి

**- బిజెపి ఓబిసి రాష్ట్ర నాయకులు రాజా శ్రీకాంత్ కోటపాటి**



**మార్కాపురం రూరల్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని భారతీయ జనతా పార్టీఆధ్వర్యంలో "సృష్టి" విశ్వకర్మ యజ్ఞోత్సవం సభను అమరావతి రాజధాని శంకుస్థాపన జరిగిన ఉద్దరాయుని పాలెంలో ఏర్పాటుచేయనున్నారనిఈ కార్యక్రమాన్ని విజయవంతంచేయాలన్న లక్ష్యంతోమార్కాపురం పట్టణం లోని నాయుడు వీధిలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బిజెపి ఓబీసీ రాష్ట్ర నాయకులు రాజా శ్రీకాంత్ కోటపాటి మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచే విశ్వకర్మలు భారతీయ సాంస్కృతిక వారసత్వానికి ఆధారశిలగా నిలిచారని తెలిపారు. దేవాలయ నిర్మాణం నుంచి యుద్ధ ఆయుధాల తయారీ వరకు, అభరణాల రూపకల్పన నుంచి గృహసామాగ్రి తయారీ వరకు విశ్వకర్మలు ఎన్నో రకాలుగా దేశానికి సేవలందించారని కొనియాడారు. అలాగే, మార్కాపురం ప్రాంతానికి చెందిన విశ్వకర్మలు సెప్టెంబర్ 17న జరగబోయేఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ పీ.వి.కృష్ణారావు, జిల్లా కార్యదర్శి అల్లాకుల సుబ్బారావు, సీనియర్ నాయకులు సరోజిని, జీవిరెడ్డి, శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిద్దలూరు పోస్టాఫీసుల్లో నిలిచిన స్పీడ్ పోస్ట్ సేవలు




**గిద్దలూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
గిద్దలూరు పోస్టాఫీసుల్లో శనివారం స్పీడ్ పోస్ట్ సేవలు, ఇతర పోస్టల్ సేవలు నిలిచిపోయి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన పోస్టాఫీసులో సిస్టమ్ పనిచెయ్యలేదని సేవలు నిలిపివేయగా, రాచర్ల రోడ్డులోని పోస్టాఫీసులో ప్రింటర్ పనిచేయడం లేదని స్పీడ్ పోస్ట్ సేవలు ఇతర పోస్టల్ సేవలు నిలిపివేయడంతో అత్యవసరంగా పోస్ట్ చేయవలసిన వినియోగదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ సమస్య పై పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను వార్త ప్రతినిధి సంప్రదించగా గిద్దలూరు పెద్ద పోస్టాపీసులో శుక్రవారం మధ్యాహ్నం నుండి కంప్యూటర్ లోని హార్డ్ డిస్క్ పని చేయకపోవడం వలన, రాచర్ల రోడ్డు నందలి పోస్ట్ ఆఫీస్‌లో థెర్మల్ ప్రింటర్ వెండర్ సప్లై చేయకపోవడంతో స్పీడ్ పోస్ట్ సేవలలో అంతరాయం నెలకొందని అన్నారు. సోమవారం ఉన్నతాధికారుల చొరవతో సమస్య పరిష్కరించి స్పీడ్ పోస్ట్ సేవలు కొనసాగేలా చూస్తామని తెలిపారు. సోమవారం నుంచి అయినా సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

## వెలగలపాయలో నేల సంతానోత్పత్తిపై రైతులకు శిక్షణ




**అర్ధవీడు, సెప్టెంబరు 13 ,ప్రభాతవార్త**
మండలంలోని వెలగలపాయ గ్రామంలో ఆత్మ వారి ఆధ్వర్యంలో శనివారం నేల సంతానోత్పత్తి కార్యక్రమంపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి.శివగంగప్రసాద్ మాట్లాడుతూ మనం సాగు చేసే నేలలు నిస్సారంగా మారి ఒట దిగుబడుటు తగ్గిపోవడానికి కారణమవుతున్నాయని తెలిపారు. దీనికి గల ముఖ్య కారణం రసాయన ఎరువులు ఎక్కువగా వాడడం వలన నేలలు చౌడుబారిపోతున్నాయన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా రైతులు తప్పనిసరిగా పచ్చిరొట్ట ఎరువులైన జనుములు, జీలుగులు, పిల్లపెసంలయ పంటలు వేసే ముందు వేసుకుని 50 నుంచి 60రోజుల కాల పరిమితిలో భూమి కలియదున్నాలని తెలిపారు. దీని వలన నాలుగు నుంచి 5 ట్రాక్టర్ల పశువుల ఎరువుతో సమానమని తెలిపారు. ఇలా చేయడం వలన మొక్కలకు కావలసిన సూక్ష్మ దాతు పోషకాలు కూడా మొక్కలకు సమృద్ధిగా అంది పంట దిగుబడి పెరగడానికి దోహదపడుతుందని తెలిపారు. అదేవిధంగా పత్తి పంట విత్తుకునే ముందు రైతులు తప్పనిసరిగా మెగ్నీషియం సల్ఫేట్ ఒక ఎకరాకు 5నుంచి 10కిలోలు చొప్పున ఆఖరి దుక్కి వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఐఏ బాలేశ్వరయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత వెంకట్రావు తల్లి లక్ష్మమ్మకు పలువురు ఘన నివాళులు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని శనివారం నాడు టీడీపీ నేత బొడ్డు వెంకటరావు తల్లి సాంబ లక్ష్మమ్మకు పలువురు టీడీపీ నేతలు ఘన నివాళులర్పించారు. సాంబ లక్ష్మమ్మ(90)గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీ నాయకులు సాదినేని శ్రీరామమూర్తి, వెంకట్రావు, సుబ్బారావు పి.ఇంద్రబాబు, బి.యల్లమంద, ఎం.వెంకటేశ్వర్లు, చెరుకూరి వెంకట సుబ్బయ్య, బొడ్డు వెంకట స్వామి, కొప్పోలు శ్రీనివాసరావు, మద్దిరాల శ్రీనివాసరావు తదితరులు సాంబలక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. లక్ష్మమ్మ కుమారులు వెంకట్రావు, శ్రీనివాసరావులకు వారు తమతమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు ఘన స్వాగతం




**టంగుటూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
విజయవంతంగా కుప్పం నుండి ఇచ్ఛాపురం 1200కిలోమీటర్లుప్రయాణించి ఇచ్ఛాపురం చేరుకున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు ఘనస్వాతం పలికారు. కేక్‌కట్ చేసి ముగింపు ఉత్సవం చేసుకున్న మాల ప్రజానీకం జైజైలు కేరింతలు రాజకీయ పార్టీలే కాదు, మాలలు కూడా చేయగలరని నిరూపించిన రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్‌బాబు, మాలల జేఏసీ సభ్యులు, నాయకులు, యాత్రతో మొదటి నుండి ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినటువంటి వారికి కృతజ్ఞతలు తెలిపారు.

## అమరవీరులు మాదాల కోటయ్య, నరసయ్యలకు ఘన నివాళులు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలంలోని మైనంపాడు సమీపంలో గల గుళ్ళవాగు దగ్గర అమరవీరులు మాదాల కోటయ్య మాదాల నరసయ్యల 75వ వర్ధంతి సందర్భంగా శనివారం వారి స్థూపాలకు సీపీఎం నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి, విముక్తి కోసం తెలంగాణ ప్రాంతంలో నైజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి ఈ ప్రాంతంలో అనేక రకాలుగా మద్దతు తెలుపుతున్నారనే కారణంతో ఆ రోజుల్లో నెహ్రూ సైన్యాలు ఈ ప్రాంతానికి వచ్చి కమ్యూనిస్టులను అణచి వేయాలని మాదాల కోటయ్య మాదాల నరసయ్యలను ఎన్కౌంటర్ పేరుతో పట్టుకొచ్చి గుళ్ళ వాగులో కాల్చి చంపినా ప్రజల మనసుల నుండి చెరిపి వేయలేకపోయారన్నారు. ఆ తర్వాత ఆ ప్రాంతంలో కమ్యూనిస్టు ఉద్యమం బలపడిందని ఒక వైపు ప్రజా ఉద్యమాలు వైపు పార్లమెంటరీ రంగంలో ప్రజలు కమ్యూనిష్టుల వైపు నిలిచి వారిని ఎన్నికల్లో గెలిపించారన్నారు. దాంతో ఉద్యమాలను తుపాకీతూటాల ద్వారా అణచలేరని రుజువైందన్నారు . కేంద్రంలోని బీజేపీ ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం నూతన సరళీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తూ ప్రజల సంపదను లూటీచేసి కార్పొరేట్లకు కట్టబెడుతుందని అన్నారు. ప్రశ్నించే వారిపై నయాఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తూ ఉపా లాంటిచట్టాలను తీసుకొచ్చి జైలలో నిర్బంధిస్తుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు ప్రజలు పోరాటాల్లోకి వస్తున్నారని అన్నారు. నిరుద్యోగం ఎన్నడూ లేని విధంగా పెరిగిందన్నారు. బీజేపీ ఆర్ఎస్ఎస్ భారతీయ సంస్కృతిని దెబ్బతీస్తూ కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య ఉన్న ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ మతోన్మాదాన్ని ప్రేరేపిస్తూ దాడులు చేయిస్తుందన్నారు. రాజ్యాంగంలో ఉన్న లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సోషలిస్టు భావాలపై నిరంతరం దాడి చేస్తూ రాజ్యాంగాన్ని బలహీనపరచడానికి, మార్చటానికి కుట్ర చేస్తుందని అన్నారు. కార్పొరేట్ దోపిడికి, భూ కేంద్రీకరణకు, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా అమరవీరులు మాదాల కోటయ్య మాదాల నరసయ్యల స్పూర్తితో పోరాటాలకు సిద్ధం కావడమే వారికి ఘనమైన నివాళులర్పించడమని అన్నారు. జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ అమెరికా విధిస్తున్న టారిఫ్‌ల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం నిర్వీర్యం అవుతుందని అన్నారు. దేశంలో ప్రజల చేతుల్లో ఉన్న భూములు మొత్తాన్ని కార్పొరేట్ కంపెనీలకు పరిశ్రమల పేరుతో కట్టబెడుతున్నారని ఈ విధానాలకు వ్యతిరేకంగా రైతులు, నిర్వాసితులు, పెద్ద ఎత్తున ఉద్యమాల్లోకి వస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఈ విధానాల కారనంగా పేదలు మరింత పేదలుగా, ధనవంతులు మరింత ధనవంతులుగా మారుతున్నారన్నారు. దేశంలో ప్రజలమధ్య ఆర్థిక అంతరాలు తీవ్రంగాపెరుగుతున్నాయని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు మాట్లాకపోవడం ప్రజల పట్ల వారి వైఖరి తేటతెల్లం చేస్తుందన్నారు. అమరవీరుల స్పూర్తితో టారిఫ్‌లకు వ్యతిరేకంగా భారాలకు వ్యతిరేకంగా సీపీఎం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ముందుగా స్థూపాలకు షేక్ మాబు కరిచేటి హనుమంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీసభ్యులు బంకా సుబ్బారావు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు నెరుసుల వెంకటేశ్వర్లు, మైనంపాడు శాఖ కార్యదర్శి అద్దంకి భగత్‌సింగ్, నాయకులు గుండవరపు వెంకట సుబ్బారావు, షేక్ కమాల్, తన్నీరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు పోరాటాలకు సిద్ధం కావాలి

**- సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు**



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్‌మాబు పిలుపునిచ్చారు. సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్టలో శుక్రవారం రాత్రి జరిగిన సీపీఎం మాజీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ఈ సభకు సీపీఎం గ్రామ కార్యదర్శి అన్నె వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న మాబు మాట్లాడుతూ సీతారాం ఏచూరి తన జీవితాన్ని ప్రజలకుఅంకితం చేశారని పేర్కొన్నారు. నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలంలో ఆమెను జేఎన్‌యు వైస్ చాన్సలర్ పదవికి రిజైన్ చేయించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఆయన జేఎన్‌యులో 3 సార్లు గోల్డ్ మెడల్ సాధించారని తెలిపారు. ఆ యూనివర్సిటీలో విద్యార్థి సంఘ ఎన్నికల్లో 3 సార్లు అధ్యక్షుడుగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. ఆయన 32 ఏళ్ల వయస్సులోనే పార్టీ కేంద్ర సభ్యుడిగా 40 ఏళ్ల వయస్సులో పొలిట్ బ్యూరోకి ఎన్నికయ్యారని తెలిపారు. ఆయన రాజ్యసభ సభ్యుడిగా పార్లమెంట్‌లో పని చేసి రాణించాడని అన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో ఆయన చాలా కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన దేశ విదేశాల్లో కమ్యూనిస్టు పార్టీలకు అమూల్యమైన సూచనలు, సలహాలు ఇచ్చారని అన్నారు. నేపాల్‌లో మళ్లీ రాచరిక పాలన రావడానికి అక్కడ మితవాత శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని అన్నారు. ప్రధాని మోడీ అమెరికా దగ్గర మోకరిల్లు తున్నాడని విమర్శించారు. చైనా ప్రపచంలో సూపర్ పవర్‌గా ఎదుగుతున్నందని, చైనాలో ఆకలి దారిద్ర్యం లేవన్నారు. మన దేశంలో నిరుద్యోగ రైతాంగ సమస్యలు పెరిగి పోతున్నాయని అన్నారు. రైతులు, కార్మికులు, ప్రజలు, అప్పుల పాలవుతున్నారని వాపోయారు. దేశ సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారని తీవ్ర స్థాయిలో విమర్శించారు. మన దేశంలో 90 కోట్ల మంది ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని ఆ రంగాన్ని అంబానీ, ఆదానీలకు కట్టబెట్టే ప్రయత్నం కేంద్రం చేస్తుందని ఆయన ఆరోపించారు. రాష్ట్రాల హక్కులను కేంద్రం హరిస్తుందని అన్నారు. ఈ సభకు ముందుగా ఏచూరి చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు దగ్గుబాటి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బంకా సుబ్బారావు, స్థానిక నాయకులు తుళ్లూరి సుబ్బారావు, ఆముదాల కోటేశ్వరరావు, ఉంగరాల రామకృష్ణ, జూపూడి వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధరించటం ప్రతి ఒక్కరి బాధ్యత

**- అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హెల్మెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ముత్తుముల**





**గిద్దలూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త**
హెల్మెట్ ధరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. గిద్దలూరు పట్టణంలోని శ్రీ విట్టా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో "అమ్మ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. బోనేని వెంకటేశ్వర్లు శనివారం గిద్దలూరు సర్కిల్ పరిధిలోని రాచర్ల, గిద్దలూరు, కొమరోలు పోలీసులకు హెల్మెట్లు, వాటర్ బాటిల్లు, క్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు, గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి హాజరై పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించటం ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ప్రమాదం జరిగితే కుటుంబం అనాధ అవుతుందని, కావున యువత బైక్‌లపై అతివేగంగా వెళ్ళటం చాలా ప్రమాదమని, తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. అనంతరం గిద్దలూరు రూరల్, అర్బన్, సీఐలు సురేష్, రామ కోటయ్య మరియు కంభం సీఐ మల్లిఖార్జునలు మాట్లాడుతూ ఇటీవల ఓ కానిస్టేబుల్ రోడ్డు ప్రమాదానికి గురై తలకు బలమైన గాయం కావడంతో మంచానికే పరిమితమయ్యాడని ఈ విషయం తెలుసుకున్న అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు స్పందించి రాచర్ల, కొమరోలు, గిద్దలూరు ప్రాంతాలలో మండలాలలోని పోలీస్ స్టేషన్‌లలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి సంస్థ ఆధ్వర్యంలో దాదాపు 100 మందికి హెల్మెట్లు, వాటర్ బాటిల్లు, టోపీలు పంపిణీ చేశారని, పోలీసు సిబ్బంది తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ హెల్మెట్లు ధరించి వాహనాలు నడపాలని సిఐలు, ఎస్సైలు సూచించారు. ప్రజలు కూడా హెల్మెట్‌ధరించి తలకు రక్షణ కల్పించు కోవాలన్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అమ్మ సేవా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని అన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్లు పంపిణి చేసిన అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బోనేనివెంకటేశ్వర్లు సేవలు అభినందనీయమని పోలీస్ శాఖ మరియు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ అధ్యక్షులు సయ్యద్ శానేషా వలి, మండల పార్టీ అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, వైస్ చైర్మన్ గోడి ఓబుల్ రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య, బిజ్జం రవీంద్రా రెడ్డి, రాష్ట్ర ఎడ్యుకేషన్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ గోనా చెన్నకేశవులు, రాచర్ల మండల టీడీపీ నాయకులు అంబవరం శ్రీనివాసరెడ్డి, పోలీస్ సిబ్బంది, టీడీపీ కౌన్సిలర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కనిగిరి మున్సిపాలిటీ 8 వ వార్డు టీడీపీ అధ్యక్షుడిగా రీటా ఫయాజ్ నియామకం



**కనిగిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా షేక్ రీటా ఫయాజ్ నియమితులయ్యారు. అమరావతిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపాలిటీలో 20 వార్డుల అధ్యక్షులను అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఫయాజ్ నియామకంపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు సర్వత్ర హర్షం వ్యక్తం చేశారు. ఆయన సమాజ సేవా దృక్పథం, పార్టీ పట్ల అంకితభావం ప్రజలతో ఉన్న అనుబంధంతో వార్డు అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం జరిగినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా రీటా ఫయాజ్ మాట్లాడుతూ నన్ను పదవికి నియమించినందుకు ఎమ్మెల్యేకి జన్మంతం రుణపడి ఉంటాను. ఆయన ఆశీస్సులు, మార్గదర్శకత్వంలో వార్డు అభివృద్ధికి కృషి చేస్తాను. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడి ఇంటికిచేరేలా కృషి చేస్తాను. తెలుగుదేశం పార్టీ ఉన్నతికి అహర్నిశలు కృషి చేస్తూ పార్టీ పటిష్టతను పెంపొందిస్తాను అనిఅన్నారు. అలాగే ప్రజల సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడూ ముందుంటానని, టీడీపీ శక్తివంతమైన ప్రజా శక్తిగా నిలవడానికి తాను అంకితభావంతో పని చేస్తానని స్పష్టం చేశారు.

## కలెక్టర్ రాజాబాబును కలిసిన తహాశీల్దార్ రవిశంకర్



**కనిగిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా నూతన కలెక్టర్‌గా పి.రాజాబాబు శనివారం 39వ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కనిగిరి తహాశీల్దార్ ఆకుల వెంకట రవిశంకర్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ప్రజలకు మరింత చేరువైన పరిపాలన అందించేందుకు రెవెన్యూ విభాగం తరుపున తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పారదర్శక పరిపాలనపై తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని కలెక్టర్ రాజాబాబు స్పష్టం చేశారు.

## మూడోసారి కనిగిరి ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ అహ్మద్

### - విధేయతకు పట్టం



**కనిగిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణంలోని ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా షేక్ అహ్మద్ మూడో సారి ఎన్నిక కావడం పట్ల ముస్లిం సోదరులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత పదేళ్లుగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి, ముస్లింమైనార్టీలసంక్షేమానికి అహ్మద్‌చేస్తున్న కృషి ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ, ఆయనకు అతి విధేయుడిగా నిలిచిన అహ్మద్, కనిగిరి పట్టణంలోని మైనార్టీల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించారు. ముస్లిం సోదరులకు సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయడం, ఎవరైనా ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించడంలో అహ్మద్ కీలకపాత్ర పోషించారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలో ముస్లిం సోదరులను ఐకమత్యంతో నడిపిస్తూ, వారికి మనోధైర్యం నింపుతూ సమాజంలో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అహ్మద్ అని స్థానిక మైనార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. మూడోసారి అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ముస్లిం సోదరుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని షేక్ అహ్మద్ సంకల్పం వ్యక్తం చేశారు.

## భారతదేశ విముక్తి తత్వవేత్త అంబేద్కర్

### - మాస్టర్ ఇంగిరాల రామచంద్రరావు





**కనిగిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
భారతదేశ విముక్తి తత్వవేత్త బాబా సాహెబ్ అంబేద్కర్ అని అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మాస్టర్ ఇంగిరాల రామచంద్రరావు అన్నారు. శనివారం కనిగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాల గురవయ్య అధ్యక్షతన అంబేద్కర్ సిద్ధాంత అధ్యయన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రరావు మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం రిజర్వేషన్ల స్థాపకుడు మాత్రమే కాదు, భారత దోపిడికి తత్వ శాస్త్రమైన బ్రాహ్మణవాదానికి విరుగుడుగా విముక్తి తత్వశాస్త్రాన్ని అందించిన మహనీయుడు అని పేర్కొన్నారు. అంబేద్కరన ఆధునిక భారతదేశ బుద్ధుడని, 1956 అక్టోబర్ 14న మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఐదు లక్షల అనుచరులతో కలిసి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం ప్రపంచ మత చరిత్రలో కొత్త అధ్యాయాన్ని ఆరంభించిందని తెలిపారు. ఆయన బౌద్ధ ధర్మ విశిష్టతను, దాని అవసరాన్ని వివరించి పీడిత ప్రజల విముక్తి కోసం మార్గం చూపారని అభివర్ణించారు. ఈ సందర్భంగా ఇంగిరాల రామచంద్రరావు రచించిన సామాజిక ప్రజాస్వామ్య తత్వవేత్త పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయనకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్‌రావు, పూలే సేవా సమితి నాయకులు దేవపురి వెంకటేశ్వర్లు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ యాసిన్, న్యాయవాది యరజాల బాల నారాయణ, బీటీఏ నాయకులు చీమలదిన్నె చిన్న వెంకయ్య, ఏడీపీఎస్ నాయకులు చిట్టేటి రమణయ్య, విశ్రాంత ఉపాధ్యాయులు, సామాజిక ఉద్యమకారులు తదితరులు పాల్గొన్నారు.

## పూరిమెట్లలో కొనసాగుతున్న వైద్యశిబిరాలు



**ముండ్లమూరు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
డాక్టర్ సీహెచ్ ప్రవీణ్ కుమార్ వైద్యాధికారి మారెళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పూరిమెట్ల గ్రామంలో గత వారం రోజుల నుండి వస్తున్న నొప్పులతో కూడిన జ్వరాలు భయపడాల్సిన పని లేదని అవి చికెన్ గున్యా వైరస్ జ్వరాలుగా గుర్తించారు. దోమ కాటు వల్ల వస్తుంది. ప్రతి ఒక్కరు కూడా దోమతెరలు వాడుకోవాలి. అదే విధంగా పంచాయతీ తరఫున హైబిట్ (స్ప్రే) చేయించడం జరుగుతుంది. మెడికల్ క్యాంపుల్లో పూరిమెట్ల గ్రామంలో నివారించాలని అదే విధంగా హరిజనవాడలోని ప్రాథమిక పాఠశాలలో వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని ప్రజలు అక్కడికి వెళ్లి నివారణ మందులు, తగు పరీక్షలు చేయించుకోవచ్చునని సూచించారు. అదే విధంగా గ్రామంలో పారిశుద్యం గ్రామ సెక్రెటరీ ద్వారా అమలు చేస్తున్నామని తెలియజేశారు. గ్రామ నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ శిబిరాలలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కేవి రాజు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కిరణ్, రత్న కుమారి, ఏఎన్ఎం రమణకుమారి, ఆశాలు పాల్గొని సహకరించారు.

## దర్శి కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జిలు



**దర్శి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
దర్శిలోని పొదిలి రోడ్డులో ఉన్న కోర్టు ఆవరణలో శనివారం జడ్జిలో మొక్కలు నాటారు. దర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శివశంకర్‌రెడ్డి, అద్దంకి జూనియర్ సివిల్ జడ్జి సీత, న్యాయవాదులు కోర్టు ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడ్వకేట్లు పాల్గొన్నారు.

## బీసీ ఉద్యోగులకు ఆత్మీయ సత్కారం



**దర్శి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
ఈసీఆర్ హ్యాపీ హోమ్స్‌లోని గౌరవ మందపల్లి సుబ్బారావు ఇంటి వద్ద దర్శి డివిజన్ బీసీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గురు ప్రసాద్ అధ్యక్షత వహించగా కార్యక్రమం నిర్వహకులుగా కేవీజీ కీర్తి, టి.రాజశేఖర్, పి.నజీర్లు, జి.ప్రసాద్, పి.రంగారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఎస్‌కే కబీర్‌ని, ఎస్‌బీఐ వారు ఎన్నిక చేసిన వరకాల వెంకటేశ్వర్లుని, ఎస్‌కే భాషాని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు గురు ప్రసాద్‌ని ఘనంగా సత్కరించడం జరిగింది. వెంకటరావు మాట్లాడుతూ సన్మాన గ్రహీతలు ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని సేవలు చేశారని, వీరందరూ సమాజానికి విలువైన వారని కొనియాడారు. బీసీ ఉద్యోగులు ఐకమత్యంతో ముందుకు సాగాలని ఎవరికి ఏ కష్టం వచ్చినా బీసీ ఉద్యోగుల సంఘం అండగా ఉంటుందని, ఆత్మాభిమానం చాలా గొప్పదని సమాజంలో మన కంటూ గొప్ప ప్రస్థానం ఉందని మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, కలిసికట్టుగా అడుగులు వేద్దామని ప్రతి ఒక్కరికి అండగా ఉందామని తెలియజేశారు. ఈనెల 22వ తేదీన ఉద్యోగుల సమావేశం ఉందని, ఈ సమావేశానికి అన్ని విభాగాల్లోని ఉద్యోగులు తరలిరావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నక్కా కోటేశ్వరరావు, జి.వేణు, ఎం.శ్రీను, పి.కాశీం, బాల సుబ్రహ్మణ్యం, బి.శ్రీను, యు.సురేష్, అంజయ్య, జేవీవీఎం సుధాకర్, ఎం.సుబ్బారావు, పీరు సాహెబ్, ఏడుకొండలు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కళా ఉత్సవ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి పోటీలు 2025-26





**దర్శి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
కళా ఉత్సవ్ ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి పోటీ మైనంపాడులో కిజిజి పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. అందులో భాగంగా గిరిజన నృత్యం పోటీలో పాల్గొన్న వర్షిణి బృందం(కే.శరణ్య, ఏ.అవినయ, ఎం.చైత్ర) పాల్గొని రెండవ స్థానం బహుమతి గెలుచుకున్నారు. జానపద గానంలో జస్మిత బృందం(కే.నాగమల్లేశ్వరి, వై.నిషిత పాల్గొని మూడవ బహుమతి పొందారు. బుర్రకథ ప్రదర్శించిన ఆర్.హర్షిణి, జే.త్రివేణి పాల్గొని రెండవ స్థానం బహుమతి పొందారు. మట్టితో బొమ్మలు చేయుటలో పాల్గొని వై.అంజలి రెండవ స్థానం బహుమతి పొందింది. బహుమతి పొందిన విద్యార్థులను కిజిజి పాఠశాల డైరక్టర్ కే.రమణారెడ్డి, ప్రధానోపాధ్యాయు లైన అంథోని అభినందించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## బాపట్ల నూతన కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే మద్దులూరి, వేగేశనగ



**చీరాల, సెప్టెంబర్ 13,ప్రభాతవార్త**
బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ వినోద్‌కుమార్‌ని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య, బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మలు శనివారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సన్మానించారు.

## రౌడీషీటర్లు శాంతియుత జీవనం సాగించాలి

### - సీఐ శేషగిరిరావు



**చీరాల టౌన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త**
రౌడీ షీటర్లు అందరూ శాంతియుతంగా జీవించాలనిరూరల్ సీఐ శేషగిరిరావు అన్నారు. శనివారం బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు చీరాల డీఎస్పీ మొయిన్ పర్యవేక్షణలో చీరాలరూరల్ సర్కిల్ కార్యాలయంలో చీరాలరూరల్, వేటపాలెం పోలీసు స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లందరికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు మాట్లాడుతూ గొడవల్లో పాలుపంచుకోకూడదు, ఎవరైనావివాదాలు రేపితే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ఆయన ఇంకా మాట్లాడుతూ నేరపరమైన కార్యకలాపాల్లో మళ్లీ మళ్లీ పాల్గొనే వారిని వదలమని, అటువంటి వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తాం అని స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీసులు ఎప్పుడూ కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంఆరని ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తే వారిభవిష్యత్తు అంధకారంలో పడిపోతుందని అధికారుల మాటల్లో ఉట్టిపడింది. ఈ సమావేశంలో ఈపూరపాలెం ఎస్సై చంద్రశేఖర్, వేటపాలెం ఎస్సై జనార్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

## వరి రకాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై అవగాహన



**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండలం కనపర్తి గ్రామంలో వ్యవసాయశాఖ ఆత్మ ఆధ్వర్యంలో కనపర్తి ఎత్తిపోతల పథకం కింద ఉన్న గ్రామాల రైతులకు వరి రకాల ఎంపిక, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం దర్శి శాస్త్రవేత్త రమేష్‌బాబు మాట్లాడుతూ మన నేలకు తగిన రకాలను ఎంపిక చేసుకోవాలని తెలియజేశారు. ఎంసీమెచ్- 103 వరి రకంచౌడుని తట్టుకునే వరిరకం అని తెలియజేశారు. సన్న వరిరకాలను సాగు చేసుకోవడం వలన త్వరగా అమ్ముకోవచ్చుని తెలియజేశారు. వరిలో నీరు తీసి బురదలో యూరియా వేసుకోవడం వలన ఎక్కువ శాతం మొక్కకు ఉపయోగపడుతుందని తెలియజేశారు. ఆఖరి దుక్కిలో 20 కేజీలు జింక్ సల్ఫేట్ వేసుకోవడం ద్వారా జింక్ లోపం రాకుండా నివారించుకోవచ్చని తెలియజేశారు. ఒక కిలో వరి విత్తనంకి 3 గ్రాములు కార్బన్ డిజమ్‌తో విత్తన శుద్ధి చేసుకోవడం వలన అగ్గి తెగులు నివారించుకోవచ్చు అని తెలియజేశారు. ఉల్లికోడు రాకుండా నారు తీసే వారం రోజులు ముందు నారుమడిలో ఒక కిలో కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలని తెలియజేశారు. వ్యవసాయాధికారి వెంకటరావు మాట్లాడుతూ గుళికల యూరియాకి బదులు నానో యూరియా వాడాలని తెలియజేశారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని తెలియజేశారు. ఫిబ్రవరి మొదటి వారంలోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని తెలియజేశారు. ప్రతి ఒక్క రైతు వేసిన పంటను ఈ పంటలో నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కనపర్తి ఎత్తిపోతల పథకం అధ్యక్షులు ఈదర కృష్ణారావు, కార్యదర్శి శేషగిరిరావు, డైరక్టర్లు, కనపర్తి ఎత్తిపోతల పథకం కింద గ్రామాల రైతులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి వినతి

**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ సాచివేత వైఖరికి, డీఏ, ఐఆర్, పీఆర్సీ, అరియర్స్ ఊసేలేని నిర్లక్ష్య ధోరణికి నిరసనగా ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన నిరసన వారంలో భాగంగా సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గం శాసనసభ్యులు బీఎన్ విజయ్ కుమార్ కి ప్రకాశం జిల్లా శాఖ, ఒంగోలుజోన్ ఫెడరేషన్ బాధ్యులతో కలిసి ఉపాధ్యాయుల అవస్థలను, ఆకాంక్షలను ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రిల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారంలో చొరవ చూపాల్సిందిగా మెమోరాండం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా శాఖ ఉపాధ్యక్షులు బి.శేషారావు, పి.హనుమంతరావు, స్టేట్ కౌన్సిలర్లు కే.రవి, జేవీఆర్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఐ.విజయ సారధి, సీనియర్ నాయకులు పరిటా సుబ్బారావు, ఉమ్మనేని రామారావు, పెనుబోతు రామారావు, కాట్రగడ్డ వెంకటరావు, ఒంగోలు బాధ్యులు, పి.వీరరాఘవులు, కాట్రగడ్డ వెంకటరావు, ఒంగోలు బాధ్యులు పి.వీరరాఘవులు, యు.సుబ్బయ్య, నాగులుప్పలపాడు మండల అధ్యక్షులు ఈశ్వరయ్య, కార్యదర్శి గుమ్మడి సురేష్‌బాబు, కొత్తపట్నం మండల ప్రధాన కార్యదర్శి మస్తాన్, మద్దిపాడు మండల కార్యకర్తలు రాము, కట్టా శ్రీను, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కనిగిరి పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా వాసు





**కనిగిరి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
కనిగిరి పట్టణ బీసీ సెల్ కమిటీకి కొత్త అధ్యక్షుడు , ప్రధాన కార్యదర్శిని స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి శుక్రవారం ప్రకటించారు. ఈ సందర్భంగా పెన్నా వెంకటేశ్వర్లు పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడిగా, చింతలపూడి వాసు ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ పట్టణంలోని బీసీల సమస్యలను పార్టీ దృష్టికి తీసుకువస్తూ పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అలాగే పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వారి నియామకం పట్ల బీసీ సంఘాల నాయకులు పల్లా మాలకొండలరావు, చెరుకూరు నరసింహారావు(బుజ్జి), చింతలపూడి తిరుపాలు, కాసుల శ్రీరాములు యాదవ్, గోబిశెట్టి బాలచెన్నారావు, చీరల నాగయాదవ్, బొప్పరాసుబ్బారావు, పాలూరి సత్యం, గురుప్రసాద్, పట్నం నరసింహులు, కొబ్బరి బోండాల సుబ్బారావు, పచ్చవ చంద్రశేఖర్, చెరుకూరి మల్లిఖార్జున, చింతంకృష్ణ, చింతం కిరణ్, మాచేపల్లి రామయ్య, ఈదర రవికుమార్, ఆర్‌వి నారాయణ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## జేవీవీ రాష్ట్ర మహాసభలలో పాల్గొన్న ప్రకాశం జిల్లా ప్రతినిధులు

**కొనకనమిట్ల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
విజయనగరంలో శనివారం నుంచి జరుగుతున్న జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలకు ప్రకాశం జిల్లా నుంచి 22మంది ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసరెడ్డి, వెంకట్రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు స్వరూపరెడ్డి, జయప్రకాష్, బి.మాలకొండారెడ్డి, ఎస్‌కే ఖజావుద్దిన్, మండ్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పీవీ కొండయ్య, వెంకటేష్, రాష్ట్ర సమతా కన్వీనర్ షేక్ బషీరున్నీసా బేగం పలువురు పాల్గొన్నారు.

## ఎస్సీ, బీసీ, హాస్టల్స్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
సంతనూతలపాడులోని ఎస్సీ, బీసీ హాస్టల్స్ విద్యార్థులకు శనివారం నాడు సంతనూతలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్‌ఆఫీసర్ డాక్టర్ బి.సుధామణి, వైద్యసిబ్బంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందజేశారు. ఫీవర్, వైరల్ ఫీవర్, తదితర వ్యాధులకు సంబంధించి విద్యార్థులకు టెస్టులు చేశారు. 37 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పరీక్షలు చేశారు. తదుపరి విద్యార్థులకు సంబంధించి ఆహారాన్ని పరీక్ష చేశారు. విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలపై మెడికల్ ఆఫీసర్ సుధామణి విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ వీరమ్మ, వైద్య సిబ్బంది, ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కలెక్టర్ రాజాబాబును మర్యాదపూర్వకంగా కలిసి

### శుభాకాంక్షలు తెలిపిన జిల్లా వీఆర్వో సంఘ నేతలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తదుపరి పి.రాజాబాబును ఒంగోలు కలెక్టర్ భవన్లో జిల్లా వీఆర్వో సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షులు వైపీ రంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఏసీ ఆదిరెడ్డి, జిల్లా ట్రెజరర్ కే.జానయ్య, కనిగిరి డివిజన్ వీఆర్వోల సంఘం అధ్యక్షులు రమేష్‌బాబు, యువ నాయకులు జి.వెంకటరెడ్డి తదితరులు నూతన కలెక్టర్ రాజాబాబును ఈ సందర్భంగా కలిసిన వారిలో ఉన్నారు.

## ఈ నెల 15 వ తేదీ నుండి ప్రారంభమయ్యే పశువులు, దూడలకు

### నిర్వహించే గాలికుంటు వ్యాధి టీకాలను పశుపోషకులు సద్వినియోగపరుచుకోవాలి



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
ఈ నెల 15 వ తేదీ నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు సంతనూతలపాడు మండలంలో ఆయా గ్రామాల్లో పశువులు, దూడలకు, వైరస్ నివారణకు చేపట్టే గాలికుంటు వ్యాధిటీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగ పరుచుకోవాలని సంతనూతలపాడు మండల పశువైద్యాధికారిణి డాక్టర్ కే.అనురాధ శనివారం ఒక ప్రకటనలో కోరారు. గాలికుంటూ వ్యాధి సోకిన పశువులకు అధికగా జ్వరం రావడం, మేత తినకపోవడం తదితర లక్షణాలు చోటు చేసుకోనున్నట్లు డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. నాలుగు నెలల దూడల నుండి అన్ని రకాల పశువులకు ఈ క్యాంపులో గాలికుంటు వ్యాధి టీకాలను ఆయా గ్రామాల్లో పశువైద్య బృందం వారి గృహాల వద్ద వేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈనెల 15 నుండి 17వ తేదీ వరకు మండలంలోని మద్దులూరు, రుద్రవరం, ఎండ్లూరు, గ్రామాల్లో పశువులకు ఈ గాలికుంటు టీకాలను వేయనున్నట్లు పేర్కొన్నారు. 18,19వ తేదీల్లో చిలకపాడు, మంగమూరు, లక్ష్మీపురం గ్రామాల్లో, 20వ తేదీన బొడ్డువారిపాలెం, చంద్రపాలెం గ్రామాల్లో 22,23వ తేదీల్లో గంగవరం, కొనగానివారిపాలెంలలో, 24, 26వ తేదీల్లో గుమ్మలంపాడు, గుడిపాడు, చలప్పాలెం గ్రామాల్లో, 27,30వ తేదీల్లో ఎనికపాడు, గురవారెడ్డిపాలెం, మైనంపాడు గ్రామాల్లో, అక్టోబర్ 1 నుండి 4వ తేదీ వరకు పి.తక్కెళ్ళపాడులో, అక్టోబర్ 6 నుండి 9వ తేదీ వరకు సంతనూతలపాడు లో , అక్టోబర్ 10 నుండి 13వ తేదీ వరకు ఎం.వేములపాడు, మట్టిపాడు గ్రామాల్లో, అక్టోబర్ 14,15వ తేదీల్లో సంతనూతలపాడు మండలంలోని కామేపల్లివారిపాలెం గ్రామాల్లో దూడలు, పశువులకు, గాలికుంటు వ్యాధి టీకాలను వేయనున్నట్లు మండల పశువైద్యాధికారిణి డాక్టర్ అనురాధ వెల్లడించారు. ఆయా గ్రామాల్లో నిర్దేశించబడిన తేదీల్లో ఉదయం 6గంటల నుండి 30 నిమిషాల నుండి పశుపోషకులు వారి గృహాల వద్ద పశు వైద్య బృందం దూడలు , పశువులకు ఈ గాలికుంటు టీకాలను వేయనున్నట్లు డాక్టర్ అనురాధ పేర్కొన్నారు. దీనిని ఆయా పోషకులు సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

## పొదిలి ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగుల నిరసన




**కొనకనమిట్ల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త**
ఈహెచ్‌ఎస్‌ను పూర్తి స్థాయిలో అమలు చేయాలని పొదిలి ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు నల్ల రిబ్బన్ లతో శనివారం నిరసన చేపట్టారు. ఎన్‌ఎంయు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఈ నిరసన వ్యక్తం చేశారు. పొదిలి డిపోలో పని చేస్తున్న మహిళ కండక్టర్ జివి లక్ష్మీ భర్త అనారోగ్య కారణాలతో వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చగా అక్కడ ఇహెచ్‌ఎస్ అమలు కాకపోవడంతో ఆర్థిక పరిస్థితి సహకరించక ఒంగోలు రిమ్స్‌లో వైద్య సేవలు పొందుతూ మరణించాడని ఎన్‌ఎంయు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి మరో ఉద్యోగికి కలగకూడదని ప్రభుత్వం దానిపై దృష్టి పెట్టాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులకు కొంత మందికి ఈహెచ్‌ఎస్ అమలవుతుందని, మరి కొంత మందికి అమలు కావడం లేదని గతంలో ఉన్న పాత పద్ధతే మాకు అనుకూలంగా ఉందని దానినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంయు నాయకులు జీవీ నారాయణ, అధ్యక్షులు ఎస్‌కే అలి, సెక్రటరి కృష్ణ, గ్యారేజి కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# భారత్‌పై సుంకాలకు జి7 దేశాలు సిద్ధం

## భారత్, చైనా సహా రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై భారీగా ఆంక్షలు

### అమెరికా ప్రతిపాదనకు ఆ దేశాలు అంగీకారం




**వాషింగ్టన్, సెప్టెంబరు 13:** రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై ఐరోపా సమాఖ్యతో పాటు, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. దీనికి జీ7 దేశాలు అంగీకరించినట్లు తెలుస్తోంది. భారత్‌పై భారీగా టారిఫ్‌లు విధించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డిమాండ్లను జీ7 దేశాలు అంగీకరించినట్లు తెలిసింది. ఉక్రెయిన్‌లో శాంతి పునరుద్ధరణకు రష్యాపై ఒత్తిడి తేవడమే సరైన మార్గమని అమెరికా భావిస్తోంది. అందులో భాగంగా రష్యన్ చమురును కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై ఐరోపా సమాఖ్యతో పాటు, జీ7 దేశాలు టారిఫ్‌లు విధించాలని అమెరికా ప్రతిపాదించింది. ఈ టారిఫ్‌ల విధింపునకు తాజాగా జీ7 దేశాలు కూడా అంగీకరించినట్లు సమాచారం. జీ7 దేశాల ఆర్థిక మంత్రులు ఈ సుంకాల విధింపుపై చర్చించారు. ఈ విషయాలను అమెరికా వాణిజ్య ప్రతినిధి జామిసన్ గ్రీర్ వెల్లడించారు. ఇప్పటికే భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ క్లిష్ట సమయంలో నిర్ణయాత్మక చర్య తీసుకోవడానికి వారంతా ముందుకురావాలని కోరారు. ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి నిజంగా కట్టుబడి ఉంటే రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ముందుకురావాలని యూఎస్ వాణిజ్య మంత్రి స్కాట్ బెసెంట్ పిలుపునిచ్చారని తెలిపారు. ఇందుకోసం మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలపై సుంకాలు విధించాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రతిపాదనలను ఉద్ఘాటించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా యుద్ధం ముగింపునకు కట్టుబడి ఉన్నామని జీ7దేశాలు ప్రకటించాయని తెలిపారు. ఉక్రెయిన్ రక్షణకు నిధులు సమకూర్చేందుకు స్తంభించిన రష్యా ఆస్తులను ఉపయోగించే విషయంపైనా సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. క్లిష్ట సమయంలో అమెరికాతో కలిసి ఈ దేశాలు కూడా నిర్ణయా త్మక చర్యలు చేపడుతాయని ఆశిస్తున్నామని వెల్లడించారు. దీంతో భారత్, చైనాలపై సుంకాల విధింపునకు ఆయా దేశాలు కూడా సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాగా, రష్యాపై ఒత్తిడి తెచ్చేందుకు ఇంతకుముందు ఐరోపా సమాఖ్య(ఈయూ) దేశాల ముందు కూడా ట్రంప్ ఇలాంటి ప్రతిపాదనలే చేశారు. అయితే, ఈవిషయంలో ఈయూ దేశాల్లో భిన్నాభిప్రాయలు వ్యక్తమయ్యాయి. దీంతో అది సాధ్యపడలేదు. ఇవే ప్రతిపాదనలను ఆయన మళ్లీ జీ7 దేశాల ముందుపెట్టడం గమనార్హం. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై 50 శాతం సుంకం విధించడం అంత తేలికైన విషయం కాదని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. రష్యాపై చర్య తీసుకునేందుకు భారత్‌తో విభేదానికి తాము సిద్ధమయ్యామని అన్నారు. భారత్ రష్యాకు అతిపెద్ద చమురు వినియోగదారని తెలిపారు. ఆ దేశం నుంచి చమురు కొంటున్నారన్న కారణంతోనే నేను భారత్‌పై 50 శాతం సుంకం విధించానని, అది చాలా పెద్ద చర్య అని చెప్పారు. దీంతో భారత్‌తో విభేదాలు వచ్చాయని, అయినా తాను చర్య తీసుకున్నానని చెప్పారు. ఇలాంటి ఎన్నో పనులు చేశానని ఓ ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్‌పాక్ ఘర్షణ సహా ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య ఏడు యుద్ధాలను తాను నివారించినట్టు ట్రంప్ మళ్లీ పాత పాట పాడారు.



## జపాన్‌లో లక్షదాటిన శతాధిక వృద్ధుల జనాభా

### ప్రపంచ వ్యాప్తంగా 55వసారి జపాన్ రికార్డు

**టోక్యో, సెప్టెంబరు 13:** జపాన్ కొత్త రికార్డు క్రియేట్ చేసింది. ఆ దేశంలో వంద ఏళ్లు దాటిన వృద్ధుల సంఖ్య లక్ష దాటినట్లు ప్రభుత్వం వెల్లడించింది. వరుసగా 55వ సంవత్సరం ఆ దేశం కొత్త రికార్డును నమోదు చేసింది. సెప్టెంబర్‌లో శతాధిక వృద్ధుల సంఖ్య 99,763 మందికి చేరుకున్నట్లు ఆరోగ్యశాఖ మంత్రి వెల్లడించారు. అయితే దీంట్లో 88 శాతం మంది మహిళలే ఉండడం గమనార్హం. అత్యధిక కాలం జీవిస్తున్న వారి సంఖ్య జపాన్‌లో అధికం. ఆ లిస్టులో జపాన్ టాప్‌లో ఉంటుంది. ప్రపంచంలోని అత్యంత వృద్ధ వ్యక్తి ఆ దేశంలో జీవిస్తున్నట్లు రికార్డులు ఉన్నాయి. చాలా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల జపాన్ ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నారు. కానీ అక్కడ జనన రేటు తక్కువగా ఉన్నది. జపాన్ నివేదికల ప్రకారం ఆదేశంలో జీవిస్తున్న అత్యంత వృద్ధ వ్యక్తి వయసు 114 ఏళ్లు. యమటో కరియామాకు చెందిన ఆ మహిళను షిగికో కగ్వాగా గుర్తించారు. నారా సిటీకి శివారులో ఈ ప్రాంతం ఉంది. జపాన్ లెక్కల ప్రకారం అత్యంత వృద్ధ మగ వ్యక్తిని కియోటకా మిజునోగా గుర్తించారు. ఆయన వయసు 111 ఏళ్లు. ఇవాటా అతని స్వస్థలం. ఆరోగ్యశాఖ మంత్రి తకమారో పుఖోకా ఈ నేపథ్యంలో వృద్ధులకు కంగ్రాట్స్ చెప్పారు. 87,784 మంది మహిళలు, 11,979 మంది వృద్ధ పురుష జనాభా ఉన్నట్లు మంత్రి తెలిపారు. జపాన్‌లో సెప్టెంబర్ 15వ తేదీన వృద్ధ దినోత్సవం జరుపుతున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నుంచి ఆ వృద్ధులకు ఓ లేఖ, సిల్వర్ కప్ అందిస్తారు. ఈ ఏడాది 52,310 మంది పురస్కారానికి ఎంపికయ్యారు. 1963లో శతాధిక వృద్ధులను లెక్కింపు చేయడం మొదలుపెట్టారు. ఆ సమయంలో 153 మందివందేళ్లు దాటిన వాళ్లు ఉన్నారు. 1981లో ఆ సంఖ్య వెయ్యి దాటింది. 1998 నాటికి ఆ సంఖ్య పది వేలకు చేరుకున్నది. జపాన్‌లో ఒబెసిటీ కేసులు తక్కువ. రెడ్ మీట్ తక్కువగా తింటారు. ఎక్కువగా చేపలు, కూరగా యలు తింటారు. జపాన్ మహిళల్లో ఒబెసిటీ కేసులు మరీ మరీ తక్కువ. దాని వల్లే అక్కడ మహిళల్లో జీవిత కాలం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. మిగితా ప్రపంచ దేశాలన్నీ తమ డైయిట్‌లో షుగర్, ఉప్పుకు అధిక ప్రాధాన్యత ఇవ్వగా జపాన్ మాత్రం భిన్నంగా ముం దుకె ళ్లింది. ఉప్పును తగ్గించి తీసుకోవాలని జపాన్‌లో ప్రచారం చేశారు.

కేవలం ఆహారం మాత్రమే కాదు జీవితంలో యాక్టివ్‌గా ఉండేందుకు ఎక్కు వగా వాకింగ్ చేస్తారు. ప్రజా రవాణా వ్యవస్థ మీద ఎక్కువగా ఆధారపడుతారు. జపాన్ వృద్ధ జనాభా లెక్కల్లో కొంత అవకతవకలు ఉన్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. ఫ్యామిలీ రిజిస్ట్రీల ప్రకారం జపాన్‌లో 2010 నాటికే సుమారు రెం డున్నర లక్షల మంది శతాధిక వృద్ధులు ఉం టారని అంచనా వేస్తున్నారు. కానీ వాళ్లు పెన్షన్ కోసం తప్పుడు లెక్కలు చూపి ఉంటారని కొం దరు భావిస్తున్నారు.



## గాజాపై ఇజ్రాయెల్ ఉధృత దాడులు 65 మందికిపైగా మృతి

**గాజా సిటీ, సెప్టెంబరు 13:** హమాస్ అంతమే లక్ష్యంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులకు పాల్పడుతోంది. డ్రోన్లు, వైమానిక దాడులతో విరుచుకుపడుతోంది. తాజాగా శుక్రవారం కూడా గాజాలోని పలు ప్రాంతాలపై ఐడీఎఫ్ దళాలు విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో 60 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. గాజా నగరంలోని ఉత్తర ప్రాంతంపై ఐడీఎఫ్ కాల్పులు జరిపింది. ఈ దాడిలో 65 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన 14 మంది ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. గాజా నగరంలో అట్ ట్వామ్ ప్రాంతంలోని ఇంటిపై జరిపిన దాడిలో వారంతా మరణించినట్లు పేర్కొన్నాయి. అయితే, ఈ దాడులను పాలస్తీనా గ్రూప్ హమాస్ ఖండించింది. పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడుతోందని ఆరోపించింది. ఇలాంటి చర్యలు అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది.



## రాయ్‌బరేలి అభివృద్ధి సమీక్షలో రాహుల్, యుపి మంత్రుల వాగ్వాదం

**లక్నో,సెప్టెంబరు 13:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, యూపీ మంత్రి దినేశ్ ప్రతాప్ సింగ్ మధ్య వాగ్వాదం జరిగింది. రాయ్‌బరేలీ నియోజకవర్గం జిల్లా అభివృద్ధిపై జరిగిన దిశా మీటింగ్‌లో ఆ ఇద్దరి నేతల మధ్య మాటల యుద్ధం సాగింది. సెప్టెంబర్ 11వ తేదీన ఈ ఘటన జరిగింది. దానికి సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం వైరల్ అవుతోంది. నియోజకవర్గా అభివృద్ధి పనులపై చర్చ జరుగుతున్న సయమంలో ఇద్దరి మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. దీంతో ఆ ఇద్దరూ గట్టిగా అరిచారు. తమ వాదనలను వినిపించే ప్రయత్నం చేశారు. ఒకవేళ రాయ్‌బరేలీ నియోజకవర్గం ప్రజల తరపున రాహుల్ గాంధీ పోరాడితే అప్పుడు ఆయనకు మద్దతు ఇవ్వనున్నట్లు మంత్రి చెప్పారు. కానీ దిశా మీటింగ్ వేదికగా పార్టీ రాజకీయాలు ప్రచారం చేసినా, ప్రభుత్వాన్ని విమర్శించినా ఊరుకునేది లేదన్నారు.

## కేరళ వృద్ధునికి రూ.3.72కోట్ల 'సైబర్'టోపీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** డిజిటల్ అరెస్ట్ ఈ మధ్య సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న కొత్త పంథా. తాజాగా కేరళలోని కొల్లాంలో 79 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు మోసగించారు. కొల్లం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దక్షిణ కేరళ జిల్లాలోని ఓ వృద్ధుడికి జులై 7న వాట్సప్‌లో వీడియో కాల్ వచ్చింది. కాల్ చేసిన వ్యక్తి తనను తాను బిఎస్ఎన్ఎల్ అధికారికగా పరిచయం చేసుకున్నాడు. అక్రమ కార్యకలాపాలకు మొబైల్ నంబరు వినియోగించినందుకు ముంబయి సైబర్ పోలీసులు ఈ నంబర్‌ను ట్రాక్ చేస్తున్నట్లు తెలిపారు. కొద్దిసేపటికే దుండగులు పోలీసు దుస్తుల్లో వాట్సాప్ వీడియో కాల్ చేసి తాము ముంబయి సైబర్ పోలీసులమని పేర్కొంటూ నకిలీఅరెస్టువారెంట్ జారీ చేశారు. దీంతో ఆందోళన చెందిన వృద్ధుడు వారు చెప్పినట్లుగా వివిధఖాతాలకు జులై23 నుంచి ఆగస్టు 29మధ్య 17లావాదేవీలలో రూ. 3.72 కోట్లను బదలీ చేశాడు. వారు డబ్బు తిరిగి పంపకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు.

## లాడెన్ మీ దేశంలోనే హతమయ్యాడని మర్చిపోయారా?

### పాకిస్థాన్‌కు ఇజ్రాయెల్ కౌంటర్




**టెల్‌అవీవ్, సెప్టెంబరు 13:** ఐరాసలోని భద్రతా మండలి వేదికగా పాకిస్థాన్ ఇజ్రాయెల్ కౌంటర్ ఇచ్చింది. కరుడుగట్టిన ఉగ్రవాది బిన్‌లాడెన్‌కు పాక్ ఆశ్రయం కల్పించిందని, అక్కడే అతడు హతమయ్యాడని వ్యాఖ్యానించింది. ద్వంద్వ ప్రమాణాలతో వాస్తవాలను మార్చలేరంటూ విమర్శలు చేసింది. గత రెండేళ్లుగా ఇజ్రాయెల్–హమాస్ మధ్య పోరు జరుగుతోంది. కాల్పుల విరమణకు సంబంధించి అమెరికా ప్రతిపాదన మేరకు దోహాలో ఖతార్ అధికారులు, హమాస్ నేతలు భేటీ అయ్యారు. వీరి మధ్య చర్చలు జరుగుతుండగానే ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడింది. దీనిని పలు దేశాలు ఖండించాయి. అయితే, ఈ దాడులను ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సమర్థించుకున్నారు. అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడులను అమెరికాలో జరిగిన 9/11 దాడులతో పోల్చారు. ఆ తర్వాత పాకిస్థాన్ గడ్డపై ఆశ్రయం పొందిన బిన్‌లాడెన్‌ను అమెరికా మటుపెట్టిన విషయాన్ని ప్రస్తావించారు. ఖతార్‌పై దాడుల గురించి ఐరాస భద్రతామండలిలో చర్చ సందర్భంగా తమ దేశం పేరు ప్రస్తావించడంపై పాకిస్థాన్ అభ్యంతరం చెప్పింది. అలాగే ఇజ్రాయెల్ దాడిని ఖండించింది. ప్రాంతీయ సుస్థిరతను దెబ్బతీసే దురాక్రమణ అని వ్యాఖ్యలు చేసింది. దాంతో ఐరాసలో పాక్ రాయబారి అసీమ్ ఇఫ్తికార్ అహ్మద్‌ను ఉద్దేశించి ఇజ్రాయెల్ శాశ్వత ప్రతినిధి డానీ డానన్ గట్టి కౌంటర్ ఇచ్చారు.

'విదేశీ గడ్డపైనున్న ఉగ్రవాదిని ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారనే ప్రశ్న అడగకూడదు. అడగాల్సిన ప్రశ్న ఏంటంటే.. అసలు ఉగ్రవాదికి ఆశ్రయం ఎందుకు ఇస్తున్నారు అని. బిన్‌లాడెన్‌ను మట్టుపెట్టేందుకు చేసిన ఆపరేషన్ సరైందే అయినప్పుడు హమాస్ విషయంలో మేం చేసింది కూడా సరైందే' అని సమర్థించుకున్నారు. 9/11 తర్వాత భద్రతామండలి ఒక తీర్మానాన్ని ఆమోదించిందని ఏ దేశమూ ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటివి చేయకూడదని పేర్కొందన్నారు. అలా కాదని ఆశ్రయం కల్పిస్తే, మండలి నియమావళిని ఉల్లంఘించినట్లే అవుతుందన్నారు. కాగా అమెరికాలో 2001, సెప్టెంబరు 11న వరల్డ్ ట్రేడ్ సెంటర్‌పై ఉగ్రదాడి జరిగిన 24 యేళ్లు అయిన నేపథ్యంలో భద్రతా మండలి సమావేశమైంది. ఆ చర్చలో భాగంగానే పాకిస్థాన్ ఉగ్రవాదులకు స్వర్గధామమని మరోసారి తేటతెల్లమైంది.

## ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్‌తో మ్యాచ్‌లేంటి?

### శివసేన చీఫ్ ఉద్ధవ్ థాకరే ఆగ్రహం



**ముంబయి, సెప్టెంబరు 13:** ఆసియా కప్‌లో భాగంగా ఆదివారం భారత్‌పాకిస్థాన్ మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్‌పై శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని ఎగదోసే పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడడం అంటే, అది భారతీయుల భావోద్వేగాలను అవమానించడమే అని వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లో మన సైనికులు ప్రాణాలు త్యాగం చేస్తుంటే, పాకిస్థాన్‌తో క్రికెట్ మ్యాచ్ ఆడడం ఏంటని ప్రశ్నించారు. ఈ మ్యాచ్‌కు వ్యతిరేకంగా మహారాష్ట్ర అంతటా సిందూర్ నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ముంబయిలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఉద్ధవ్ ఠాక్రే, ఆదివారం జరగనున్న భారత్‌పాక్ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలని, ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రపంచానికి తెలియజేయడానికి ఇది ఒక మంచి అవకాశమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా బీజేపీపై ఉద్ధవ్ ఠాక్రే తీవ్ర విమర్శలు చేశారు. భారత్‌పాక్ క్రికెట్ మ్యాచ్‌ను అనుమతించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసినట్లు ప్రకటించబోతోందా అని ఆయన ప్రశ్నించారు. మన సైనికులు సరిహద్దుల్లో ప్రాణాలు త్యాగం చేస్తుంటే, మనం పాకిస్థాన్‌తో క్రికెట్ ఆడాల్సిన అవసరం ఉందా అని ప్రశ్నించారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్ర సర్కార్‌పై మండిపడిన ఉద్ధవ్ ఠాక్రే, దాయాదుల మధ్య జరగనున్న క్రికెట్ మ్యాచ్ దేశభక్తిపై వేసిన ఒక పెద్ద జోక్ అని అభివర్ణించారు. దీనిని బాయ్‌కాట్ చేస్తే, ఉగ్రవాదంపై భారత వైఖరి ఏమిటో ప్రపంచానికి బలమైన సంకేతాన్ని పంపినట్లు అవుతుంది అని ఆయన అన్నారు. బీజేపీ దేశభక్తి పేరుతో వ్యాపారం చేస్తోందని ఆయన విమర్శించారు.

ఒకానొక సమయంలో బాల్ ఠాక్రే దగ్గరకు పాకిస్థాన్ క్రికెటర్ జావేద్ మియాందాద్ వచ్చారు. అప్పుడు కూడా క్రికెట్ మ్యాచ్ గురించే చర్చ జరిగింది. ఆ సందర్భంలో బాల్ ఠాక్రే, పాకిస్థాన్ నేల మీద నుంచి భారత్‌పై ఉగ్రవాద చర్యలు కొనసాగినంత కాలం క్రికెట్ ఆడడం జరగదు అని మియాందాద్ మొహం మీదే చెప్పారని ఈ సందర్భంగా ఉద్ధవ్ తెలిపారు. ప్రస్తుతం భారత విదేశాంగ విధానం చాలా బలహీనంగా ఉందని ఈ క్రికెట్ మ్యాచ్ ద్వారా నిరూపితం అయ్యిందని వ్యాఖ్యానిం చారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను కేంద్రం తిరిగి తీసుకోలేక పోయిందని అన్నారు.

## 3 నిమిషాల్లో విరిగిన ఎముకలు అతికేందుకు 'బోన్‌గ్లూ'!

### చైనా శాస్త్రవేత్తల అద్భుత పరిశోధనలు



**బీజింగ్, సెప్టెంబరు 13:** వైద్య రంగంలో మరో అద్భుతం వెలుగులోకి వచ్చింది. విరిగిన ఎముకలను అతికించాలంటే గంటల తరబడి సాగే శస్త్రచికిత్సలు, స్టీల్ ప్లేట్లు, స్క్రూలు అవసరం లేకుండా కేవలం మూడు నిమిషాల్లోనే సరిచేసే ఒక ప్రత్యేకమైన 'బోన్ గ్లూ' ను చైనా శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ఆర్థోపెడిక్స్ విభాగంలో ఇదొక విప్లవాత్మక మార్పుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. తూర్పు చైనాలోని షెజాంగ్ ప్రావిన్స్‌కు చెందిన పరిశోధకులు 'బోన్ 02' పేరుతో ఈ సరికొత్త జిగురును తయారు చేశారు. సముద్రంలోని ఆల్చిప్పలు నీటి అడుగున దేనికైనా బలంగా అతుక్కుపోయే గుణం నుంచి ప్రేరణ పొంది దీన్ని రూపొందించడం విశేషం. ఈ పరిశోధన బృందానికి నాయకత్వం వహించిన సర్ రన్ రన్ షా ఆసుపత్రి అసోసియేట్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ లిన్ షాన్‌ఫింగ్ ఈ ఆవిష్కరణ వివరాలను పంచుకున్నారు. మేము కొత్తగా అభివృద్ధి చేసిన ఈ గ్లూ, కేవలం రెండు లేదా మూడు నిమిషాల్లోనే విరిగిన ఎముకలను అతికిస్తుంది. తీవ్రమైన రక్తస్రావం జరుగుతున్న ప్రదేశంలో కూడా ఇది ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. సాంప్రదాయ పద్ధతుల్లో ఎముకల ఆపరేషన్ చేయాలంటే రోగి శరీరానికి పెద్ద కోత పెట్టి, లోపల స్టీల్ ప్లేట్లు లేదా రాడ్లు అమర్చాల్సి ఉంటుంది. ఇది రోగికి తీవ్ర నొప్పితో పాటు, కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. కానీ, ఈ కొత్త బోన్ గ్లూను ఒక సూది ద్వారా సులభంగా విరిగిన ప్రదేశంలోకి ఇంజెక్ట్ చేయవచ్చు. దీనివల్ల పెద్ద కోతల అవసరం ఉండదు, ఆపరేషన్ సమయం గణనీయంగా తగ్గుతుంది. నీరు, రక్తం ఉన్న చోట కూడా ఇది తన పటుత్వాన్ని కోల్పోకుండా ఎముకల మధ్య బలమైన బంధాన్ని ఏర్పరుస్తుంది. ఈ ఆవిష్కరణ భవిష్యత్తులో ఆర్థోపెడిక్ చికిత్సల స్వరూపాన్నే మార్చేస్తుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రోగులకు నొప్పిలేని, సులభమైన చికిత్స అందించి, వారు త్వరగా కోలుకునేందుకు ఇది దోహదపడుతుంది. ప్రస్తుతం మరిన్ని క్లినికల్ ట్రయల్స్ నిర్వహించి, దీని భద్రతను, ప్రభావాన్ని పూర్తిగా నిర్ధారించే పనిలో శాస్త్రవేత్తలు నిమగ్నమై ఉన్నారు.

## మధ్యప్రదేశ్ సిఎంకు తృటిలో తప్పిన ప్రమాదం

**భోపాల్, సెప్టెంబరు 13:** మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్‌కు శనివారం నాడు తృటిలో ప్రమాదం తప్పింది. ఆయన ఎక్కేందుకు సిద్ధమవుతున్న హాట్ ఎయిర్ బెలూన్ కు మంటలు అంటుకున్నాయి. దీంతో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేయడంతో సీఎంకు ప్రమాదం తప్పింది. మంద్‌సౌర్‌లోని గాంధీ నగర్ ఫారెస్ట్ రిట్రీట్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి ఎయిర్ బెలూన్ ఎక్కడానికి సిద్ధమవుతుండగా బెలూన్ దిగువ భాగంలో మంటలు అంటుకున్నట్టు వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. భద్రతా సిబ్బంది మంటలను అదుపు చేసి, ముఖ్యమంత్రి ట్రాలీని పట్టుకో వడంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు. దీంతో వెంటనే ఆయణ్ని అక్కడి నుంచి భద్రతా సిబ్బంది తరలించారు. ప్రమాదం కాదన్న అధికారులు కాగా, ఈ ఘటనపై మంద్‌సౌర్ జిల్లా కలెక్టర్ అదితి గార్గ్ వివరణ ఇచ్చారు. మంటలు వచ్చినట్టు వచ్చిన కథనాలు పూర్తిగా తప్పని అన్నారు. బెలూన్‌ను పరిశీలించేందుకే సీఎం వచ్చారని, సీఎం బెలూన్ ఎక్కలేదని చెప్పారు. మంటలు రావడంపై మాట్లాడుతూ, బెలూన్‌ను లిఫ్ట్ చేసేందుకు అందులోని గాలిని హీట్ చేయడం అనేది స్టాండర్డ్ ప్రాసెస్ అని చెప్పారు. ఏడేళ్ల అనుభవం ఉన్న బెలూన్ పైలెట్ మహమ్మద్ ఇర్ఫాన్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. బెలూన్ కోసం ఎల్పీజీ, ఫైర్‌ప్రూఫ్ కెవ్లార్ మెటీరియల్ వాడతామని, పూర్తి భద్రతా ప్రమాణాలకు లోబడి ఈ ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

## రష్యాలో తీవ్రస్థాయి భూకంపం రిక్టర్‌స్కేలుపై 7.7గా నమోదు

**మాస్కో, సెప్టెంబరు 16:** రష్యాలోని కామ్‌చట్కా ద్వీపకల్పంలో ఇవాళ శక్తివంతమైన భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై ఆ భూకం ప్రతీవత 7.7గా నమోదు అయ్యింది. దీంతో అధికారులు సునామీ వార్నింగ్ జారీ చేశారు. అన్ని ఎమర్జెన్సీ సర్వీసులను హై అలర్ట్‌లో ఉంచారు. కామ్‌చట్కా ప్రాంతీయ రాజధాని పెట్రోపవలోస్క్‌లో భూకంప తీవ్రత 6.3గా ఉన్నట్లు గవర్నర్ వ్లాదిమిర్ సోలోడోవ్ తెలిపారు. బలమైన భూకంపం రావడంతో స్థానిక అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు. కీలక ప్రదేశాలను, రెసిడెన్షియల్ బిల్డింగ్‌లను తనిఖీ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి డ్యామేజ్ అయినట్లు రిపోర్టు కాలేదు. నివాసితులు జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు.

## బ్రిటన్‌లో సిక్కు మహిళపై లైంగిక దాడి

**లండన్, సెప్టెంబరు 13:** బ్రిటన్‌లో దారుణం చోటు చేసుకుంది. ఓల్డ్‌బరీ పట్టణంలో సిక్కు మహిళపై ఇద్దరు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. అనంతరం మీ దేశానికి వెళ్లిపో అంటూ బాధితురాలిని బెదిరించారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. దీంతో బాధితురాలి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా ఈ ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరా ఫుటేజ్‌లను పోలీసులు జల్లెడ పట్టారు. ఆక్రమంలో నిందితులను పోలీసులు గుర్తించారు. వారు శ్వేత జాతీయులని స్పష్టం చేశారు. వారి కోసంగాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు వివరించారు. గతవారంలో చోటు చేసుకున్న ఈఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస భారతీయులంతా మండిపడుతున్నారు.

# సంక్షిప్తంగా..

## కాంగోలో రెండు పడవ ప్రమాదాలు: 193 మంది జలసమాధి



**కిన్షాస, సెప్టెంబరు 13:** డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో జరిగిన రెండు వేర్వేరు పడవ ప్రమాదాలు 193 మందిని బలి తీసుకున్నాయి. మరి కొం దరు గల్లంతయ్యారని ఆ దేశ మీడియాసహా అధికారులు పేర్కొన్నారు. ఈక్వెటార్ ప్రావిన్స్‌కు 150 కిమీ దూరంలో బుధ, గురువారాల్లో ఈ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం లుకోలెలా భూభాగం నుంచి దాదాపు 500 మందితో ఓ పడవ బయలుదేరింది. ఈ దుర్ఘటనలో 107 మంది చనిపోయినట్లు కాంగో ప్రభుత్వం ప్రకటించింది. 209 మందిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. మలాంగే గ్రామానికి చెందిన పడవ సాయంతో ప్రయాణికులను ఒడ్డుకు చేర్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నివేదిక ప్రకారం 146 మంది గల్లంతయ్యారని ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ పేర్కొంది. అంతకు ముందు రోజు బసాన్‌కుసు ప్రాంతంలో ఓ పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 86 మంది మృతి చెందారు. అందులో ఎక్కువ మంది విద్యార్థులేనని తెలిసింది.

## కెనడా కార్మిక విధానంలో మార్పులు



**ఒట్టావా, సెప్టెంబరు 13:** తాత్కాలిక విదేశీ కార్మికుల విధానంలో మార్పులపై కెనడా సంకేతాలిచ్చింది. నిర్దిష్ట రంగాలు, ప్రాంతాల్లో ఎవరు పని చేయాలనే నిబంధనల్లో సంస్కరణలు తీసుకురానుంది. ప్రధాని మార్క్ కార్నీ ప్రకటనతో సాఫ్ట్‌వేర్, వైద్యరంగానికి చెందిన విదేశీ నిపుణులు ఆందోళన చెందుతున్నారు. శ్రమతో కూడిన పనులు చేసే వారికి మాత్రమే ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తే తమ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని భయపడుతున్నారు. తాత్కాలిక విదేశీ వర్కర్ల కార్యక్రమం ఒక 'కేంద్రీకృత విధానం'గా ఉండాలని పార్టీ కాకస్‌లో కార్నీ వ్యాఖ్యానించారు. అది కార్మిక అవసరాలను లక్ష్యంగా చేసుకొనేలా ఉండాలన్నారు. గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు, సామాజిక సేవారంగాలపై ఒత్తిడిని తగ్గించేలా మార్పులు అవసరమని పేర్కొన్నారు. శాశ్వత నివాసులు కాని వారి వాటాను తగ్గించాలని కార్నీ భావిస్తున్నారు. 2027 చివరికి జనాభాలో వారి వాటాను 7 నుంచి 5 శాతానికి తీసుకురావాలని ప్రణాళిక రచిస్తున్నారు. ఇది కార్యరూపం దాలిస్తే తాత్కాలిక కార్మికుల సంఖ్య భారీగా తగ్గనుంది.

## 13వ అంతస్తుపైనుంచి పడి తల్లీకొడుకు మృతి




**లక్నో, సెప్టెంబరు 13:** తల్లీకొడుకు ఇద్దరూ ప్రమాదవశాత్తు భవనం 13వ అంతస్తు నుంచి కిందపడి దుర్మరణం పాలయ్యారు. ఉత్తరప్రదేశ్‌లోని గౌతమ్‌బుద్ధ నగర్ లో శనివారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గౌతమ్‌బుద్ధనగర్‌లోని బిస్రక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోగల ఓ బహుళ అంతస్తుల భవనం 13వ అంతస్తులో దర్పన్ చావ్లా అనే వ్యక్తి తన భార్య, కుమారుడితో కలిసి నివాసం ఉంటున్నాడు. దర్పన్ చావ్లా కుమారుడైన 12 ఏళ్ల దక్ష్‌కు మతిస్థిమితం లేదు. దాంతో తల్లి అతడిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం దక్ష్ బిల్డింగ్ పైనుంచి దూకేస్తానని తల్లికి చెప్పి వేగంగా పరుగుతీశాడు. ఆ హఠాత్పరిణామాన్ని ఊహించని తల్లి కొడుకును కాపాడుకునేందుకు అంతే వేగంగా వెంటపడింది. దక్ష్‌ను అందుకునే ప్రయత్నంలో అతడితోపాటు కిందపడింది. ఈ ఘటనలో తల్లీకొడుకు ఇద్దరూ దుర్మరణం పాలయ్యారు.

## ఇది ప్రధానుల సంప్రదాయం కానేకాదు: ప్రియాంకగాంధీ



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 13:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. 2023లో ఈశాన్య రాష్ట్రంలో హింసాత్మక ఘర్షణల తర్వాత మోదీ ఇక్కడ పర్యటించడం ఇదే తొలిసారి. ఈ నేపథ్యంలో మోదీ పర్యటనపై విప క్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మణిపూర్ పర్యటనపై కాంగ్రెస్ అగ్రనాయకురాలు, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా తీవ్ర విమర్శలు చేశారు. ఘర్షణలు చోటు చేసు కున్న రెండేండ్ల తర్వాత రాష్ట్రంలో మోదీ పర్యటించడం దురదృష్టకరమన్నారు. వయనాడ్ పర్యటనలో ఉన్న ప్రియాంక గాంధీ అక్కడ విలేకరులతో మాట్లాడారు. ఆయన ఇప్పటికే అక్కడ పర్యటించి ఉండాల్సింది. భారత్ లోని ప్రధానమంత్రుల సంప్రదాయం ఇది కాదు.

# వచ్చే అక్టోబర్ నాటికి బందరుపోర్టు అందుబాటులోకి తెస్తాం

## : రవాణా రహదారుల భవనాల శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి యం.టి.కృష్ణబాబు



మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కృష్ణబాబు

**గన్నవరం(కృష్ణా), సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనులు వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తిచేసి పోర్టునుండి కార్యకలాపాలు ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు వేగవంతం చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా రహదారుల భవనాల శాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి యం.టి.కృష్ణబాబు తెలిపారు. శనివారం ఉదయం ఆయన అధికారులతో కలిసి బందరుపోర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. నార్త్, సౌత్ బ్రేక్‌వాటర్, డ్రెడ్జింగ్, బెర్తులు, రహదారులు, పరిపాలనా భవనాలు, గిడ్డంగుల నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే యంత్రాలు, మానవ వనరులను పెంచి నిర్దేశిత సమయానికి పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రూ.5,500కోట్ల ఖర్చుతో చేపట్టిన పోర్టు నిర్మాణ పనులు వచ్చే ఏడాదికి పూర్తిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం నిర్దేశించారని, ఈమేరకు బ్రేక్‌వాటర్, బర్తులు, డ్రెడ్జింగ్ పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇక్కడ మొత్తం 16 బెర్తులు నిర్మించాల్సి ఉండగా ఫేజ్ 1లో నాలుగు బెర్తులు పూర్తిచేస్తున్నట్లు చెప్పారు. దీనికి అనుబంధంగా పోర్టుకి రహదారులు అనుసంధానం చేసేందుకు జాతీయరహదారుల సంస్థతోనూ, కేంద్రంతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అమరావతి అవుటర్‌రింగ్‌రోడ్డు వచ్చే ఏడాది మార్చిలోగా అవార్డు జారీచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విజయవాడ నుండి మచిలీపట్నంరోడ్డ అభివృద్ధిపనులు చేపడుతున్నామన్నారు. దీనితోపాటు వినన్నపేట-పెడన రహదారి విస్తరణ కోసం ఇప్పటికే డిపిఆర్‌ను కేంద్రప్రభుత్వానికి పంపించామని ఇవి పూర్తయితే మచిలీపట్నంకు రోడ్ కనెక్టివిటీ పెరుగుతుందన్నారు. మిగిలిని మూడితో పోల్చితే హార్బర్ పనులు మందకొండిగా సాగుతున్నాయన్నారు,

## వాడపల్లి క్షేత్రానికి లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో , సెప్టెంబర్ 13,(ప్రభాతవార్త)** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి శనివారం లక్షలాది భక్తులు తరలివచ్చి స్వామివార్ని దర్శించుకున్నారు. రెండవ శనివారం సెలవు దినం కావడంతో భక్తుల రద్దీ పెరగడంతో మాడ వీదులు జనసంద్రంగా మారాయి. సుమారు లక్షకు పైగా భక్తులు రావడంతో వాడపల్లి క్షేత్రం భక్త జనంతో కిక్కిరిసింది. మాడవీధులన్నీ గోవింద నామ స్మరణతో మారుమ్రోగాయి. ఉదయం సుప్రభా సేవతో మొదలైన స్వామి వారి దర్శనాలు రాత్రి పదిగంటలవరకు కొనసాగాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా క్యూలైన్లలో భక్తులకు మంచినీళ్ల సదుపాయం, చిన్నపిల్లలకు పాలు, బిస్కెట్లు, వృద్ధులకు గర్భిణీ స్త్రీలకు ఉచితంగా బ్యాటరీ కార్లలో పార్కింగ్ నుంచి గుడి వరకు వెళ్లే సదుపాయం,మెడికల్ క్యాంపులు తదితర సౌకర్యాలను ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు.

# దసరా ఏర్పాట్లు - క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలన



క్యూలైన్లు పరిశీలిస్తున్న కలెక్టర్

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ వారి ఆలయంలో ఈ నెల 22 నుండి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి కావాల్సిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ ఏర్పాట్లను కలెక్టర్ డా లక్ష్మీషా శనివారం ఇఓ వికె శీనా నాయక్ , ఏడిసిపి రామకృష్ణ, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఇంజనీర్లు కెవిఎస్ఆర్ కోటేశ్వరరావు, రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుండి జరగబోయే దసరా ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఆర్జిత సేవలైన ప్రత్యేక ఖడ్గమాలార్చన (రు.1500), ప్రత్యేక కుంకుమార్చన (రు.1500), ప్రత్యేక చండీయాగం (రు.1500), ప్రత్యేక శ్రీచక్రనవణార్చన (రు.1500) సేవల్లో పరోక్షంగా పాల్గొనటానికి వీలుగా మార్గదర్శకాలను ప్రతిపాదిస్తూ టికెట్లను రూపొందించాలని దేవదాశాఖ కమీషనర్ ఐటి విభాగానికి ఆదేశాలిచ్చారు. అలాగే పైన తెలిపిన ఆర్జిత సేవలన్నింటికి పది రోజులకు గాను రు.11,116లు (ఒక టికెట్‌పై ఒక్కరికి మాత్రమే) రుసుము నిర్ణయిస్తూ ఆదేశాలిచ్చారు. పరోక్ష సేవల్లో పాల్గొనే భక్తులు టికెట్లను దేవస్థానం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా గాని, ఏపి ప్రభుత్వ వెబ్‌సైట్, మనమిత్ర యాప్ ద్వారా గాని విక్రయించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. పరోక్ష టికెట్లు పొందిన వారు వర్చువల్‌గా మాత్రమే సేవలో పాల్గొనవలసి వుంటుందని వివరించారు.

# శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు - కదలి వచ్చిన భక్త జనం

**శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 13 ప్రభాతవార్త** శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయం భక్తులతో కిట కిట లాడింది. వరుస సెలవులతో తండోప తండాలుగా కదలి తరంగాల్లా భక్తులు కదలి వచ్చా రు. ఆలయంలో వెలసిన శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. కాగా అభయ వెంకటేశ్వరునికి ప్రత్యేకాలంకారాలు జరిపారు. వచ్చిన భక్తులు క్యూలైన్లలో నిరీక్షించకుండా ఇఓ డి.బాపిరెడ్డి ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆలయంలోనూ, పట్టణంలో ఎటు చూసినా భక్తుల సందడికనబడింది. వ్యాపార సంస్థలు హోటళ్ళు కిట కిట లాడాయి. ఉదయం నుంచి ఆలయంలో వరదలా భక్తులు కదలి వచ్చారు.రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలు జరుపుకున్న భక్తులకు దర్శనానికి దక్షిణామూర్తి ఆలయం పక్క నుంచి ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేసి సత్వర దర్శనంకు అవకాశం కల్పించారు. విఐపిల తాకిడి అధికమైంది. సామాన్య భక్తులు గంటల తరబడి స్వామి అమ్మవార్ల దర్శనానికి నిరీక్షించాల్సి వచ్చింది. ఒక్కసారిగా ఆలయానికి భక్తుల వరదలా రావటంతో కొందరు భక్తులు తోసులాటకు అవకాశం కల్గింది. ఆలయంలో ఎవరు సామాన్యభక్తులో ఎవరు విఐపిలో అర్థం కాని పరిస్థితి చోటు చేసుకుంది. ఆలయాధికారులు ఎన్నో సంస్కరణలు ప్రవేశ పెడుతున్నా దళారులు, అక్రమ సంపాదన పరులు మరో దారి ఎంచుకున్నారు. శనివారం క్యూలైన్లలో ఉన్న సామాన్యభక్తులు అంతరాలయ దర్శనానికి వెళుతున్న వారికి సంబంధించి వారిని ఎందుకు అనుమతిస్తున్నారని ప్రశ్నించటం కనబడింది. ఆలయంలో మధ్యాహ్నం 1గంటకు డ్యూటీలు మారుతారు.



కాళహస్తీశ్వరాలయంలో దర్శనం కోసం నిరీక్షిస్తున్న జనం

షిఫ్టుల్లో పని చేసే వారు మారటం జరుగుతుంది. ఈ సమయంలో పూజలకు కూర్చొన్న భక్తులు అసహానానికి గురౌతున్నారు.

మధ్యా హ్నం డ్యూటీకి వచ్చే వేదపండితులు ఆలస్యంగా రావటంతో భక్తుల్లో అసంతృప్తి చోటు చేసు కుంటుంది. డ్యూటీకి వచ్చే వారు కొంత ముందు వస్తే ఈ సమస్య ఉండదు.

# అమరావతిపై వైఎస్సార్సీ నేతలవి అవాస్తవాలు

## తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్



టిడిపి కార్యాలయంలో మాట్లాడుతున్న తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 13:** అమరావతి రాజధాని విషయంపై అందితే జుట్టు, అందకపోతే కాలు అన్న చందాన వైసీపీ నాయకులు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ...వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అమరావతి రాజధానిపై తప్పుడు ప్రచారం చేసి, ఇప్పుడేమో అమరావతే రాజధానిగా ఉంటుందనడం వారి నక్కజిత్తులను తెలియజేస్తోంది. అప్పుడేమో అమరావతిని భ్రమరావతి అన్నారు. ఇప్పుడు అమరావతే రాజధానిగా ఉంటుందని నక్క వినయాలు ప్రదర్శిస్తున్నారు. దీన్ని బట్టి మోసానికి ప్రతిరూపం జగన్ అని అనిపిస్తోంది. వైసీపీ నాయకుల మాటలకు విశ్వసనీయత లేదు, మాట మారుస్తారు, మడమ తిప్పుతారు. నక్క జిత్తులను ప్రదర్శిస్తారు. ఇటీవల జరిగిన వేటు న్యూస్ కాంక్లేవ్ లో వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. అమరావతి రాజధాని మీద కొత్త భాష్యం చెప్పారు. అసలు సజ్జల అర్హత ఏమిటి? గతంలో తాడేపల్లి గ ౕ ం వ ం సా ్త గా పేరుపొందాడు. ఇప్పుడు నో టి కొ చ్చి న ట్ల మాట్లా డు తు న్నా రు. అమరావతే రాజధానిగా ఉంటుందంటున్నారు. 2019 లో జగన్ మాట్లాడిన మాటలను మరోసారి సజ్జల చెప్పారు. 2019లో జగన్ కు అమరావతే రాజధాని గా ఉంచాలని ఆలోచించాడని 2024 లో విశాఖపట్నం రాజధానిగా ఉంటుందని, అక్కడ నుంచి పరిపాలన సాగించాలని అనుకున్నాడని అన్నారు. అయితే ప్రస్తుతం మళ్లీ , 2029 ఎన్నికల తర్వాత అమరావతి నుంచే పరిపాలన సాగిస్తారని చెప్పారు. ఇలా ఇన్ని రకాలుగా మాట్లాడారు. సజ్జల ఈ వేటు న్యూస్ కాంక్లేవ్ కార్యక్రమంలో నాలుక మడతేసే మాటలు మాట్లాడారు. వీటన్నింటిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారు. విధానపరమైన విధానాలు ప్రకటించే హక్కు సజ్జలకు లేదు. ఒకవేళ మాట్లాడాలంటే జగన్ మాట్లాడాలి. జగన్, సజ్జల లు మోసానికి ప్రతిరూపం. సజ్జల ప్రజల్ని మరోసారి మోసం చేయడానికి సిద్ధమయ్యారని ఆయన ప్రకటన ద్వారా తెలుస్తోంది. 201419 కాలంలో అసెంబ్లీ లో రాజధాని నిర్ణయం జరుగుతున్నప్పుడు రాజదానికి సంబంధించి జగన్ మాట్లాడుతూ.. అసలే రాష్ట్రం చిన్నదైంది. ప్రాంతాలమధ్య చిచ్చు పెట్టదలచుకోలేదు. రాజధానిని గుంటూరు విజయవాడ మధ్య ఎక్కడైనా పెట్టండి.. కనీసం 30 వేల ఎకరాలకు తగ్గకుండా చూడండి అన్నారు. వైసీపీ సంపూర్ణంగా మద్దతిస్తోందని చెప్పారు. 2019 ఎన్నికలకు వెళ్తున్నప్పుడు అమరావతి ప్రాంతంపై జగన్ కు ప్రేమ ఉంది

## యేడాది అయినా ఎవరికీ దక్కని శివయ్య సేవా భాగ్యం

**శ్రీకాళహస్తి,జూన్ 11 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పార్టీ పదవులు తప్ప నామినేటెడ్ పదవులు ఏడాది అయినా దక్కలేదు. ఇక్కడ శాసనసభ్యుడు ఏ నిర్ణయం తీసుకోవాలన్నా, ఇతర పదవులు ఎవరికి ఇవ్వాలనే అంశం శ్రీకాళహస్తీశ్వరుని పాలకమండలి నియామకం మీద ఆధారపడి ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న కీలక నామినేటెడ్ పదవులు ఒక్క శ్రీకాళహస్తీశ్వరాలయమే. అయితే ఏడాదిన్నరగా అదిగో ఇదిగో అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దేవస్థానం పదవులకు సంబంధించి ఊరిస్తున్నారు. మహానాడుకు ముందు అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ చేస్తామంటూ ప్రకటించారు.కానీ మహానాడు అయి రెండు నెలలు దాటుతున్నా దేవాలయాల పదవుల భర్తీకి మోక్షం లభించలేదు. శ్రీకాళహస్తీశ్వరాలయం పదవిని కష్టకాలంలో తనతో పాటు నడచిన మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి అధ్యక్షుడు రంగినేని చెంచయ్య నాయుడుకే అని శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పలుమార్లు ప్రకటించారు.

## 'సూపర్ సిక్స్ సూపర్ హిట్' తో వైసిపిలో వణుకు

### టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద్ సూర్య

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, సెప్టెంబర్ 13:** సూపర్ సిక్స్ సూపర్ హిట్‌తో వైసీపీలో వణుకు పుడుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేమూరి ఆనంద్ సూర్య అన్నారు. ఈ సందర్భంగా మంగళగిరిలో తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ"సూపర్ సిక్స్ - సూపర్ హిట్" కార్యక్రమం అనంతపురంలో విజయవంతమవడంతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని వ్యాఖ్యానించారు."కూటమి ప్రభుత్వం తీసుకున్న పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి. అందుకే జగన్ రెడ్డి, వైసీపీ నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నార్శు అని అన్నారు. సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సా హం :"సెప్టెంబర్ 10న అనంతపురంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్, బీజేపీ నేత మాధవు పాల్గొన్న మహాసభలో లక్షలాది ప్రజలు గుమికూడారు. అక్కడ ప్రజలు కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలపై హర్షం వ్యక్తం చేశారు. అదే సమయానికి వైసీపీకి వెన్నులో వణుకు పుట్టింది. 151 సీట్లు గెలిచి అధికారంలోకి వచ్చిన జగన్ పార్టీ ఇప్పుడు 11కి పడిపోయే స్థితిలో ఉందని స్పష్టమైంద్హి అని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం :"ప్రతి నెల ఒకటవ తేదీకి 64 లక్షల మందికి ఇంటి గుమ్మం వద్దకే పెన్షన్లు అందుతున్నాయి. ఇప్పటివరకు ఈ పథకానికి రూ.45 వేల కోట్లు కూటమి ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇదే చంద్రబాబు నాయకత్వంలోని నిబద్ధత" అని ఆయన తెలిపారు. స్త్రీ శక్తి పథకం :"మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు ఐదు కోట్ల ప్రయాణాలు జరిగాయి. దీని వలన కుటుంబాలకు 200 కోట్లు ఆదా అయ్యాయి. ఈ పథకం మహిళల జీవితాల్లో పెద్ద మార్పు తీసుకొచ్చింద్హి అని వివరించారు. దీపం-2 పథకం :"రూ.1704 కోట్లతో 2.45 కోట్ల సిలిండర్లు రాష్ట్ర ప్రజలకు అందించాం. ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. ఈ పథకం వల్ల పేదలకు ఊరట లభిస్తోంది" అని చెప్పారు. అన్నదాత సుఖీభవ :"జగన్ పాలనలో రైతులకు ఇచ్చింది కేవలం 13,500 రూపాయలే. అందులోనూ 38 లక్షల మందికే పరిమితం.

# లేపాక్షి హస్తకళల ప్రదర్శనలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ విద్యార్థులు



లేపాక్షి చిత్ర కళా ప్రదర్శనను తిలకిస్తున్న విద్యార్థినిలు

**విజయవాడ, సెప్టెంబర్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** లేపాక్షి హస్తకళల డిజైన్ పోటీ, మాస్టర్‌పీసెస్ ఎగ్జిబిషన్‌లో యువ డిజైనర్ల స్వరాలు ప్రతిధ్వనించాయి. జాతీయ డిజైన్ సంస్థ ఆంధ్రప్రదేశ్ కి చెందిన 25 మంది విద్యార్థులు సంప్రదాయ హస్తకళల ఆభిరుచిని ఆస్వాదిస్తూ శనివారం లోతైన అధ్యయనం చేశారు. టెక్స్‌టైల్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, కమ్యూనికేషన్ డిజైన్ వంటి విభాగాల్లో ప్రత్యేకత కలిగిన విద్యార్థులు ప్రదర్శనలోని కళాఖండాలను పరిశీలించి - డిజైన్, నాణ్యత, వినియోగ ప్రయోజనాలు, ప్రజెంటేషన్ అంశాలపై విశ్లేషణ జరిపారు. నైపుణ్యం కలిగిన కళాకారుల ప్రతిభను ప్రశంసించిన వీరు, ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా సంప్రదాయాన్ని కాపాడుకుంటూ కొత్త ఆలోచనలు అందించారు. ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ (లేపాక్షి ) ఎండి విశ్వ మనోహరన్ రాష్ట్ర హస్తకళా రంగంలో నూతనత్వాన్ని ప్రవేశపెట్టేందుకు చేపట్టిన భాగస్వామ్య కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల సందర్శన నిర్వహింపచేశారు. విద్యార్థులు కళాకారులు, సందర్శకులతో చర్చించి - డిజైన్ మెరుగుదలలు, ఆధునిక ప్యాకేజింగ్, మార్కెటింగ్ వ్యూహాలపై తమ సూచనలు ఇచ్చారు. ఇది మాకు నేర్చుకునే అవకాశం మాత్రమే కాదు, కళాకారుల కృషికి విలువ చేకూర్చే డిజైన్ ఆలోచనలను పంచుకునే అవకాశం కూడా," అని ఒక విద్యార్థి అభిప్రాయపడ్డారు. సంప్రదాయ హస్తకళలను సంరక్షిస్తూ వాటిని గ్లోబల్ మార్కెట్‌కు తీసుకెళ్లే ప్రభుత్వ కట్టుబాటును ఈ ప్రయత్నం ప్రతిబింబిస్తోంది.

విద్యార్థులతో పాటు ఫ్యాకల్టీ డిజైన్ ఫౌండేషన్ విభాగం అధ్యాపకురాలు స్వాతి పాండే సిన్హా కూడా పాల్గొన్నారు.



గాయపడ్డ సెక్షన్ ఆఫీసర్ సుకుమార్

## అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్‌పై ఏనుగు దాడి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స

**పలమనేరు టౌన్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం మండలాల్లో ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. శనివారం తెల్లవారు జామున 6గంటల సమయంలో రొంటకుంట్ల గ్రామం వద్ద నేషనల్ హైవే పక్కనే ప్లై ఓవర్ వద్ద ఈ ఏనుగు ప్రత్యక్ష మైంది. వాకింగ్ వెళ్ళే వారు ఈ విషయం గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన సెక్షన్ ఆఫీసర్ సుకుమార్ సిబ్బందితో వెళ్ళి ఏనుగును దూరం నుంచి అడ్డుకున్నారు. సమీపంలోని అటవీ ప్రాంతంలోకి తరిమి వేయాలని ప్రయత్నించగా ఎదురు తిరిగింది. హటాత్తుగా దాడి చేసి తొండంతో ఎత్తి విసిరి వేసి కాళ్ళతో తొక్కింది. దీంతో కాలు చెయ్యి విరిగి ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. అటవీ శాఖ సిబ్బంది గ్రామస్తులు అరచి కేకలు వేయగా ఏనుగు పరుగులు తీసింది. గ్రామస్తులు తప్పెట్లు, బాణ సంచా కాల్పులతో వెంబడించగా పంట పొలాల వెంబడి దాదాపు 4 గంటల పాటు ముప్పు తిప్పలు పెట్టింది. చివరకు 11 గంటల సమయంలో పాత కీలపట్ల రహదారి నుండి పలమనేరు పక్కనే ప్లై ఓవర్ కిందకు వచ్చి గంటావూరులో ప్రవేశించింది. అక్కడే ఎంబిటి రోడ్డులో ఉన్న బొమ్మల తయారీ దారులు దుకాణాలు వదిలి పరుగులు తీశారు. చివరకు గొబ్బిళ్ళ కోటూరు పక్కనే అటవీ ప్రాంతం లోకి వెళ్ళి పోయింది. గాయపడ్డ సెక్షన్ ఆఫీసర్‌ను అటవీశాఖ వాహనంలో పలమనేరు ప్రభుత్వ ఆసు పత్రికి తరలించారు. కాలు చెయ్యి విరిగినట్లు వైద్యులు దృవీకరించడంతో మెరుగైన చికిత్స కోసం రూయా ఆసుపత్రి తరలించారు.

## జనాభా ప్రాతిపదికగా కాపు రిజర్వేషన్లివ్వాలి

### రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు

**విజయవాడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** జనాబా ప్రాతిపదికన కాపులకు రిజర్వేషన్లు ఇవ్వాలంటూ కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు డిమాండ్ చేశారు. శనివారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 12శాతం వున్న కాపులకు ప్రత్యేక రిజర్వేషన్లు 12శాతం కూటమి ప్రభుత్వం ఇవ్వాలన్నారు. బిసిలకు 34శాతం, ఇతర అగ్రకులాల పేదలకు 10శాతం ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్లు ఇస్తున్న కూటమి ప్రభుత్వం కాపులపట్ల ద్వంద్వ నీతిని విడనాడి ప్రత్యేక రిజర్వేషన్లివ్వాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ రావి శ్రీనివాస్, కోఆర్డినేటర్ జానపాముల నాగబాబు, కో కన్వీనర్స్ బోడ పాటి పెదబాబు, కాకిలేటి హరనాథ్, సోషల్ జస్టీస్ ఫోరం రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ జంగాల సింగారయ్య యాదవ్, నేతలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### విఆర్ఓ అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు

**విజయవాడ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ చేసిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర విఆర్వో అసోసియేషన్ అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కోరారు. ఉద్యోగులకు పెండింగ్ డిఎలు, పిఆర్‌సి కమీషన్, ఐఆర్, పాత బకాయిలు విడుదల చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ అమలుకు చిత్తశుద్ధితో కృషి చేసిన ఉద్యోగులకు ఈ దసరా కానుకగా తీపి కబురు చెబుతారని ఆశాభావాని ్న వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఓపిఎస్ పై తగు నిర్ణయం ప్రకటించాలని సిఎం చంద్రబాబు నాయుడును, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కోరారు. ఉద్యోగులకు రు.25వేల కోట్ల బకాయిలు విడుదల చేయకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్న జెఎసి వారి భాగోతం మొత్తం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలుసునని, ఆ నేతలు గత ప్రభుత్వ హయాంలో నోరు మెదపకుండా, ఇపుడు కూటమి ప్రభుత్వం గౌరవాన్ని అప్రదిష్ట చేసేలా మాట్లాడుతున్నారన్నారు. వారికి కూటమి ప్రభుత్వం భయపడబోదన్నారు. ఒక సీనియర్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉద్యోగులకు తీపి కబురు చెపుతారన్నారు.

# కన్నుల పండువగా గణనాధుని పుష్పపల్లకిసేవ

**కాణిపాకం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాలలో భాగంగా శనివారం పుష్పపల్లకిసేవను వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకం బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో ముఖ్యమైన సేవల్లో పుష్పపల్లకిసేవ ఒకటి. ఈకార్యక్రమానికి శ్రీమతి.కె. భాగ్యలక్ష్మమ్మ, చిగరపల్లె, ఎన్.దామోదర్‌నాయుడు మరియు కుటుంబసభ్యులు కాకర్లవారిపల్లె , కె.మోహన్‌నాయుడు అండ్ బ్రదర్స్, చిత్తూరు, కీ॥శే॥ఆర్. శేషాద్రినాయుడు అండ్ బ్రదర్స్, వి.టి.రాజన్ బ్రదర్స్,తిరువణంపల్లె, ఎం.రామనాథం నాయుడు, తిరువణంపల్లె, జి.కృష్ణమనాయుడు అండ్ సన్స్, అడపగుండ్లపల్లె, ఎ.నరసింహారెడ్డి అండ్ సన్స్,అగరంపల్లె, కీ॥శే॥ఎం.రాజారెడ్డి అగరంపల్లె, కీ॥శే॥యం.శ్రీరాములురెడ్డి అగరంపల్లె, కీ॥శే॥యం.బాలకృష్ణారెడ్డి అండ్ కో చిత్తూరు, మొగిలీశ్వర ఏజన్సీస్, చిత్తూరు, జి.శేషయ్యనాయుడు అండ్ సన్స్ చిత్తూరు, బి. కుమరేం ద్ర చౌదరి, సి.ఎ.చిత్తూరు, యం.మనోహర్‌నాయుడు అండ్ బ్రదర్స్ అడపగుండ్లపల్లె, జి.ఆంజనేయులు నాయుడు అండ్ సన్స్ చింతగుంపలపల్లెలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈమేరకు వారు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు ఘనంగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి చందనాలంకారం చేసి వివిధరకాల పుష్పాలతో అలంకరి ంచి ప్రత్యేక పూజలు చేసి ధూపదీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. తిరిగి రాత్రి సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలోవుంచి వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల దేశీయ, విదేశీజాతి పుష్పాలు, రంగురంగుల విద్యుద్దీపాలతో దేధీప్యమానంగా భారీ ఎత్తున ఏర్పాటు చేసిన ప్రత్యేక పుష్పపల్లకిపై స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అధిష్టింపజేసి మరోమారు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

## బాటిల్ మూత గొంతులో ఇరుక్కుని చిన్నారి మృతి

**గుత్తి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా గుత్తి పట్టణ శివారు ప్రాంతంలో వున్న కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌టిపిసి క్వార్టర్స్‌లో ప్రమాదవశాత్తు ఓ చిన్నారి బాటిల్ మూత మింగి మరణించాడు. వివరాలు ఇలా వున్నాయి. ఏపి ట్రాన్స్‌కోలో ఏడిఇగా విధులు నిర్వహిస్తున్న మౌనిక ఎన్‌టిపిసిలో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి విధుల నిర్వహణలో వుండగా కుమారుడు రక్షతరామ్‌కు ఆడుకోవటానికి నీటి బాటిల్ ఇచ్చారు. అయితే ఆ చిన్నారి ప్లాస్టిక్ బాటిల్ మూతను నోట్లో పెట్టుకోవడంతో అది కాస్త గొంతులో ఇరుక్కుపోయింది. గమనించిన చిన్నారి తల్లి హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆ బాలుడు మృతి చెందాడు. దీంతో ఆమె రోధనతో ఆసుపత్రి దద్దరిల్లిపోయింది. ముక్కు పచ్చలారని చిన్నారి మృతి ఆసుపత్రి వర్గాలను సైతం కలచి వేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరు మహిళల అపహరణ యత్నం!

## - మహిళ అప్రమత్తతో బెడిసికొట్టిన రౌడీషీటర్ దురాగతం


**తిరుపతి,సెప్టెంబర్ 13ప్రభాతవార్తప్రతినిధి:** వివాహేతర సంబంధం కలిగిన ఓ వ్యక్తి చివరకు తల్లీ కుమార్తెలను అపహరణచేసి కారులో తరలిస్తుండగా ,అప్రమత్తమైన మహిళ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బెడసికొట్టింది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి తిరుపతినగరంలో చోటుచేసుకుంది. తిరుపతి నగరంలోని లక్ష్మీపురంకూడలిలో అజీమ్ జిమ్ నిర్వహిస్తున్నాడు. ఇతను నారాయణపురంకు చెందిన ఓ మహిళ(40)తో వివాహేతర సంబంధం కలిగివున్నాడు. వీరిమధ్య చిన్నచిన్న గొడవలు జరిగేవి. భర్తకు విషయం తెలిస్తే నా కాపురం నాశనం అవుతుందని పదపదే ఆమె చెప్పినా వినిపించుకోని అజీమ్ ఇటీవల ఓ కేసులో జైలుకెళ్ళాడు. జైల్లో ఉన్న అజీమ్ నాలుగురోజుల క్రిందట విడుదలై వచ్చాడు. రావడంతోనే మళ్ళీ ఆ మహిళతో ఫోన్‌లో వివాహేతర సంబంధం విషయంగా మళ్ళీ కొనసాగించాలని చూశాడు. తనకు పూర్తిగా సహకరించకుంటే ఈ విషయం భర్తకు చెప్పి కాపురం నాశనం చేస్తానని బెదిరించాడు.అంతేగాక నా మాట వినకుంటే ఇద్దరు పిల్లలను చంపేస్తానని బెదిరించాడని పోలీసులు తెలిపారు.చేసేదిలేక ఆ మహిళ తల్లితో కలసి జిమ్‌వద్దకు వెళ్ళింది. దీన్ని అదనుగా తీసుకున్న నిందితుడు వెంటనే కారులో వారిద్దరినీ బలవంతంగా తీసుకుని వెళ్ళాడు. అప్పటికే అతని పరిస్థితి బాగోలేకపోవడంతో కారును వేగంగా నడిపి తిరుపతిలోని పలు వీధుల్లో నడుపుతూ పార్కింగ్‌లో ఉన్న రెండు కార్లు, ద్విచక్రవాహనాలను ఢీ కొన్నాడు. దీంతో కొంత తేరుకున్న మహిళ తన సెల్‌ఫోన్‌నుండి లొకేషన్‌ను పోలీసులకు, భర్తకు తెలియజేసింది. వెంటనే రాత్రి గస్తీలో ఉన్న అలిపిరి సిఐ రామకిశోర్, సిబ్బంది రంగంలోకి దిగి కారును వెంబడించారు. పోలీసులు రాకతో కారును వదలి పరారవుతున్న అతనిని అదుపులోకితీసుకున్నారు. కారును సీజ్ చేశారు. ఇద్దరు మహిళలను కిడ్నాపర్‌బారినుండి కాపాడారు. పోలీసుల సమయస్ఫూర్తి, సకాలంలో వేగంగా స్పందించడంతో నిందితుడు కిడ్నాప్ యత్నం బెడసికొట్టింది. అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

## మెరుగైన రహదారుల కల్పనే లక్ష్యంగా భవిష్యత్తు కార్యాచరణ : మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి

**విజయవాడ,సెప్టెంబరు 13,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రహదారుల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతుందని రాష్ట్ర రోడ్లు. భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రహదారుల మరమ్మతులు, అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, రాబోయే రోజుల్లో ఆర్ బీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణ ప్రణాళికపై ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో మొత్తం 45,433 కి.మీ ఆర్ బీ శాఖ పరిధిలో రహదారులు ఉండగా.. అందులో దాదాపు 31,854 కి.మీ రహదారులకు మరమ్మతులు చేయాల్సి అవసరం ఉంది.. ప్రస్తుతం రాష్ట్రంలో మరమ్మతులు చేపట్టాల్సి ఉన్న దాదాపు 31,854 కి.మీ రోడ్లకు సంబంధించి.. ఇప్పటికే ఎన్‌డిబి, సీఆర్‌ఎఫ్ ప్లాన్ కింద రద్దు చేయబడిన రహదారులు మరమ్మతులు చేయడానికి వీలు లేకుండా దెబ్బతిన్న సీ కేటగిరీ కింద రహదారులు కలిపి మొత్తంగా 6,333 కి.మీ రోడ్లు ఉన్నాయి.. వీటిలో మరమ్మతులు చేయాల్సి ఉన్న రహదారులు 25,521 కి.మీ మేరకు ఉన్నాయి.. ఈ 25,521 కి.మీ రహదారుల్లో ప్రస్తుతం తీవ్రంగా దెబ్బతిని తక్షణం మరమ్మతులు చేయాల్సిన 5950 కి.మీ రహదారుల మరమ్మతులు చేయడానికి వివిధ డివిజన్ల నుంచి రూ. 620 కోట్ల ప్రతిపాదనలు వచ్చాయి.వాటిలో రూ. 500 కోట్లతో ఆయా మరమ్మతులు పూర్తి చేయడానికి అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసుకోవడం జరిగింది... మిగిలిన 19,571 కి.మీ రహదారులను వార్షిక మెయింటెనెన్స్ కింద అభివృద్ధి చేయాల్సి ఉంది.

# కేంద్ర 8వ వేతన సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలి



## - జాతీయ మహాసభల్లో ఎన్‌ఎఫ్ఐఆర్ డిమాండ్

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబరు 13,ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం తక్షణం 8వ కేంద్ర వేతన సంఘాన్ని ఏర్పాటు చేయాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే మెన్ (ఎన్ఎఫ్ఐఆర్) జాతీయ ప్రధాన కార్యదర్శి డా. మర్రి రాఘవయ్య, దక్షిణ మధ్య రైల్వే జోనల్ కార్యదర్శి ఎం భరణి భానుప్రసాద్‌లు డిమాండ్ చేశారు. ఇటీవల న్యూఢిల్లీలో ఎన్ఎఫ్ఐఆర్ 31వ జాతీయ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి తరలివచ్చిన రైల్వే కార్మికులనుద్దేశించి వారు మాట్లాడుతూ రైల్వేలో ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలకు స్వస్తి పలకాలని కోరారు. ఏటా పెరుగుతున్న నూతన రైలు మార్గాలు, విద్యుదీకరణ, కొత్త రైళ్లవంటి మౌలిక సదుపాయాలకు అనుగుణంగా రైల్వేలో యాక్ట్ అప్రెంటిస్ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులచే వారి వారి విద్యార్హతల మేరకు సబ్‌స్టిట్యూట్‌లుగా నియమించుకుని సిబ్బందిపై పని భారాన్ని తగ్గించాలని సూచించారు. రైల్వే భద్రతా విభాగాలలో, నాన్ సేఫ్టీ కేటగిరీలలోని పోస్టులను భర్తీ చేయాలని, పోస్టుల రద్దు నిర్ణయాలను ఉపసంహరించుకోవడంతో పాటు కొత్త పోస్టుల భర్తీపై ఉన్న నిషేధాన్ని ఎత్తి వేయాలని కోరారు. ఉత్పాదకంతో కూడిన బోనస్ పైగల సీలింగ్‌ను ఎత్తివేయాలని, కోవిడ్-19నెపంతో, 2020జనవరి నుంచి 2021జూన్ వరకు స్థంభింపచేసిన మూడు విడతల కరువు భత్యాన్ని తక్షణం విడుదల చేయాలన్నారు. పాత పెన్షన్ పథకాన్ని తక్షణం పునరుద్ధాటించాలని కోరారు.

14-09Pg7exHMNWJQE 11_14-09Pg7exHMNWJQE.qxd 9/13/2025 11:57 PM Page 1





ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న దాసోజు శ్రవణ్

# కేబుల్ వైర్లు కట్‌చేస్తే ప్రభుత్వ పవర్‌ను కట్ చేస్తాం

### ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్ల మహాధర్నా

**హైదరాబాద్ (ధర్నాచౌక్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** కేబుల్ ఆపరేటర్ వృత్తిని దెబ్బతీస్తూ ప్రభుత్వం రాత్రికిరాత్రే కేబుల్ వైర్లు కట్ చేయించటం దుర్మార్గమని, ఇంకోసారి కేబుల్‌వైర్లు కట్‌చేస్తే ప్రభుత్వ పవర్‌ను కట్ చేస్తామని పలువురు వక్తలు హెచ్చరించారు. శనివారం రాష్ట్రవ్యాప్తంగా కేబుల్‌వైర్లను కట్ చేయటాన్ని నిరసిస్తూ ఫెడరేషన్ ఆఫ్ ఏరియల్ కేబుల్ ఆపరేటర్స్ ఆధ్వర్యంలో ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో పెద్దఎత్తున మహాధర్నా చేపట్టారు.

ఈ ధర్నాకు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, చికోటి ప్రవీణ్ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 యేళ్లుగా కేబుల్ ఆపరేటర్లుగా ఐదు లక్షల మంది ఉపాధి పొందుతూ ఉంటే ఎప్పుడూ లేని సమస్య ఇప్పుడు ఎందు కొచ్చిందని ప్రశ్నించారు. కేబుల్‌వైర్లను కట్ చేయటం వెనుక రేవంత్‌రెడ్డి కుటుంబం పెద్దకుట్ర ఉందని, కేబుల్‌వైర్లు కట్‌చేసి వారి ఉపాధిని దెబ్బతీసి, తానే కేబుల్ కంపెనీ పెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి, విద్యుత్ స్తంభాలపై ఉన్న కేబుల్‌వైర్లను కట్ చేయటం మానుకోవా లని, వెంటనే చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే కేబుల్ ఆపరేటర్లతో కలసి, ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

# సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు గ్రీన్‌సిగ్నల్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ఏర్పాటు చేయనున్న సూపర్ థర్మల్ కేంద్రానికి కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లాలో ఎన్టీపీసీ నిర్మించ తలపెట్టిన తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు (టీఎస్‌టీపీపీ)కు కేంద్రం నుంచి అనుమతి లభించింది. 2,400 మెగావాట్ల సామర్థ్యం గల టీఎస్‌టీపీపీ రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ పర్యావరణ అనుమతులు (ఈసీ) ఇస్తూ సర్క్యులర్ జారీ చేసింది. ఎనిమిది నెలల తరువాత కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ క్లియరెన్సును ఇచ్చింది.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

# నవంబరు 2న 'మాలల రణభేరి మహాసభ'

### మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య

**హైదరాబాద్ (ప్రభాత్), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** దేశంలో మనువాద పార్టీలు ఓటు బ్యాంక్ రాజకీయాల్లో భాగంగా దళితులను చమార్-నాన్ చమార్‌లుగా విభజించి, ఐక్యతను బీల్చి రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రనే ఈ వర్గీకరణ అంశమని మాల మహానాడు జాతీయ, రాష్ట్ర కమిటీలు ఆరోపించాయి. ఈ వర్గకరణను దేశంలో దళితులు స్థాపించిన పార్టీలు ఆర్‌పిఐ, బిఎస్పీ, లోక్‌జనశక్తి, దళిత ఫాంథర్స్ తదితర వ్యతిరేకిస్తు న్నాయంటే మనువాద పార్టీల కుట్రలను మనం అర్థం చేసుకోవచ్చునని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య చెప్పారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలుగు రాష్ట్రాల అధ్యక్షులు బూర్గుల వెంకటేశ్వర్లు, కొమ్ముతోటి పాలేంతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యా, ఉద్యోగ రంగాల్లో వెనుకబడ్డ కులాలకు న్యాయం జరిగేలా వారిలోని వెనుకబాటు తనాన్ని గుర్తించి ప్రస్తుత జనా భాకు అనుగుణంగా వర్గీకరణ చేయాలని సుప్రీంకోర్టు సూచిస్తే, ఆ సూచన లను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకుండా కేవలం ఒకే కులానికి లబ్ది చేయాలన్న సిఎం రేవంత్‌రెడ్డి సూచనల మేరకు షమీమ్ జస్టిస్ అక్తర్ కమిషన్ హడావుడిగా 2011 జనాభా ప్రకారం అన్ని రంగాలలో అభివృద్ధి చెందినవారికే రిజర్వేషన్‌లు దోచిపెట్టిందని ఆరోపించారు. మాలలకు ఇచ్చిన 5 శాతం రిజర్వేషన్‌లను దక్కకుండా రోస్టర్ పాయింట్‌లను కేటాయించి అన్ని రంగాలలో మాలలను అణిచివేసేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన ఆరోపించారు. ఇందుకు నిరసనగా నవంబరు 2వ తేదీన లక్షలాది మంది మాలలతో 'చలో హైదరాబాద్' పేరిట 'మాలల రణభేరి మహాసభ'ను నిర్వహిస్తున్నామని చెన్నయ్య చెప్పారు. ఈ మేరకు ఈ రణభేరికి సంబం ధించిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు.

# ఫీజులు చెల్లించక మూతపడుతున్న కాలేజీలు

### తక్షణమే బకాయిలు విడుదల చేయాలి

### ఎంపి. ఆర్.కృష్ణయ్య డిమాండ్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఫీజుల బకాయిలు చెల్లించక పోవడంతో కాలేజీలు మూత పడుతున్నాయని దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఎంపి.ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లోని బిసిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజుల బకాయిలు ఇవ్వకపోతే ఎమ్మెల్యేలు ఎంపీలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ నెల 15 నుంచి రాష్ట్రంలో అన్ని ఇంజనీరింగ్, ఇతర వృత్తి విద్యా కాలేజీలు 17 నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు నిరవధికంగా బంద్ చేస్తామని ప్రకటించడాని ఇది చాలా సీరియస్ సమస్య అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 22 నెలలు గడుస్తున్నా 20 రూపాయలు కూడా విడుదల చేయకుండా అన్యాయం చేస్తుందన్నారు. ఒకవైపు సిఎం రేవంత్ రెడ్డి బిసిల అభివృద్ధికి తెలంగాణ రోల్ మోడల్ అంటూ ప్రకటనలు చేస్తూ ..ఇక్కడ పేద కులాలు చదువుకోకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. చదువుకుంటున్నందుకు ఫీజులు కూడా ఇవ్వని ప్రభుత్వం రేపు బి.సి రిజర్వేషన్లు 42 శాతంకు పెంచుతామంటే ఎలా నమ్ముతామని ప్రశ్నించారు. ఫీజులు చెల్లించకపోవడంతో సమస్యను నీరుగారుస్తూ ఈ స్కీమును ఎత్తివేసే కుట్ర జరుగుతుందని విమర్శించారు. ఈ స్కీము పెట్టిన తర్వాత గ్రామాల్లో వ్యవసాయ కూలీల పిల్లలు, మెడిసిన్, ఇంజనీరింగ్, పీజీ, డిగ్రీలు చదువుతున్నారు, సమాజంలో గుణాత్మకమైన మార్పు ప్రారంభమైంది వైట్ లేబర్, అరికట్టబడిందన్నారు.

# ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

### ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే ఈ దుస్థితి

### కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లిం చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఆందోళన బాటపట్టిన విషయం తెలిసిందే. ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బందు పిలుపునిచ్చారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ప్రైవేటు కాలేజీల యాజ మాన్యాలు, విద్యార్థుల సమస్యలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. రాష్ట్రంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు యువతను నిలువునా మోసం చేశాయని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించక ప్రైవేటు కళాశాలలు మూతపడే దుస్థితి వచ్చాయని బండి సంజయ్ అన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో విద్యార్థులు తమ సర్టిఫికెట్లను కళాశాలల నుంచి తీసుకోలేకపోతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక యాజమాన్యాలు, సిబ్బంది జీతాలు లేక అవస్థలు పడుతున్నారని, తాము నమ్ముకున్న సంస్థలు కళ్లెదుటే కూలిపోతున్నాయని అన్నారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ పాలనా వైఫల్యమేనని అన్నారు. కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు కనీసం గ్రూప్-1 పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేకపోయారని మండి పడ్డారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలతో విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాలను కోల్పోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రైవేటు కళాశాలల సమస్యలు పరిష్కరించాలని, ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

# విద్యార్థులే దేశ కార్పొరేట్‌రంగ భవిష్యత్తు నేతలు

### నల్సార్‌లో జరిగిన ముగింపు సదస్సులో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ




శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో జరిగిన ముగింపు సదస్సులో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ

**శామీర్‌పేట, (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** విద్యార్థులే భారతదేశ కార్పొరేట్ రంగానికి భవిషత్ నాయకులు అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పేర్కొన్నారు. శనివారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ లా యూని వర్సిటీలో ఇన్‌స్టూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసిఎస్ఐ), నల్సార్ లా యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల సదస్సు ముగిసింది.

రెండు రోజుల పాటు జరిగిన చర్చల తరువాత రెండు రోజుల వార్షిక కార్యక్రమం కార్పోరేట్ గవర్నెన్స్ కాన్ఫరెన్స్-2025 (కార్పవ్ కన్ 2025) నల్సార్‌లోని సార్క్ లా హాల్‌లో ముగిసింది. ఈ సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ దేశ కార్పొరేట్ భవిషత్‌ను రూపొందించటంలో కీలకమైన స్థంభాలుగ నీతి, బాధ్యత అని ఆ స్థిరత్వాన్ని స్పష్టం చేశారు. 2016లో ఇన్సాలెన్సీ అండ్ బ్యాంక్రప్పీ కోడ్ వంటి మైలురాయి సంస్కరణలో ఒకటని, ఇది నిశ్చయతను తెస్తుందని, రుణదాతల విశ్వాసాన్ని పునరుద్ధ రిస్తుందన్నారు.

అదేవిధంగా జవాబుదారీ తనంను నిర్ధారిస్తుందన్నారు. ప్రతి పౌరుడిలాగ కార్పొరేట్ పౌరులు కూడ న్యాయంగా, పారదర్శకత, సుస్థిర అభివృద్ధి ప్రకృతి సమ తుల్యం పట్ల బాధ్యతను కలిగి ఉంటుందన్నారు. స్థానిక గిరిజన సమాజాల నుంచి కూడ కార్పోరేట్ నిపుణులు పాఠాలు నేర్చుకోవాలన్నారు.

స్థానిక గిరిజన సమాజాలు ప్రకృతి వనరులను వస్తువులను మాత్రమే చూడవని, అవి ప్రకృతితో సామరస్యంగా జీవిస్థాయని అన్నారు. మనం భూమి యజమానులం కాదని మనం గుర్తించాలన్నారు. దాన్ని పంచుకోవటానికి, నిలబెట్టటానికి మేము ఇక్కడ ఉన్నాం, విద్యార్థులు, పాల్గొనే వారు నైతిక విలువలు, ఉద్దేశ్యం, ప్రతిబింబాలను వారి చర్యలలో అనుసంధానించాలని అన్నారు.

ఈ సమావేశం మిమ్మల్ని ఆలోచింపచేస్తుందని, మిమ్మల్నీ అనుభూతి చెందిస్తుందని, నేర్చుకునేలా చేస్తుందన్నారు. నేర్చుకోకుండ కూడ చేస్తుందన్నారు.

కార్పోరేట్ భవిషత్‌ను రూపొందించటంలో విద్యార్థుల పాత్రను గవర్నర్ ప్రశంసించారు. స్థిరమైన అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను గవర్నర్ తెలియజేశారు. స్థిరత్వం లేకుండ అభివృద్ధి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్సార్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీకృష్ణదేవరావు, ప్రముఖులు సిఎస్ఆర్ వెంకటరమణ, సిఎస్‌బి నరసింహన్, నల్సార్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎన్.వాసంతి, పలువురు అద్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి కెటిఆర్‌ను చూస్తే జాలేస్తుంది!

### పార్టీ ఫిరాయింపులపై ఏం మాట్లాడిన ప్రయోజనం లేదు

### దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్‌ను చూస్తే జాలేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి అన్నారు. శనివారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కెటిఆర్ ఇంట్లో ఉండలేక.. ఫామ్ హౌస్‌లో కూర్చోలేక బయట గాలికి తిరగడానికి సిద్ధమయ్యాడని అన్నారు. చెల్లెలు పోరు ఒక వైపు, బావ నసుగుడు మరో వైపు, అయ్య సతాయింపు మరో వైపు కెటిఆర్ తట్టుకోలేకపోతున్నాడని అన్నారు. నాయకులు, కార్యకర్తలు ఎవరి దారి వాళ్ల చూసుకుంటుండటంతో ఏం చేయాలో తెలియక జిల్లాల దారి పడుతున్నాడని అన్నారు. బిఆర్ఎస్ సచ్చిపోయిందని, నువ్వెన్ని లేపనాలు పూసినా ఉపయోగం లేదని అన్నారు. అందులో నుంచి మీ అవినీతి కంపు వాసన తప్ప ఇకొక్కటి రాదన్నారు. నువ్వెంత తిరిగినా నీకు, మీ నాయకులకు డిజిల్ ఖర్చు తప్ప ఉపయోగం లేదన్నారు. ప్రజలు మమ్మల్ని నమ్మడం మానేశారు, మీ చెత్త కబుర్లు వినిడానికి తెలంగాణ ప్రజలు అమాయకులు కాదని అన్నారు. మీరెన్ని కబుర్లు చెప్పినా మీ పదేళ్ల పాపాలను జనాలు మరిచిపోలేదని, మీ పాపం పండే మిమ్మల్ని ఫామ్ హౌస్‌లోకి విసిరేశారని అన్నారు. సోషల్ మీడియా స్టంట్ల కోసం కెటిఆర్ సభలు పెడుతున్నాడని, పదేళ్ల అవినీతి సంపాదనతో సోషల్ మీడియా పెట్టుకుని పాడే మీద ఉన్న పార్టీకి బహుబలి రేంజ్‌లో కలరింగ్ ఇస్తున్నారని, మీ సోషల్ మీడియా బిల్డప్‌లను జనం చూసి నవ్వుకుంటున్నారని అన్నారు.

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ఏ మోహం పెట్టుకుని వెళ్తున్నావు? జిల్లాకు ఏం చేశారు మీరు? మీ పదేళ్ల పాలన చూసి పాలమూరు జనం మోహం మీద ఊసి పంపించారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్ సభ ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించారు..మూడో స్థానానికి పరిమితం చేశారు..పాలమూరు రంగారెడ్డి పూర్తి చేయలేదని అన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను ఎక్కడిక్కడ వదిలేశారని, కుర్చీ వేసుకుని కూర్చోని ప్రాజెక్టులను పూర్తి చేస్తానని చెప్పి ఓట్లు వేయించుకుని అన్యాయం చేశారన్నారు. పదేళ్లలో చేనేత శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ గద్వాలలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశారన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం సగం పనులు చేసిపోయాడని, జూరాలను గాలికి వదిలేశారని అన్నారు. మా ప్రభుత్వం 120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తుందన్నారు. మా పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయ్యాక మాకు ఏ పార్టీ అవసరం మాకు లేదు.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన కెటిఆర్ నోటీకొచ్చినట్లు మాట్లాడుతున్నారని, అది మంచిది కాదన్నారు. పార్టీ ఫిరాయింపులపైన కేటీఆర్ ఏం మాట్లాడినా ఉపయోగం లేదు, జనం మమ్మల్ని క్షమించరని అన్నారు.

# గద్వాలలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు ఏమైంది?

### కెటిఆర్‌ను ప్రశ్నించిన

### మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** మాజీ మంత్రి కెటిఆర్ గద్వాలకు ఏ ముఖం పెట్టుకుని వస్తావు అంటూ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ ప్రశ్నించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పదేళ్ల పాటు చేనేత శాఖ మంత్రిగా ఉన్న కెటిఆర్ గద్వాలలో టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి చేనేత కార్మికలను మోసం చేశాడన్నారు. శంకుస్థాపన ఫలకం చుట్టు పిచ్చి మొక్కలు మొలిచాయని, కెటిఆర్ వెళ్లి చూడాలన్నారు. తుమ్మిల ప్రాజెక్టును పూర్తి చేస్తానని చెప్పి సగం సగం పనులు చేసిపోయారన్నారు. సరైన సౌకర్యాలు కల్పించకుండానే వంద పడకల ఆస్పత్రి రిబ్బన్ కట్ చేసి పోయాడన్నారు. 10 ఏళ్లలో 4 మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలనలలో వంద పడకల ఆస్పత్రిని అన్ని సౌకర్యాలతో ప్రారంభించుకున్నామన్నారు. మా ప్రభుత్వ హయాంలో మల్లమ్మ గుంటకు సర్వే పనులు ప్రారంభమయిందన్నారు.

120 కోట్లతో జూరాల పైన కొత్త బ్రిడ్జిని నిర్మిస్తున్నామన్నారు. పదేళ్లలో నడిగడ్డ ప్రజలను మోసం చేశాడన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపైన స్త్రీ లింగం, పురుష లింగం అంటు కెటిఆర్ విమర్శలు చేస్తున్నాడని, టికెట్ ఇచ్చేటప్పుడు ఏ లింగమో నీకు తెలియదా అంటూ ప్రశ్నించారు. 10 ఏళ్లలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అడ్డగోలుగా కాలరాశారు అన్నారు. నేను కాంగ్రెస్ విప్‌గా ఉన్నప్పుడు మా పార్టీ ఎమ్మెల్యేలను ఐదుగురిని, టిడిపి ఎమ్మెల్యేలను 15 మందిని బిఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. కెసిఆర్ ఫిరాయింపులపైన తానే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశానని, మీరు చేస్తే సంసారం, వేరే వాళ్లు చేస్తే వ్యభిచారమా? అంటూ ప్రశ్నించారు. కెసిఆర్ రాజకీయాలను వ్యభిచారంగా మార్చారని, నడిగడ్డకు వచ్చే అర్హత కెటిఆర్‌కు లేదన్నారు. ఇక్కడి ప్రజలు తిరగబడతారన్నారు. నడిగడ్డకు వచ్చి నువ్వు ఉద్ధరించేది ఏమీ లేదని, రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని, గద్వాల జిల్లాలపైన మీ చెల్లెను చూసుకోలేవు...నీ వల్లనే బిఆర్ఎస్ మునిగిపోతుందని మీ కార్యకర్తలే అంటున్నారు. నడిగడ్డ ప్రజలు బుద్ధి చెపుతారన్నారు.

# ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుంటేనే దేశం మనుగడ

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

### కూనంనేని సాంబశివరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** వికసిత భారత్, అమృత్ కాల్ అంటే కేవలం అదానీ అంబానీలకే, కార్మికలోకానికి, సామాన్య ప్రజలకు కాదని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్ (ఎఐబిఈఎ) జాతీయ ప్రధాన కార్య దర్శి సిహెచ్.వెంకటాచలం సిహెచ్. వెంకటాచలం అన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐసిబిఈఎఫ్) ఉభయ రాష్ట్రాల 37వ మహాసభ, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ యూనియన్ (సిబిఐఓయు) 13వ త్రైవార్షిక సభలు సంయుక్తంగా శుక్రవారం కాచిగూడలో జరిగాయి. ఈ మహాసభలను వెంకటాచలం ప్రారంభించి మాట్లాడారు. నేడు బ్యాంకుల్లో వివిధ రూపాల్లో రూ.250 లక్షల కోట్లకు పైగా ప్రజాధనం ఉందని, ఇది ప్రభుత్వ బడ్జెట్ కంటే ఎక్కువ అని, ఈ ధనం అంతా సామాన్య ప్రజలదే తప్ప ప్రభుత్వానిది కాదని, ఈ డబ్బును కాపాడవలసిన బాధ్యత ఉద్యోగులపై ఉందని అన్నారు. ప్రైవేట్ బ్యాంకులన్నీ ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నాయని, అయినప్పటికీ పాలకులు ప్రైవేట్ బ్యాంకులను ప్రోత్సహిస్తూ దశాబ్దాల తరబడిగా ప్రజలకు అండగా ఉంటూ వారి ఆర్థిక పరిస్థితులను మెరుగు పరచడానికి కృషి చేస్తున్న ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికి పాలక వర్గాలు కుట్రలు పన్నుతున్నాయని ఆరోపించారు. వ్యవసాయం, ఉత్పత్తి రంగాలు, చిన్నతరహా పారిశ్రామిక రంగం కూడా అతలాకుతలం అవుతుందని, అయినప్పటికీ ప్రభుత్వం మోసపూరిత ప్రకటనలు చేస్తూ సామాన్య ప్రజలను మభ్య పెడుతుందని విమర్శించారు. ఉద్యోగులు, కార్మికులు ఐక్యంగా కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని కాపాడు కుంటేనే ఈ దేశం మనుగడ సాధ్యమోతుందని ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు అన్నారు. బ్యాంకుల ఉద్యోగుల హక్కులు కాపాడటంలో ఎర్రజెండా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. భారత బ్యాంకింగ్ సెక్టార్ ప్రధాన యూనియన్ నేతృత్వం వహిస్తున్న వెంకటాచలం బ్యాంకింగ్ సంఘాల న్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చారని అభినందించారు. ఎపిటిబిఇఫ్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ బ్యాంకులను పరిరక్షించు కోవాలని, పాలకుల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. సెంట్రల్ బ్యాంక్ ఉద్యోగులు ప్రభుత్వ రంగ బ్యాంక్ నిలబెట్టుకోవాలని, ఇందు కోసం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎఐబిఈఎ సభ్యులు మరింత సంఘటితంగా పోరాడాలన్నారు.



ఎఐబిఇఎ, ఎఐసిబిఇఎఫ్ మహాసభలో పాల్గొన్న జాతీయ ప్రధాన కార్యదర్శి సిహెచ్.వెంకటాచలం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాంబాబు తదితరులు

# బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలి

### ఎంపి డికె అరుణ

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 21వ తేదీ నుంచి 30 తేదీ వరకు తెలంగాణలో జరిగే బతుకమ్మ పండుగ సంబరాలను విజయవంతం చేయాలని ఎంపి డికె అరుణ పిలుపునిచ్చారు. శనివారం ఉదయం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌లోని నివాసంలో సంస్కార భారతి తెలంగాణ మాతృ శక్తి విభాగం వారితో కలిసి బతుకమ్మ సంబరాలకు సంబంధించిన పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ ఈ సంవత్సరం సంస్కార భారతి తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బతుకమ్మ ఉత్సవాల్లో మహిళలంతా కలిసి మెలసి బతుకమ్మను ఆడుతూ మన సంస్కృతిని చాటుదాం అని పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కార భారతి మాతృ శక్తి రాష్ట్ర కన్వీనర్ నెల్లుట్ల సుష్మా, సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి భవాని, రంగోలి విభాగం కన్వీనర్ జయశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మీ ్ర, యాక్టింగ్ విభాగం రాష్ట్ర కో కన్వీనర్ స్వాతి, లావణ్య, సంతోషి, పారిజాత, శ్రీవిద్య, లావణ్య, నర్మద తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1, 2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షలు పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వేలాది మంది నిరుద్యోగులు హైదరాబాద్ అశోక్ నగర్ లైబ్రరీ, వివిధ ఇన్‌స్టిట్యూట్స్ దగ్గర రాత్రిపగలు చదువుతూ, ఉద్యోగ అవకాశాల కోసం వేచి ఉన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వక, ఏ విధమైన స్పష్టత లేకుండా వ్యవహరిస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అన్యాయం చేసిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరిని అవలంబిస్తుందన్నారు. నిరుద్యోగులను రోడ్డుపైకి తీసుకువచ్చి, కఠినంగా, నిరక్ష ్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. 35,000, 1,00,000 ఉద్యోగాలు ఇచ్చాం అని చెప్పడం మాత్రమే, నిజమైన లెక్కలు చూపడం లేదు. జాబ్ క్యాలెండర్ ప్రకారం, యుపిఎస్ తరహా తెలంగాణ పబ్లిక్ కమిషన్ సైతంపరీక్షలు సమయానికి నిర్వహించాలన్నారు. నిరుద్యోగులు ఆమరణ నిరాహార దీక్షకు దిగకముందే, రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ఓటు బ్యాంకు కోసం ఒకేలా కాంగ్రెస్, బిఆర్ఎస్ శైలి

### నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** ఓటు బ్యాంకు కోసం బిఆర్ఎస్ ఇప్పుడు కాంగ్రెస్ ఒకే రకంగా ప్రవర్తిస్తున్నాయని నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్ ఆరోపించారు. హిందువులన్నా, హిందూ పండగలన్నా చులకన భావంతో చూస్తున్నారని మండిపడ్డారు. శనివారం నిజామాబాద్ కమిషనరేట్‌లో సిపిని కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఇటీవల నవీపేటలో ఒక యువకుడు గణపతిపై కాషాయ జెండా ఎగురవేస్తే ఫోటోలో అది మసీదుపై పెట్టినట్లు వచ్చిందని దాంతో ఆ యువకుడిని ఆగమేఘాల మీద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారన్నారు. ఈ ఘటన తర్వాత అక్కడ ముస్లింలు బైక్ ర్యాలీ నిర్వహించి రబసా చేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. మేము డిమాండ్ చేశాక చర్యలు తీసుకున్నారని చెప్పారు. జెండా ఎగురవేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న యువకుడు రాజస్థాన్‌కు చెందిన వాడని అతడిని రాజస్థాన్ పంపాలని అంటున్నారు. మరి దేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి ఎందరో అక్రమంగా ప్రవేశించారు. టర్కీ నుంచి వచ్చి తరతరాలుగా ఇక్కడే ఉంటున్న కూడా వెనక్కి పంపిద్దామా కాంగ్రెస్ చెప్పాలన్నారు. తప్పు చేసిన వారిని అరెస్టు చేయాలి తప్ప మతం ఆధారంగా చర్యలు తీసుకుంటే సమాజంలో విభజన వస్తుందని హెచ్చరించారు. జిల్లాల్లో టెర్రరిస్ట్ యాక్టివిటీస్ పెరిగాయని, బోధన్ పిఎఫ్, సిమిక్ అడ్డగా మారాయని వీటి వల్ల ప్రజలు భయాందోళనలో ఉన్నారని చెప్పారు. లా అండ్ ఆర్డర్ సరిగా లేదని ఆరోపించారు. ఎన్‌జిఓల పేరుతో హిందూ అమ్మాయిలను ముస్లిం యువకులు పెళ్లి చేసుకుంటే ఆర్థికంగా సహాయం చేస్తామని అంటున్నారని ఇది లవ్ జిహాద్ అంటారన్నారు. ఈ పరిస్థితికి వస్తే ఇక్కడున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఏంచేస్తుందని ప్రశ్నించారు.

# రాష్ట్రంలో యూరియా కృత్రిమ కొరత


### బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సమయానికి యూరియాను అందించడంలో విఫలమయ్యారని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ అన్నారు. రాష్ట్రంలో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించడం విషయంలో భారతీయ జనతా పార్టీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. రైతులు రోజూ యూరియా కోసం కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిలబడి వేచిచూసినా, ఆఖరుకు కొంతమంది ఖాళీ చేతులతోనే వెళ్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి, కాంగ్రెస్ కేబినెట్ మంత్రులు ఎప్పటికీ రైతులకు హామీలు ఇస్తూనే ఉంటారు. కానీ సూర్యాపేట్ వంటి జిల్లాల్లో రైతులు సరిపడా యూరియా పొందక ఇబ్బంది పడుతున్నారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని చెబుతున్నా, మరోవైపు రైతులకు ఎందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయంటూ ప్రశ్నించారు.తెలంగాణలో 2024-25 రబి సీజన్ కోసం 9.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా, కేంద్ర ప్రభుత్వం 12.02 లక్షల మెట్రిక్ టన్నులను పంపించిందని, ఇది అవసరానికి మించి 3 లక్షల టన్నులు ఎక్కువ అన్నారు. అయితే ఆ యూరియా ఎక్కడికి పోయిందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని, అది మాయమైందా, లేక బ్లాక్ మార్కెట్‌కి వెళ్ళిందా? అని ఎన్.వి.సుభాష్ మండిపడ్డారు. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పాలనలో రైతులు రాజులాగా జీవిస్తున్నారని చెబుతున్నారు.

### వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని

# కన్నకూతురినే కడతేర్చిన తల్లి

**శివ్వంపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని కన్నకూతురినే ఓ కసాయితల్లి హత్య చేసిన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. తూప్రాన్ డిఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని శభాష్‌పల్లి గ్రామానికి చెందిన బొట్టు మమతకు ఐదేళ్ల క్రితం రాయపోల్ మండల్ వడ్డేపల్లికి చెందిన భాస్కర్‌తో వివాహం జరిగింది. వీరికి కుమారుడు చరణ్, కూతురు తనుశ్రీ ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవ కావడంతో మమత తన పిల్లలతో తల్లిగారి ఇంటివద్దనే ఉండేది. శభాష్‌పల్లికి చెందిన ఫయాజ్ అనే వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండడంతో జూన్ 7న ఫయాజ్‌తో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయారు. కొడుకు చరణ్‌ను పుట్టింట్లో వదిలేసి కూతురు తనుశ్రీని వెంట తీసుకొని వెళ్లింది. మమత తల్లి.. కూతురు కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు. మమత, ఫయాజ్‌లను గుంటూరులో అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా మమత వద్ద కూతురు లేకపోవడంతో పోలీసులు ఏం చేశా రంటూ విచారించగా తమ వివాహేతర సంబంధానికి అడ్డుగాఉందని శభాష్‌పల్లి గ్రామశివారులో చంపి పాతిపెట్టామని ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ సిఐ రంగకృష్ణ, స్థానిక ఎస్ఐ మధుకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తనుశ్రీ (ఫైల్)

MN 12 ONG_14-09pg10exBV.qxd 9/13/2025 10:36 PM Page 1



### ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో

## షూటర్ ఇషాకు స్వర్ణం



**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ నింగ్బో-2025 మహిళల ఎయిర్ పిస్టల్ విభాగంలో భారత్ షార్ప్ షూటర్ ఇషా సింగ్ బంగారు పతకం గెలుచుకుంది. దీంతో మహిళల ఎయిర్ పిస్టల్‌లో భారత్ ఇప్పుడు క్లీన్ స్వీప్ పూర్తి చేసి, నాలుగు ప్రపంచ కప్ టైటిళ్లను కైవసం చేసుకుంది. శనివారం చైనాలో జరిగిన ఈ ప్రపంచ కప్ నింగ్బోలో మహిళల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ తన సత్తా చాటింది. ప్రపంచ కప్‌ను సవాలుతో ఆరంభించిన తర్వాత, మొదటి నాలుగు రోజుల్లో భారత్ షూటర్లు ఎవరూ ఫైనల్స్‌కు చేరుకోలేక టోర్నీ నుండి నిష్క్రమించారు. కానీ ఈషా, రిథమ్ సంగ్వాన్ ఇద్దరూ ఒకే ఈవెంట్‌లో ఫైనల్‌కు అర్హత సాధించడం ద్వారా పొడి స్పెల్‌ను అధిగమించారు. అయితే, రిథమ్ పతకాన్ని కోల్పోయి ఫైనల్‌లో ఐదవ స్థానంలో నిలిచింది. ఇషా మాత్రం దీన్ని పూర్తిగా ఉపయోగించుకుని తన సొంత ఫేవరెట్ అయిన యావో క్వియాన్‌క్సన్‌ను 0.1 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫలితంగా భారత్ ఇప్పుడు 2025 ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ సర్క్యూట్‌లో మహిళల ఎయిర్ పిస్టల్‌లో క్లీన్ స్వీప్‌ను పూర్తి చేయగా, ఈ సీజన్‌లోని నాలుగు బంగారు పతకాలను గెలుచుకుంది. ఈ విభాగంలో మొదటి మూడు బంగారు పతకాలను లిమా (పెరూ), బ్యూనస్ ఎయిర్స్ (అర్జెంటీనా) మరియు మ్యూనిచ్ (జర్మనీ) లలో వర్ధమాన తార సురుచి సింగ్ గెలుచుకున్నారు.

### హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్‌కు

## సాత్విక్, చిరాగ్ జోడీ




**న్యూఢిల్లీ:** హాంకాంగ్ ఓపెన్ 2025లో చైనీస్ తైపీకి చెందిన జంటను ఓడించి భారత్ బ్యాడ్మింటన్ జోడీ టైటిల్ పోరుకు సిద్ధమైంది. శనివారం జరిగిన ఈ టోర్నమెంట్‌లో సాత్విక్ సాయిరాజ్ రాంకిరెడ్డి-చిరాగ్ శెట్టి ద్వయం చైనీస్ తైపీ జోడీ బి. లిన్-సికె చెన్‌లను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. వరుస గేమ్‌ల విజయంతో వారు ఈ టైటిల్ షాట్‌ను ముగించారు. ప్రపంచ 9వ ర్యాంక్‌లో ఉన్న ఈ జోడీ చైనీస్ తైపీకి చెందిన బింగ్‌వీ లిన్ మరియు చెన్ చెంగ్ కువాన్‌లను 2-11-7, 21-15 తేడాతో ఓడించి ఆరు సెమీఫైనల్ ఓటముల తర్వాత ఈ సీజన్‌లో తమ తొలి ఫైనల్‌కు చేరుకుంది. ఎనిమిదో సీడ్ ఇండియన్స్ జట్టు చైనాకు చెందిన లియాంగ్ వీ కెంగ్ మరియు వాంగ్ చాంగ్ మరియు చైనీస్ తైపీకి చెందిన ఫాంగ్‌చిహ్ లీ మరియు ఫాంగ్‌జెన్ లీల మధ్య జరిగే మరో సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. కాగా సాత్విక్, చిరాగ్ లకు ఈ ఫలితం మరొక శిఖరాగ్ర ఘర్షణకు ఒక అడుగు మాత్రమే ఉంది.




### మహిళల హాకీ ఆసియా కప్..

## జపాన్ చేతిలో భారత్ డ్రా

**న్యూఢిల్లీ:** మహిళల హాకీ ఆసియా కప్-2025 జపాన్ చేతిలో భారత్ డ్రా గా ముగిసింది. హాంగ్జౌలో శనివారం జరిగిన చివరి సూపర్ 4 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు జపాన్ చేతిలో 1-1తో డ్రాగా ముగించింది. భారత మహిళల హాకీ జట్టు జపాన్‌పై అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. చైనా, కొరియాను ఓడించినా లేదా మూడు గోల్స్ కంటే తక్కువ తేడాతో ఓటమిని తప్పించుకున్నా, భారత్ మహిళల ఆసియా కప్ ఫైనల్‌కు చేరుకుంటుంది. జపాన్‌తో ఇప్పుడు జరిగిన మ్యాచ్‌లో బ్యూటీ డంగ్ డంగ్ (7వ నిముషం) ద్వారా భారత్ తొలి గోల్ చేసింది. అయితే షిహో కొబయకావా (58) జపనీస్ తరఫున గోల్‌ను సమం చేసింది. పోటీ ప్రారంభంలో భారత్ మెరుగైన ఆరంభాన్ని అందించింది. ఇషికా చౌదరి గోల్ ఫ్రేమ్‌ను తాకింది. ఆ తర్వాత జపాన్ దాడిలో కొన్ని ఎత్తుగడలను వేసింది. కానీ భారత్ బ్యూటీ డంగ్ డంగ్ (7) కొట్టడంతో వెనక్కి తగ్గింది. దీంతో ముంతాజ్ ఖాన్ షాట్‌ను నెట్‌లోకి మళ్లించి 1-0తో స్కోరును సాధించింది. భారత్ దాడిని కొనసాగించి మొదటి క్వార్టర్ చివరి క్షణాల్లో తొలి పెనాల్టీ కార్నర్‌ను సంపాదించింది. రెండవ క్వార్టర్‌లో జపాన్ సమం చేసే లక్ష్యంతో బరిలోకి దిగి మొదటి కొన్ని నిమిషాల్లోనే ముందంజలో ఉంది. జపాన్ కూడా పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. కానీ భారత్ తిరిగి ఆధిక్యంలోకి రావడం ప్రారంభించింది. మూడవ క్వార్టర్‌లో జపాన్ రక్షణకు వ్యతిరేకంగా భారతదేశం ముందుండి ఆడింది. విరామ సమయానికి భారత్ 1-0 ఆధిక్యంలో ఉంది. చివరి క్వార్టర్‌లో జపాన్ సమం చేసే లక్ష్యంతో దాడికి దిగింది. ప్రత్యర్థులపై ఒత్తిడి తీసుకురావడానికి వరుసగా పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుంది. చివరి నిమిషాల్లో, జపాన్ షిహో కొబయకావా (58) ద్వారా గోల్ చేసి 1-1తో ఆధిక్యాన్ని సమం చేసింది.

### సుదీర్ఘ విరామం తర్వాత..

# నేడే హై ఓల్టేజ్ మ్యాచ్

### భారత్, పాకిస్థాన్ మధ్య హోరాహోరీ

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ 2025లో భారత్, పాకిస్తాన్ మధ్య జరగబోయే హైవోల్టేజ్ మ్యాచ్ కోసం ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తుంది. చిరకాల ప్రత్యర్థులైన ఈ రెండు జట్ల మధ్య ఈ నెల 14వ తేదీ ఆదివారం రాత్రి 8 గంటలకు దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మ్యాచ్ జరగనుంది. టీమిండియా, పాకిస్తాన్ రెండు జట్లు గ్రూప్-ఏ లో ఉన్నాయి. ఇది ఈ రెండు జట్లకు రెండవ మ్యాచ్. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా తన మొదటి మ్యాచ్‌ను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో ఆడింది. ఆ మ్యాచ్‌లో టీం ఇండియా 9 వికెట్ల తేడాతో గెలిచింది. అలాగే పాకిస్తాన్ తొలి మ్యాచ్ ఒమన్‌తో జరిగింది. ఇందులో పాక్ 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇప్పుడు ఒకే గ్రూప్‌లోని ఈ రెండు బలమైన జట్లు ముఖాముఖిగా తలపడుతున్నాయి. ఆసియా కప్‌లో తొలి మ్యాచ్‌లో విజయం నమోదు చేసి జోష్‌లో ఉన్న భారత్ అదే ఊపుతో పాకిస్తాన్‌ను చిత్తు చేసే పట్టుదలతో ఉంది. యూఏఈపై భారీ తేడాతో నెగ్గి ఏకంగా +10.483 రన్ రేట్ సాధించింది. అయితే మొదటి మ్యాచ్‌లో ప్రత్యర్థి పసికూన కాబట్టి, ఆ మ్యాచ్ పెద్దగా కిక్ ఇవ్వలేదు. అయితే ఇప్పుడు జరిగే భారత్, పాక్ మధ్య హై ఓల్టేజ్ మ్యాచ్ ఉత్కంఠకలిగిస్తోంది. ఈ సారి పాక్ మ్యాచ్ కోసం ఖరారు చేసిన భారత జట్టులో ఐదుగురు యువ ఆటగాళ్ల ఉన్నారు. వీరు పాకిస్తాన్‌తో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ ఐదుగురు ఆటగాళ్ల జాబితాలో ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ అభిషేక్ శర్మ, వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్, జితేష్ శర్మ ఉన్నారు. వీరితో పాటు యువ సంచలనాలు తిలక్ వర్మ, రింకూ సింగ్ కూడా పాక్‌తో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. యుఏఈతో జరిగిన ఆసియా కప్‌లో మొదటి మ్యాచ్‌లో ఈ ఐదుగురు ఆటగాళ్లలో ముగ్గురికి అవకాశం లభించింది. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సంజూ శాంసన్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఉన్నారు. ఇక పాక్‌తో జరిగే మ్యాచ్‌లో భారత ప్లేయింగ్ ఎలెవన్ బ్యాట్స్‌మెన్లుగా శుభ్ మన్ గిల్, అభిషేక్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్) ఇక ఆల్‌రౌండర్లుగా హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, బౌలర్లుగా కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా ఉండనున్నారు. మరోపక్క పాకిస్తాన్ జట్టులో సల్మాన్ అలీ అఘా (కెప్టెన్), అబ్రర్ అహ్మద్, ఫహీమ్ అష్రఫ్, ఫకార్ జమాన్, హ్యారీస్ రౌఫ్, హసన్ అలీ, హసన్ నవాజ్, హుస్సేన్ టలట్, ఖుష్దిల్ షా, మహమ్మద్ హరీస్(కీపర్), మహమ్మద్ నవాజ్, మహమ్మద్ వసీం జూనియర్, సహిబ్జాదా ఫర్హాన్, సయీమ్ అయుబ్, సల్మాన్ మిర్జా, షాహీన్ షా అఫ్రిది, సుఫ్యన్ మోఖిమ్ ఉన్నారు.







### ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్..

## ఫైనల్‌కు మీనాక్షి

**న్యూఢిల్లీ:** ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ మహిళా బాక్సర్ మీనాక్షి ఫైనల్‌కు చేరింది. లివర్‌పూల్‌లో శనివారం జరిగిన ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో మినాక్షి హుడా ఆధిపత్య ప్రదర్శన ఇచ్చింది. మాజీ ఆసియా ఛాంపియన్‌షిప్ మరియు ప్రపంచ కప్ రజత పతక విజేత అయిన మీనాక్షి, 48 కిలోల సెమీఫైనల్లో ప్రపంచ మాజీ ఛాంపియన్ రజత పతక విజేతపై 5-0 తేడాతో ఆధిపత్య విజయాన్ని నమోదు చేసింది.

జైస్మిన్ లంబోరియా, నుపుర్ షెయోరాన్ వరుసగా 57 కిలోలు, +80 కిలోల సెమీఫైనల్స్‌లో ఒమైలిన్ అల్కాల, సెయ్మా డుజ్టాస్‌లను ఓడించిన ఒక రోజు తర్వాత, మినాక్షి చివరి నాలుగు బౌట్‌లో మంగోలియాకు చెందిన ప్రపంచ రజత పతక విజేత అల్టాంట్‌సెట్సెగ్ లుట్సైఖాన్‌పై విజయం సాధించి బంగారు పతక పోటీకి చేరిన మూడవ భారతీయ మహిళగా నిలిచింది. 52 కిలోల బరువు విభాగంలో 2022 ఆసియా ఛాంపియన్‌షిప్‌ల రజత పతక విజేత, లాంగ్ రేంజర్ మినాక్షి ప్రారంభంలోనే దాడి చేసింది. బలమైన కుడి దెబ్బతో ఆల్టాంట్‌సెట్సెగ్‌ను నేలకూల్చింది. మంగోలియన్ క్రీడాకారిణి స్ట్రెయిట్ షాట్లు కొట్టడం ద్వారా తన దూకుడును ప్రదర్శించింది. కానీ మినాక్షి అద్భుతమైన కదలిక, శక్తి, ఖచ్చితత్వంతో మరో ఏకగ్రీవ రౌండ్‌ను గెలుచుకుని ఫైనల్‌కు దూసుకెళ్లింది. 24 ఏళ్ల ఈ భారతీయ క్రీడాకారిణి కజకిస్తాన్‌కు చెందిన పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత నజీమ్ కైజైబేతో టైటిల్ కోసం జరిగే పోరులో తలపడనుంది.

# ఫోన్‌పేకు ఆర్బీఐ రూ.21 లక్షల జరిమానా

**ముంబయి, సెప్టెంబరు 13:** యూపీఐ చెల్లింపుల రంగంలో అగ్రగామిగా కొనసాగుతూ, త్వరలో ఐపీఓకు రాబోతున్న ఫోన్‌పే సంస్థకు అనూహ్య పరిణామం ఎదురైంది. నిబంధనల ఉల్లంఘన కారణంగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఈ సంస్థకు రూ. 21 లక్షల జరిమానా విధించింది. ప్రీపెయిడ్ పేమెంట్ సాధనాలకు (పీపీఐ) సంబంధించిన నిబంధనలను ఫోన్‌పే పాటించలేదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ముఖ్యంగా కంపెనీకి చెందిన ఎస్క్రో ఖాతాలో ఉండాల్సిన రోజువారీ నిల్వ, కస్టమర్లు, వ్యాపారులకు చెల్లించాల్సిన మొత్తం కంటే తక్కువగా ఉన్నట్లు ఆర్బీఐ తన తనిఖీల్లో గుర్తించింది. అంతేకాకుండా ఈ నిధుల కొరత విషయాన్ని తమ దృష్టికి తీసుకురావడంలో కూడా ఫోన్‌పే విఫలమైందని కేంద్ర బ్యాంకు పేర్కొంది. ఈ ఉల్లంఘనల నేపథ్యంలోనే పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్స్ చట్టం2007 కింద ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపింది. 2023 అక్టోబర్ నుంచి 2024 డిసెంబర్ మధ్య కాలంలో ఫోన్‌పే కార్యకలాపాలపై విస్తృత స్థాయిలో ఆర్బీఐ తనిఖీలు నిర్వహించిది. నిబంధనల ఉల్లంఘనలపై ఎందుకు జరిమానా విధించకూడదో చెప్పాలంటూ కంపెనీకి నోటీసులు జారీ చేసింది. ఫోన్‌పే ఇచ్చిన సమాధానం, విచారణలో వారి వాదనలు విన్న తర్వాత ఈ నెల 10న ఈ జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. అయితే, ఈ జరిమానా కేవలం నియంత్రణాపరమైన చర్య మాత్రమేనని, దీనివల్ల ఫోన్‌పే వినియోగదారుల లావాదేవీలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని ఆర్బీఐ స్పష్టం చేసింది. కాగా, ఈ ఏడాది చివరిలో ఐపీఓకు వెళ్లేందుకు ఫోన్‌పే సన్నాహాలు చేసుకుంటోంది. ఇందుకోసం జేపీ మోర్గాన్, సిటీ గ్రూప్ వంటి ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కూడా చేసుకుంది. ఇలాంటి కీలక సమయంలో ఆర్బీఐ జరిమానా విధించడం పరిశ్రమ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక, ప్రస్తుతం దేశంలో యూపీఐ చెల్లింపుల మార్కెట్‌లో ఫోన్‌పే సుమారు 48.64 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతున్న విషయం తెలిసిందే.






### ఈ యేడాది


### టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం

## 3.2%

### క్రిసిల్‌రేటింగ్స్ అంచనా

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** టోకుధరలసూచీ ద్రవ్యోల్బణం ఈ ఆర్థికసంవత్సరంలో 3.2శాతంగా ఉంటుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనావేసింది. అంతకుముందు సంస్థ చూపిన 3.5 అంచనాలకంటే మరికొంత తగ్గవచ్చని తాజా నివేదికలో ప్రస్తావించింది. రిటైల్‌ద్రవ్యోల్బణం 140 బేసిస్ పాయింట్లు క్షీణత ఈ ఆర్థికసంవత్సరంలో ఉంటుందని ఫలితంగా ఎంపిసి కమిటీలో రెపోరేట్లు సడలించే అవకావం ఉందని అంచనావేసింది. ఆర్బీఐ ఈ ఏడాది 25 బేసిస్ పాయింట్లు కోత విధించే ఛాన్స్ ఉందని తెలిపింది.

తక్కువ ద్రవ్యోల్బణం, వడ్డీరేట్ల తగ్గింపు వంటివి దేశీయ డిమాండ్‌ను పెంచి ఆర్థికవ్యవస్థను గ్లోబల్ సమస్యలనుంచి బయటపడేస్తాయని క్రిసిల్ చెపుతోంది. ఖరీఫ్ సీజన్‌లో సగటుకంటే ఎక్కువ కురిసిన వర్షపాతంతో ఉద్యానవన, ఆహార ఉత్పత్తుల ప్రాంతాలకు కొంత నష్టం జరిగే అవకాశం ఉంది. అంటే పంజాబ్ లాంటి ఆహారోత్పత్తుల రాష్ట్రాలకు ఈప్రమాదం ఉంది. ఆగస్టునెల రిటైల్‌ద్రవ్యోల్బణం 2.1శాతంగా నమోదయింది. జులైలో 1.6శాతంనుంచి స్వల్పంగా పెరిగినప్పటికీ ఆర్బీఐ అంచనాలనున మించి పోలేదు. ఆహార ద్రవ్యోల్బణం మరికొంతపెరగడంతో టోకుధరలసూచీపైనా ఈప్రభావం ఉండవచ్చని క్రిసిల్ విశ్లేషించింది.




## నష్టాలను తగ్గించుకుంటున్న ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్!

**ముంబయి, సెప్టెంబరు 13:** ఫ్లిప్‌కార్ట్ ఇంటర్నెట్ 2025 సంవత్సరంలో 20,493 కోట్ల రాబడులు ఆర్జించిందని కంపెనీ ప్రకటించింది. ముందు ఏడాదికంటే 14శాతం రాబడులు పెంచు కోగలిగింది. దీనివల్లనికరనష్టాన్ని 37శాతం తగ్గించుకుని 1494 కోట్లకు చేరగలిగినట్లు సంస్థక ంపెనీల రిజిస్ట్రారుకు నివేది కిచ్చింది. 2024లో కంపెనీ రాబడులు 21శాతం పెరిగాయి. గడచిన రెండు సంవత్సరాల్లో కూడా రాబడులు క్రమేపీ 20 శాతం పెరుగుతూ వచ్చాయని చెపుతోంది. ఫ్లిప్‌కార్ట్ అనుబంధ విభాగంగా ఉన్న ఇంటర్నెట్ సంస్థ నష్టాలనుంచి ఇపుడిపుడే అధిగమిస్తున్నట్లు వివరించింది. నిజానికి ఫ్లిప్‌కార్ట్ ఆదాయం మొత్తం మార్కెట్‌ప్లేస్ కార్యకలాపాలు, ఈకామర్స్, లాజిస్టిక్స్, వ్యాపార ప్రకటనలనుంచే ఆర్జిస్తోంది. వాణిజ్యప్రకటనలద్వారా 27శాతం వృద్ధిని సాధించి 4973 కోట్లనుంచి 6317 కోట్లకు పెంచుకోగలిగింది. రాబడులు కూడా 7751 కోట్లవరకూ చేరింది. లాజిస్టిక్స్ సేవల్లో మాత్రం తగ్గుదల నమోదయింది. 6838 కోట్లనుంచి 4224కోట్లకు పడిపోయింది. ఇక వ్యయాలపరంగా కూడా 8శాతంపెరిగాయి. 22,311 కోట్లకు చేరింది. ఉద్యోగులకు మేలుచేసే ప్రయోజనాలఖర్చులు 8శాతం తగ్గి 4748 కోట్లకు చేరాయి. ఇక మార్కెటింగ్ ఖర్చులు మాత్రం 37శాతం పెరిగి 4100 కోట్లకు చేరాయి. జులైలో ఫ్లిప్‌కార్ట్ ఉద్యోగులకు ఇఎస్‌ఓపి ప్రకటించింది. 50 మిలియన్ డాలర్ల విలువైన వాటాలను బైబాక్‌చేసింది. దీనివల్ల ఏడువేల మంది ఉద్యోగులకు మేలుజరగనున్నది.

## వడ్డీరేట్లు తగ్గించిన మూడు బ్యాంకులు!

**ముంబయి, సెప్టెంబరు 13:** దేశంలో మూడు బ్యాంకులు వడ్డీరేట్లను సవరించాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్లు ప్రకటించగా ఐడీబీఐ కూడా ఎంసీఎల్ఆర్ సవరించింది. ఈనెల 12వ తేదీనుంచే వడ్డీరేట్లు అమలు చేస్తున్నట్లు బ్యాంకులు ప్రకటించాయి. ఎంపిక చేసిన వేర్వేరు కాలపరిమతులపై ఇది వేర్వేరుగా ఉంటుంది. ఇక్కడ లోన్ వడ్డీ రేట్లు తగ్గితే ఇప్పటికే ఫ్లోటింగ్ రేటుపై లోన్ తీసుకున్న వారు.. తమ లోన్ ఈఎంఐ తగ్గించుకోవచ్చు లేదా టెన్యూర్ తగ్గించుకోవచ్చని చెప్పొచ్చు. బ్యాంక్ ఆఫ్ బరోడా ఎంసీఎల్ఆర్ రేట్లను 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గించింది. ఇక్కడ ఓవర్‌నైట్ ఎంసీఎల్ఆర్ 10 బేసిస్ పాయింట్లు తగ్గి 7.95 శాతం నుంచి 7.85 శాతానికి చేరింది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 7.95 శాతంగా ఉండగా3 నెలల ఎంసీఎల్ఆర్ 8.35 శాతం నుంచి 8.20 శాతానికి చేరింది. 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.65 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ 8.80 శాతంగా ఉంది. ఇది సెప్టెంబర్ 12 నుంచి అమల్లోకి వచ్చింది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ వేర్వేరు టెన్యూర్లపై 5 బేసిస్ పాయింట్ల వరకు



ఎంసీఎల్ఆర్ తగ్గించింది. ఇప్పుడు ఇక్కడ వ్యయాధారిత సగటు వడ్డీరేటు(ఎంసిఎల్ఆర్) 8 శాతానికి తగ్గింది. ఒక నెల, 3 నెలలు, 6 నెలల ఎంసీఎల్ఆర్ వరుసగా 8.3 శాతం, 8.45 శాతం, 8.70 శాతంగా ఉన్నాయి. ఎక్కువగా కన్స్యూమర్ లోన్ ఏడాది ఎంసీఎల్ఆర్‌తో లింక్ అయి ఉంటుంది. ఏడాది, రెండేళ్ల ఎంసీఎల్ఆర్ 8.85 శాతంగా ఉండగా 3 ఏళ్ల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉంది. ఇది సెప్టెంబర్ 15 నుంచి అమల్లోకి రానుంది. ఐడీబీఐ బ్యాంక్ ఎంసీఎల్ఆర్ ఓవర్‌నైట్ 8.05 శాతంగా ఉంది. ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.05 శాతం, ఒక నెల ఎంసీఎల్ఆర్ 8.20 శాతం, 3 నెలల ఎంసీఎల్ఆర్ 8.50 శాతం, 6 నెలల ఎంసీఎల్ఆర్ 8.70 శాతం, ఏడాది ఎంసీఎల్ఆర్ 8.75 శాతం, రెండేళ్ల, మూడేళ్ల ఎంసీఎల్ఆర్ వరుసగా 9.30 శాతం, 9.70 శాతంగా ఉన్నాయి.

### బీహార్‌లో రూ.26,482 కోట్లతో

## అదానీ పవర్ ప్రాజెక్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ఆదానిపవర్ బీహార్‌లో 2400 మెగావాట్ల పవర్‌ప్లాంట్ ఏర్పాటుకోసం 26,482 కోట్ల రూపాయలు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. 25 ఏళ్లపాటు విద్యుత్‌సరఫరా ఒప్పందం బీహార్ రాష్ట్ర విద్యుదుత్పత్తి కంపెనీతో జరిగిందని ఈ ఒప్పందంతో విద్యుత్ ప్లాంట్ నిర్మాణం మరింత వేగంగాపూర్తి చేయనున్నట్లు ప్రకటించింది. కొత్తప్రాజెక్టును భాగల్పూర్ జిల్లాలోని పీర్‌పైంటిలో స్థాపిస్తుంది. పిపిఎ ఒప్పందం బిఎస్‌పిజిసిఎల్‌నుంచి ఆదానిపవర్‌కు అందింది. ఆదానిపవర్ అతితక్కువ సరఫరారేటును కోట్‌చేయడంతో ఈ ప్రాజెక్టును దక్కించుకుంది. కిలోవాట్‌కు 6.075 రూపాయలు వంతున కోట్‌చేసింది. అంతేకాకుండా ఈ పవర్‌ప్లాంట్ ఏర్పాటుకోసం మూడు800 మెగావాట్ల ప్రాజెక్టులు శరవేగంగాపూర్తిచేస్తుంది. డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఓన్, ఆపరేట్ పద్ధతిలో జరుగుతుంది. 60 నెలల్లో ఈప్లాంట్ ప్రారంభం కావాలని షరతులు ఉన్నాయి.

## ఆరుకోట్లకుపైగా ఐటిరిటర్నుల దాఖలు!




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 13:** ప్రస్తుత ఆదాయపు పన్ను అసెస్‌మెంట్ సంవత్సరానికిగానున ఆరుకోట్లకుపైగా ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలుచేసినట్లు ఐటిశాఖ ప్రకటించింది. ఈనెల 15వ తేదీ రిటర్నుల దాఖలుకు చివరితేదీగా ప్రకటించిన సంగతి తెలిసిందే. పన్నుచెల్లింపుదారులను అభినందిస్తూ ఈమేరకు ఐటిశాఖ సోషల్‌మీడియాలో ట్వీట్‌చేసింది. పన్నుచెల్లింపుదారులకు ఐటిఆర్ ఫైలింగ్‌లో సాయంచేసేందుకుగాను హెల్ప్‌డెస్క్ 24 గంటలుపనిచేస్తుందని మొబైల్‌కాల్స్, లైవ్‌చాట్స్, వెబ్‌ఎక్స్ సెషన్లు ట్విట్టర్, ఎక్స్ వంటి వాటిలో సాయం చేస్తున్నట్లు తెలిపింది. 2025-26 సంవత్సరానికి ఇప్పటివరకూ ఐటిఆర్ దాఖలుచేయనివారు సత్వరమే దాఖలుచేయాలని, చివరినిమిషం వరకూ వేచి ఉండవద్దని సూచించింది. గతమేనెలలోనే గడువుతేదీని జులై 31వరకూ పొడిగించి ఆ తర్వాత ఈనెల 15వరకూ పొడిగించింది. ఆదాయపు పన్ను దాఖలు ఫారాల్లోవచ్చిన మార్పులు కోసమే ఈ విధంగా గడువును పొడిగించినట్లు తెలిపారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps